అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

శనివారం 27-1-2024

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 | సంచిక : 336 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు | వెల : 6.50



75వ గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా ఢిల్లీలో ఎన్‌సీసీ క్యాడెట్‌ల కవాతు



తన నివాసంలో జాతీయ జెండాను ఆవిష్కరించిన సీఎం రేవంత్ రెడ్డి



ఖమ్మంలో ట్రాక్టర్లతో రైతుల ర్యాలీ

బీజేపీ విధానాలపై సమరశంఖం

కార్మిక, కర్షక ఐక్యపోరు షురూ..

- కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్, మతతత్వ విధానాలపై నిరసన
- రాష్ట్రవ్యాప్తంగా ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాల ర్యాలీ
- నల్ల చట్టాలను రద్దు చేయాలని డిమాండ్
- మద్దతు ధరకు చట్టం చేయాలని నినాదాలు
- 16న దేశ్వాప్త బంద్

నవతెలంగాణ- విలేకరులు

కార్మికులు, కర్షకులు ఐక్యపోరుకు సమర శంఖం పూరించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై నిరసన గళం విప్పారు. సంయుక్త కిసాన్ మోర్చా, అఖిల భారత కార్మిక సంఘాల సమన్వయ కమిటీ సంయుక్త పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా శుక్రవారం ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాలు, ఆటోలతో ర్యాలీలు చేపట్టారు. పెద్దఎత్తున రైతులు, వ్యవసాయ కూలీలు, కార్మికులు పాల్గొన్నారు. రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. పండిన పంట మొత్తం ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని నేతలు కోరారు. రైతు చట్టాలకు వ్యతిరేకంగా ...11లో

మోడీ సర్కార్‌కు ఇదో హెచ్చరిక

- దేశవ్యాప్తంగా ఎస్‌కెఎం కిసాన్ ట్రాక్టర్ పరేడ్ విజయవంతం వివరాలు 10లో



నియంతృత్వానికి చరమగీతం

భిన్న జాతులు, మతాలు, కులాలను ఐక్యం చేసిన ఘనత రాజ్యాంగానిదే

- దాని స్ఫూర్తికి భిన్నంగా పాలకులు వ్యవహరిస్తే ప్రజాపోరాటాలు తప్పవు
- గత పదేండ్లలో రాజ్యాంగ విలువలు ధ్వంసమయ్యాయి
- సామాజిక న్యాయమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న ప్రజా ప్రభుత్వం
- గణతంత్ర దినోత్సవ వేడుకల్లో గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

"పదేండ్ల నియంతృత్వానికి తెలంగాణ ప్రజలు చరమ గీతం పాడారు. భిన్న జాతులు, మతాలు, కులాలను ఐక్యం చేసిన ఘనత భారత రాజ్యాంగానిది. అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా ప్రపంచ మన్ననలు అందుకుంటూ 74 ఏండ్లుగా ఆ రాజ్యాంగ మార్గదర్శకత్వంలో ముందుకు సాగడమనేది ప్రతి భారతీయుడు గర్వించదగ్గ విషయం. ఈ ఘనత రాజ్యాంగ నిర్మాతలకు, ఈ దేశ ప్రజలకు దక్కుతుంది. దానికి భిన్నంగా పాలకులు వ్యవహరిస్తే ప్రజాపోరాటాలు తప్పవు. గత పదేండ్లలో రాష్ట్రంలో రాజ్యాంగ విలువలు ధ్వంసం అయ్యాయి. నియంతృత్వానికి సమాధికట్టి కొత్తగా ఏర్పాటైన ప్రజా ప్రభుత్వం సామాజిక న్యాయమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నది" అని రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్ అన్నారు. గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని శుక్రవారం హైదరాబాద్ నాంపల్లిలోని పబ్లిక్ గార్డెన్స్‌లో జాతీయ జెండాను ఆమె ఆవిష్కరించారు. తెలంగాణ ప్రజలకు, ముఖ్యమంత్రి, మంత్రివర్గ సహచరులకు, ప్రభుత్వ యంత్రాంగానికి శుభాకాంక్షలు తెలిపి ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం సమాజంలోని అన్ని వర్గాలకు స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు దక్కాలన్న లక్ష్యంతో పని చేస్తోందని గవర్నర్ ఈ సందర్భంగా చెప్పారు., ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చే కార్యాచరణ మొదలైందని తెలిపారు. గ్యారెంటీల్లో రెండు గ్యారెంటీలు ఇప్పటికే అమల్లోకి వచ్చాయి. మిగిలిన గ్యారెంటీలను వంద రోజుల్లో అమలు చేసే దిశగా చర్యలు చేపట్టాం. లబ్దిదారులను ఎంపిక చేసేందుకు డిసెంబర్ 28 నుంచి జనవరి 6 వరకు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించాం. మొత్తం 1,25,84,383 దరఖాస్తులు ప్రభుత్వానికి అందగా, అందులో ఐదు గ్యారెంటీలకు సంబంధించి 1,05,91,636 దరఖాస్తులు వచ్చాయి. ఇతర అభ్యర్థనలకు సంబంధించి 19,92,747 దరఖాస్తులు అందాయి. వీటిని శాఖల వారిగా క్రోడీకరించి, వాటి పరిష్కారానికి కార్యచరణ ప్రణాళికను ప్రభుత్వం ...11లో



ఘనంగా గణతంత్రం

కర్తవ్యపథ్‌పై మువ్వన్నెల జెండా రెపరెపలు

- జాతీయ జెండా ఆవిష్కరించిన రాష్ట్రపతి ముర్ము
- ముఖ్య అతిథిగా హాజరైన ఫ్రెంచ్ అధ్యక్షుడు మాక్రోన్
- నారీ శక్తిని చాటేలా సాగిన రిపబ్లిక్ డే పరేడ్
- పలు కంటెంజెంట్లను ముందుండి నడిపిన మహిళా అధికారులు
- దేశ సైనిక శక్తిని చాటిన త్రివిధ దళాలు, పారా మిలటరీ బలగాలు
- పరేడ్‌లో తెలంగాణ, ఏపీ శకటాలు వివరాలు 10లో

ఇండియా బ్లాక్‌తోనే ఉన్నాం..

అయితే కాంగ్రెస్ ఆత్మపరిశీలన చేసుకోవాలన్న జేడీ(యూ)



పాట్నా : ఇండియా బ్లాక్‌తో ధృడంగా ఉన్నామని, అయితే భాగస్వామి పార్టీలు, సీట్ల సర్దుబాటుపై కాంగ్రెస్ 'ఆత్మపరిశీలన' చేసుకోవాలని బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్‌కు చెందిన జేడీ(యూ) శుక్రవారం స్పష్టం చేసింది. ఈ విషయాన్ని జేడీ(యూ) రాష్ట్ర అధ్యక్షులు ఉమేష్ సింగ్ కుస్వాహా ఒక ప్రకటనలో తెలిపారు. బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏలోకి జేడీ(యూ) తిరిగి వెళుతుందని పుకార్లు వెళువెత్తుతున్న నేపథ్యంలో ఉమేష్ సింగ్ కుస్వాహా ఈ ప్రకటన విడుదల చేశారు. 'బీహార్‌లో అధికారంలో ఉన్న మహా కూటమిలో అంతా బాగానే ఉంది. అయితే ఒక ఎజెండాలో భాగంగా మీడియాలో ఊహాగానాలు నడుస్తున్నాయి' అని మీడియా ...11లో



సినీ పరిశ్రమకు మీరు మూడో కన్ను

- చిరంజీవిని అభినందించిన వెంకయ్యనాయుడు 12లో

తెలంగాణ బలం, గళం వినిపించండి

ఎంపీలకు కేసీఆర్ దిశా నిర్దేశం • ఎర్రవల్లిలో బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ సమావేశం



నవతెలంగాణ-గజ్వేల్

త్వరలో జరగబోయే పార్లమెంటు సమావేశాల్లో తెలంగాణ బలం, గళం వినిపించాలని ఎంపీలకు రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దిశా నిర్దేశం చేశారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గంలోని మర్కుక్ మండలం ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో ఎంపీలు, రాజ్యసభ సభ్యులతో సమావేశం నిర్వహించారు. త్వరలోనే పార్లమెంట్ సమావేశాలు జరగనున్న నేపథ్యంలో సభలో అనుసరించిన అంశాలపై చర్చించారు.

పార్లమెంట్ సమావేశంలో ప్రెసిడెన్షియల్ అడ్రస్, ఓట్ ఆన్ అకౌంట్ రెండు అంశాలపై ఎంపీలు, రాజ్యసభ సభ్యులు తమ వాణిని వినిపించాలని సమావేశంలో చర్చించినట్టు సమాచారం. పార్లమెంటులో తెలంగాణ గళం వినిపించేది భారత రాష్ట్ర సమితి ఎంపీలేనని కేసీఆర్ అన్నారు. కేంద్రం నుంచి తెలంగాణకు రావాల్సిన వాటాలు, కృష్ణా బేసిన్‌లో పెండింగ్ అంశాలపై పార్లమెంటులో లేవనెత్తాలని ఎంపీలకు సూచించారు. పెండింగ్ అంశాలతో రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయాన్ని చర్చకు తీసుకురావాలన్నారు. పార్లమెంటు సమావేశాల్లో విభజన చట్టంలో పొందుపరిచిన విషయాలపై చర్చకు తీసుకురావాలని ఎంపీలను ఆదేశించారు. బీసీ జన గణన, ఎస్సీ వర్గీకరణ, ప్రజల పక్షాన నుంచి ప్రజల కోసం మాట్లాడాలని కేసీఆర్ ఎంపీలకు సూచించారు. తెలంగాణకు సంబంధించిన అన్ని అంశాలను పార్లమెంటులో లేవనెత్తాలని చర్చకు తీసుకొచ్చినట్టు తెలిసింది. ఈ సందర్భంగా ఎంపీ నామ నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యులు కేశవరావు, ఎంపీ రంజిత్ రెడ్డి తదితరులు మాట్లాడుతూ.. పార్లమెంటరీ పార్టీ సమావేశంలో అనేక ...11లో

మా వాళ్లలో కనిపించని అర్హతలు

కోదండరాంలో కనిపించాయా?

ఒక పార్టీకి అధ్యక్షునిగా ఉన్నవ్యక్తిని ఎమ్మెల్సీగా ఎలా ఆమోదిస్తారు..?

- మీరు రేవంత్‌కు బాధ్యులు కారు..
- ప్రజలకు బాధ్యులని గుర్తించుకోండి : గణతంత్ర దినోత్సవ వేడుకల్లో గవర్నర్‌పై కేటీఆర్ విమర్శలు

వివరాలు 11లో



తమ్మినేనికి సీఎం రేవంత్ పరామర్శ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైదరాబాద్‌లోని ఏఐజీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రాన్ని శుక్రవారం ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డి పరామర్శించారు. ఆయన ఆరోగ్య వివరాలను అడిగి సీఎం తెలుసుకున్నారు. ఏఐజీ ఆస్పత్రి చైర్మెన్ నాగేశ్వర్ రెడ్డి, ఇతర వైద్యులని అడిగి మరిన్ని వివరాలు తెలుసుకున్నారు. వాటి పట్ల సీఎం సంతృప్తి వ్యక్తం చేశారు. తమ్మినేని త్వరగా కోలుకోవాలనీ, ప్రజాక్షేత్రంలోకి తిరిగి రావాలని రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. ఈ సమయంలో పలు రాజకీయ, ఇతర అంశాలు వారి మధ్య చర్చకు వచ్చాయి. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసినప్పుడు ఇచ్చిన విజ్ఞాపన పత్రంలోని సమస్యల పరిష్కారం ఎంత వరకు వచ్చిందని తమ్మినేని ప్రస్తావించారు. వాటిని పరిష్కరిస్తామంటూ సీఎం హామీ ఇచ్చారు. అయితే రాష్ట్రంలో తమ్మినేని చేపట్టిన మహాజన పాదయాత్రలో పాల్గొన్నట్టు గత స్మృతులను రేవంత్‌రెడ్డి గుర్తు చేశారు.

ఏఐజీ ఆస్పత్రిని సందర్శించిన వారిలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీపీఆర్వో అయోధ్యరెడ్డి, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ వీరయ్య, జూలకంటి రంగారెడ్డి, పోతినేని సుదర్శన్, ఖమ్మం జిల్లా నాయకులు నవీన్, తమ్మినేని కుమారుడు సంఘమిత్ర తదితరులు ఉన్నారు. గురువారం ఆయనకు మైనర్ ఆపరేషన్ చేసి గుండె వద్ద పేస్ మేకర్‌ను డాక్టర్లు అమర్చారు. ఆరోగ్య పరిస్థితి మెరుగుపడిందనీ, సాధారణ స్థితికి చేరుకుంటున్నారని వారు వివరించారు.

మద్యం మత్తులో రాష్ట్రం

గుప్పుమంటున్న గుడుంబా

- 579 నుంచి 1,874కు పెరిగిన నకిలీ మద్యం కేసులు
- పల్లెలను ముంచెత్తుతున్న చీప్ లిక్కర్
- రోడ్డున పడుతున్న కుటుంబాలు

మద్యం మత్తులో రాష్ట్రం తూగుతోంది. పల్లెలు, పట్టణాల నుంచి మొదలుకుని రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరం వరకు లిక్కర్ ఏరులై పారుతోంది. 2022 సంవత్సరంలో నకిలీ మద్యం, దేశీదారుకు సంబంధించి 579 కేసులు నమోదు కాగా 2023లో 1,874కు చేరుకుని మూడు రెట్లు పెరిగాయి. గుడుంబా కేసులు రెండు రెట్లు పెరిగాయి. సమయ పాలన లేకుండా ఇష్టారాజ్యంగా మద్యం లభిస్తుండటంతో తాగుడుకు బానిసలయ్యే వారి సంఖ్య భారీగా పెరిగి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రం ఏర్పడిన తొలి ఏడాదైన 2014లో మద్యం ద్వారా ఖజానాకు రూ. 10,863 కోట్లు సమకూరగా, అ తర్వాత ఏడాది రూ.12,500 కోట్ల మార్కును దాటింది. వరుసగా పెరుగుదల రేటును నమోదు చేసుకుంటూ 2021లో రూ.30 వేల కోట్లు, 2022లో రూ.36 వేల కోట్లకు చేరింది. ఈ రకంగా రాష్ట్ర ఖజానాకు మద్యమే ప్రధాన ఆదాయ వనరుగా మారింది. పదేండ్లలో దాదాపు రూ.2.5లక్షల కోట్లకు పైగా ఆదాయం ఈ విభాగం నుంచే సర్కారుకు వచ్చింది. గత ప్రభుత్వం ఖజానా నింపుకునేందుకు లిక్కర్ దందాను పెంచి పోషించింది. ఫలితంగా పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా బెల్ట్ షాపులు విస్తరించాయి. రాష్ట్రంలో 12,769 గ్రామ పంచాయతీలుండగా... ఒక్కో గ్రామంలో అనధికారికంగా 5 నుంచి 10 వరకు బెల్ట్ షాపులున్నాయి. మొత్తంగా చూస్తే రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు లక్షకుపైగా బెల్ట్ షాపులుంటాయని గణాంకాలు చెబుతున్నాయి. గ్రామాల్లో కిరణా షాపులు, కిళ్లీ కొట్లు, బెల్ట్ షాపులకు నిలయాలుగా మారాయి. మద్యం దుకాణాల్లో ప్రభుత్వం సూచించిన నిర్దేశిత సమయంలో లిక్కర్ ...11లో

టీఎస్‌పీఎస్సీ చైర్మెన్‌గా మహేందర్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ

సభ్యులుగా అనితా రాజేంద్ర, యాదయ్య, పాల్వాయి రజనీకుమారి

- ప్రమాణం చేయించిన గవర్నర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) చైర్మెన్‌గా మాజీ డీజీపీ పి మహేందర్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. అంతకుముందు హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ఆయనతోపాటు సభ్యులు అనితా రాజేంద్ర, ప్రొఫెసర్ ఎన్ యాదయ్య, పాల్వాయి రజనీకుమారితో ప్రమాణం చేయించారు. అనంతరం వారు కూడా బాధ్యతలను స్వీకరించారు. 75వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా టీఎస్‌పీఎస్సీ కార్యాలయంలో చైర్మెన్ మహేందర్‌రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి అనితా రామచంద్రన్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. టీఎస్‌పీఎస్సీ చైర్మెన్‌తోపాటు ఐదుగురు సభ్యులను ఎంపిక చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం పంపించిన ప్రతిపాదనలను గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ గురువారం ఆమోదించిన విషయం తెలిసిందే. టీఎస్‌పీఎస్సీకి కొత్త పాలకమండలి రావడంతో ఉద్యోగ నియామకాల ప్రక్రియ వేగవంతం అవుతుందని నిరుద్యోగులు ఆశిస్తున్నారు. టీఎస్‌పీఎస్సీ చైర్మెన్ పదవికి డాక్టర్ బి జనార్ధన్‌రెడ్డి గతనెల 11న, ...11లో



హైదరాబాద్‌లో.. బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

24 క్యారెట్లు	63,050	▲	100
22 క్యారెట్లు	57,800	▲	100
కిలో వెండి	78,000	▲	500


చికెన్ ధరలు హైదరాబాద్

బ్రాయిలర్ చికెన్

ఫారం రేటు	రూ.	107
రిటైల్ (లైవ్)	రూ.	129
స్కిన్‌తో	రూ.	187
స్కిన్‌లెస్	రూ.	213

కేరళ గవర్నర్ తీరుతో విభేదించిన సీపీఐ(ఎం)

రాజ్యాంగ స్థాయికి తగినట్లుగా వ్యవహరించలేదంటూ విమర్శ



తిరువనంతపురం : వచ్చే ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వ విధానాలను తెలియచేస్తూ సాగాల్సిన ప్రసంగాన్ని బాధ్యతారాహిత్యమైన, అసమర్థమైన రీతిలో చేయడం ద్వారా కేరళ గవర్నర్ ఆరిఫ్ మహ్మద్ ఖాన్ తన స్థాయికి తగినట్లు కాకుండా దిగజారి వ్యవహరించారని సిపిఎం విమర్శించింది.

ఇక్కడ ఎకెజి సెంటర్‌లో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గం సమావేశానికి అధ్యక్షత వహించిన తర్వాత సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి ఎం.వి. గోవిందన్ విలేకర్లతో మాట్లాడుతూ, జనవరి 25న అసెంబ్లీలో గవర్నర్ ఖాన్ తన రాజ్యాంగ విధుల పట్ల నిర్లక్ష్యంగా, పట్టీపట్టని రీతిలో వ్యవహరించారని విమర్శించారు. "సహకార సమాఖ్యవాదం ప్రాముఖ్యతను నొక్కి చెబుతున్న పేరాగ్రాఫ్‌ను చదవడం ద్వారా ప్రభుత్వ విధాన ప్రసంగంలోని సారాన్ని ఖాన్ ఆచరణాత్మక రీతిలో వెల్లడించారు. అయితే, సభలో గవర్నర్ వ్యవహార శైలి చాలా అవమానకరంగా వుంది. ఆయన ఉన్నత స్థాయికి తగినట్లుగా లేదు." అని గోవిందన్ పేర్కొన్నారు.

గవర్నర్ వివాదాస్పద రీతిలో విధాన ప్రసంగాన్ని చేయడంపై విమర్శలు చేయడం ద్వారా ఖాన్‌ను నిర్బంధించాలని ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం భావిస్తోందనడాన్ని గోవిందన్ తోసిపుచ్చారు.

"గవర్నర్ తన సంప్రదాయ ప్రసంగంలో కోత పెడతారని తొలుత మేం ఊహించాం. కానీ ఆయన రిపబ్లిక్ డే ప్రసంగాన్ని చేసి, శుక్రవారం రాజధానిలో జరిగిన పరేడ్‌కు కూడా హాజరయ్యారని తెలిపారు.

మైనారిటీలపై దాడులు

ఇటీవల రామ మందిరం ప్రారంభోత్సవం తర్వాత దేశంలో పలు చోట్ల మత ఘర్షణలు జరిగినట్లు వార్తలందుతున్నాయని గోవిందన్ చెప్పారు. యుపి, గుజరాత్, మహారాష్ట్ర, న్యూఢిల్లీ, కర్ణాటక, తెలంగాణల్లో ముస్లింలు, క్రైస్తవులపై దాడులు చేసేలా సంఘపరివార్ ఉద్దేశ్యపూర్వకంగా ప్రోత్సహిస్తోందని ఆయన విమర్శించారు. హిందూ ఓట్లను రాబట్టుకునే లక్ష్యంతో మతసామరస్యతను దెబ్బ తీసేలా, మైనారిటీలను చెడ్డగా చిత్రీకరించేలా చేస్తోందని అన్నారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో అధికారులు మైనారిటీల ఇళ్లను ధ్వంసం చేస్తూ, చర్చిలు, మసీదులను ధ్వంసం చేసేలా సంఘపరివార్ శక్తులు రెచ్చగొడుతున్నాయని వార్తలు వస్తున్నాయన్నారు.

రాష్ట్ర స్థాయిలో బిజెపి వ్యతిరేక ఓట్ల సంఘటితం

ఇటువంటి విపత్కర పరిస్థితుల్లో కేంద్రంలో మూడోసారి ఎన్‌డిఎ ప్రభుత్వం ఏర్పడకుండా నివారించేందుకు 63శాతం బిజెపి వ్యతిరేక ఓట్లను సంఘటితం చేయాల్సిన అవసరం వుందని ఆయన చెప్పారు. ప్రతి రాష్ట్రాన్ని ఒక యూనిట్‌గా భావించి, బిజెపి వ్యతిరేక అభ్యర్థుల రాజకీయ సంబంధాలు లేదా వ్యక్తిగత వివరాలతో నిమిత్తం లేకుండా వారికి మద్దతివ్వాలని ఇండియా బ్లాక్ పక్షాలకు సీపీఐ(ఎం) విజ్ఞప్తి చేసింది.

వేగంగా మెట్రో ఫేజ్-2 విస్తరణ సర్వేలు

- ట్రాఫిక్ సర్వేలు, డీపీఆర్ తయారీ : గణతంత్ర దినోత్సవ వేడుకల్లో మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి

నవతెలంగాణ-సిటీబ్యూరో



మెట్రో రైలు రెండో దశ(ఫేజ్-2) విస్తరణ ప్రతిపాదనలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆమోదం తెలిపినట్టు మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి వెల్లడించారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి శంషాబాద్ విమానాశ్రయాన్ని అనుసంధానం చేస్తూ.. 70 కిలోమీటర్ల మేర రెండో దశలో విస్తరణకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. దీనికి సంబంధించిన ట్రాఫిక్ సర్వేలు, డీపీఆర్‌ల తయారీ వేగంగా జరుగుతున్నట్టు చెప్పారు.

గణతంత్ర దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని మెట్రో రైలు భవన్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం హైదరాబాద్ మెట్రో రైలు ప్రగతిని సంస్థ ఎండీ వివరించారు. ఫేజ్-2లో చేపట్టబోయే మెట్రో సేవలు రాజధానిలోని అన్ని వర్గాలకు అందుతాయని వెల్లడించారు. సంస్థ ఇంజినీర్లు, ఉద్యోగులు తమను తాము పునరంకితం చేసుకోవాలని, కొత్త శక్తితో పనిచేయాలని ఎన్వీఎస్ రెడ్డి కోరారు.

రాహుల్‌కు ఘన స్వాగతం

పశ్చిమ బెంగాల్‌లో భారత్ జోడో న్యాయ్ యాత్ర

ఆయనను చూసేందుకు వేలాదిగా గుమిగూడిన ప్రజలు



కోల్‌కతా : కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో న్యాయ్ యాత్ర విజయవంతంగా కొనసాగుతున్నది.రాహుల్ గాంధీ యాత్రం అసోం నుంచి పశ్చిమ బెంగాల్‌లోకి ప్రవేశించింది. ఆయనకు కూచ్ బెహార్ ప్రజలు ఘన స్వాగతం పలికారు. వేలాది మంది స్థానికులు, ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తలు, మద్దతుదారులు ఆయనను చూడటానికి పెద్ద ఎత్తున తరలి వచ్చారు. రాహుల్ రాకతో వారంతా రోడ్లపై గుమికూడారు. దీంతో రాహుల్ గాంధీ ప్రజల కోసం ఆగాల్సి వచ్చింది.

అయితే, అసోంలోని బీజేపీ ప్రభుత్వం వ్యవహరించినట్టుగానే పశ్చిమ బెంగాల్‌లోని మమత సర్కారు ప్రవర్తిస్తున్నది. రాహుల్ యాత్రకు ఆటంకాలు కలిగించే చర్యలకు దిగింది. న్యాయ్ యాత్రకు అనుమతివ్వ కుండా మధ్యలోని ఆపటానికి పోలీసులు ప్రయత్నించారు.

రాహుల్ యాత్రపై అధికార తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) పార్టీ నాయకులు, కార్యకర్తలు సామాజిక మాధ్యమాల్లో ట్రోల్స్ చేయటం కనిపించింది. రాహుల్ 'రాష్ట్రాన్ని వీడాలి' అని, కాంగ్రెస్ 'బెంగాల్‌ను విడిచిపెట్టాలి' అని పలు రకాల మీమ్స్, పోస్టులతో టీఎంసీ కార్యకర్తలు న్యాయ్ యాత్రకు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో ప్రచారాలు చేశారు. దీదీ (సీఎం మమత బెనర్జీ) రాష్ట్రంలో బీజేపీని ఒంటి చేతితో ఎదుర్కోగలరని ఆ పోస్టుల్లో టీఎంసీ కార్యకర్తలు పేర్కొనటం గమనార్హం. కాగా, టీఎంసీ తీరును కాంగ్రెస్ తప్పుబట్టింది.

బెంగాల్‌లో బీజేపీ, ఆరెస్సెస్ ప్రజల మధ్య ద్వేషం, హింస, శత్రుత్వాన్ని వ్యాప్తి చేస్తున్నాయని రాహుల్ ఆరోపించాడు. ఈ అనిశ్చిత పరిస్థితిని అధిగమించేందుకు తాము న్యాయ్ యాత్రను ప్రారంభించామని తెలిపారు. కాగా, రాహుల్ యాత్ర పశ్చిమ బెంగాల్‌లోకి ప్రవేశించినపుడు తన మొదటి ప్రసంగంలో.. "ఎలా ఉన్నారు? నేను మాట్లాడటానికి కాదు, మీరందరూ చెప్పేది వినడానికే వచ్చాను" అని తెలిపారు.కాగా, రాహుల్ భారత్ జోడో న్యాయ్ యాత్రలో ఎక్కడ ఆహ్వానం వచ్చినా చేరాలని సీపీఐ(ఎం) నిర్ణయించింది. న్యాయ్ యాత్రలో పార్టీ ప్రాంత నాయకత్వం ఉంటుందనీ, పార్టీ పనుల నిమిత్తం కూచ్‌బెహార్‌లో ఉన్న సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యుడు సూర్యకాంత మిశ్రా తెలిపారు.

కోహెడ పండ్ల మార్కెట్ పనులకు రూ. 399 కోట్లు

మంత్రి తుమ్మల వెల్లడి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కోహెడ పండ్ల మార్కెట్ అభివృద్ధి పనులకు మొదటి దశలో రూ.399.69 కోట్లను ప్రతిపాదించినట్టు వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. శుక్రవారం సచివాలయంలో మార్కెటింగ్, వ్యవసాయ శాఖ అధికారులతో మంత్రి సమీక్షించారు. పండ్ల మార్కెట్ అభివృద్ధి పనుల పురోగతిపై మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మిబాయి వివరించారు. కోహెడ పండ్ల మార్కెట్‌ను భవిష్యత్తు అవసరాలకు తగినట్టుగా నిర్మిస్తామని మంత్రి ఈసందర్భంగా తెలిపారు. సమీక్షా సమావేశంలో వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి, సహకార శాఖ డైరెక్టర్ హరిత, అదనపు డైరెక్టర్ ఆర్ లక్ష్మణుడు, సూపరింటెండింగ్ ఇంజినీరు బి.రాధాకృష్ణమూర్తి, గడ్డి అన్నారం మార్కెట్ కార్యదర్శి సీహెచ్ నర్సింహారెడ్డి తదితరులు ఉన్నారు.

టెకీలపై ఆగని వేటు

- తాజాగా మైక్రోసాఫ్ట్‌లో 1900 మంది
- సేల్స్‌ఫోర్స్‌లో 700 మంది ఉద్యోగుల తొలగింపు

న్యూఢిల్లీ : గతేడాదిలోని లక్షలాది టెకీల ఉద్వాసనలు మర్చిపోకముందే.. కొత్త ఏడాదిలోనూ టెక్నాలజీ కంపెనీలు ఉద్యోగుల తొలగింపునకు వరుస కడుతున్నాయి. ఇప్పటికే గూగుల్, మెటా, అమెజాన్ సహా పలు టెక్ కంపెనీలు సిబ్బందిని ఇంటికి పంపించడానికి ప్రకటనలు చేయగా.. తాజాగా మైక్రోసాఫ్ట్ వేలాది మందిపై వేటు వేయడానికి సిద్ధం అయ్యింది. అదే విధంగా సేల్స్‌ఫోర్స్ కూడా వందలాది మందిని రోడ్డున పడేసే పనిలో పడింది. ఆర్థిక మందగమనం, వ్యయ నియంత్రణ చర్యలు, పునర్ వ్యవస్థీకరణ ప్రణాళిక పేరుతో టెక్ కంపెనీలు సిబ్బందిని తొలగిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే మైక్రోసాఫ్ట్ గేమింగ్ డివిజన్‌లో 1900 మంది ఉద్యోగులపై వేటు వేయనున్నట్లు ప్రకటించింది. యాక్టివిజన్ బ్లిజర్డ్, ఎక్స్‌బాక్స్ సహా గేమింగ్ డివిజన్‌లో తొలగింపులు ఉంటాయని వెల్లడించింది. నూతన ప్రాజెక్టులపై దృష్టి సారించడం, కార్యకలాపాల క్రమబద్ధీకరణతో ఈ సంక్లిష్ట బాధాకర నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని మైక్రోసాఫ్ట్ పేర్కొంది. ఈ ప్రక్రియను గేమింగ్ నాయకత్వ బృందంతో పాటు తాను సాఫీగా సాగేలా కృషి చేస్తామని మైక్రోసాఫ్ట్ గేమింగ్ సిఇఒ ఫిల్ స్పెన్సర్ ఉద్యోగులకు పంపిన మెయిల్‌లో స్పష్టం చేశారు.



సేల్స్‌ఫోర్స్‌లో 700 మందిపై వేటు..

క్లౌడ్ ఆధారిత సాఫ్ట్‌వేర్ కంపెనీ సేల్స్‌ఫోర్స్ 700 మంది ఉద్యోగులకు ఉద్వాసన పలికింది. ఆ సంస్థ గత ఏడాదిలోనూ పది శాతం సిబ్బందిపై వేటు వేయడంతో దాదాపు 8000 మంది రోడ్డున పడ్డారు. టెక్ పరిశ్రమ పలు సవాళ్లను ఎదుర్కొంటున్న క్రమంలో ఇతర టెక్ కంపెనీల తరహాలోనే దీర్ఘకాలం నిలదొక్కుకునే వ్యూహంతో సేల్స్‌ఫోర్స్ సైతం సిబ్బంది సంఖ్యకు కోత పెట్టింది. మరోవైపు జర్మనీకి చెందిన సాఫ్ట్‌వేర్ దిగ్గజం శాప్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఎఐపై దృష్టి పెంచడంతో 8000 ఉద్యోగుల భవితవ్యంపై ఆందోళన నెలకొంది. శాప్‌లో ప్రపంచవ్యాప్తంగా 1,08,000 మంది ఉద్యోగులు పనిచేస్తుండగా.. ఎఐపై దృష్టి పెట్టడంతో దాదాపు 7 శాతం మంది ఉద్యోగులపై ప్రభావం పడనుందని సమాచారం. అలాగే ఆన్‌లైన్ రిటైలర్ ఈబే దాదాపు 1,000 మంది ఉద్యోగుల తొలగింపు లను కూడా ప్రకటించింది. లేఆఫ్స్.ఎఫ్‌వైఐ రిపోర్టుల ప్రకారం.. 2024లో ఇప్పటి వరకు 85 టెక్నాలజీ కంపెనీలు 23,770 మంది ఉద్యోగులను తొలగించాయి.

బిజినెస్

బోయింగ్‌కు అమెరికా భారీ షాక్

- 737 మ్యాక్స్ విమానాలపై నిషేధం
- భారత సంస్థలపైనా ప్రభావం..!



వాషింగ్టన్ : దిగ్గజ విమానాల తయారీ కంపెనీ బోయింగ్‌కు అమెరికా ఊహించని షాక్ ఇచ్చింది. ఆ కంపెనీ తయారు చేసే బోయింగ్ 737 మ్యాక్స్ విమానాల తయారీ విస్తరణపై నిషేధం విధిస్తూ అమెరికా ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ (యుఎస్ ఎఫ్ఎఎ) నిర్ణయం తీసుకుంది. ఈ విమానాలు పలు ప్రమాదాలకు గురి కావడంతో వేటు వేసింది. జనవరి ప్రారంభంలో అలష్కా ఎయిర్ లైన్స్‌కు చెందిన 737 మ్యాక్స్ విమానం టైర్ ఆకాశంలోనే పేలిపోయింది. ఈ విమానాన్ని పూర్తి స్థాయి తనిఖీలు చేసిన తర్వాతే సర్వీస్‌లను తిరిగి ప్రారంభించినప్పటికీ తాజాగా తయారీ, విస్తరణపై నిషేధం విధించడం బోయింగ్ సహా విమానయాన కంపెనీల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. ఇప్పటికే అనేక 737 మ్యాక్స్ విమానాలను పలు కంపెనీలు కొనుగోలు చేసి ఉండటం.. ఆర్డర్లు కూడా ఇచ్చి ఉండటంతో ఇరు వర్గాల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. ఇప్పటికే అలస్కా ఎయిర్‌లైన్స్, యునైటెడ్ ఎయిర్‌లైన్స్‌లు 737 మ్యాక్స్ సేవలను రద్దు చేసుకున్నాయి. ఐదేళ్ల క్రితం నెలల వ్యవధిలోనే ఇండోనేషియా, ఇథియోపియాల్లో రెండు బోయింగ్ 737 మ్యాక్స్ విమానాలు కూలి 346 మంది ప్రయాణికులు మరణించారు. దీంతో ప్రపంచ వ్యాప్తంగా ఏడాదిన్నర పాటు ఈ రకం విమానాలను పక్కనపెట్టారు.

కాగా.. పరిశ్రమలో మ్యాక్స్ 737 విమానాలకు ఉన్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని ఉత్పత్తి పెంచేందుకు అనుమతించాలని ఎఫ్ఎఎను బోయింగ్ కోరినప్పటికీ తిరస్కరించింది. 737 మ్యాక్స్ విమానాల్లో క్వాలిటీ కంట్రోల్ సమస్యలు పరిష్కారం అయ్యాయని తాము సంతృప్తి చెందే వరకు ఎలాంటి విజ్ఞప్తులను అంగీకరించమని ఎఫ్ఎఎ అడ్మినిస్ట్రేటర్ మైక్ వైటేకర్ తెలిపారు. నాణ్యతముపై బోయింగ్ యాజమాన్యం ఇచ్చే హామీలు ఆమోదయోగ్యంగా లేవన్నారు.

ప్రస్తుతం నెలవారీగా ఇచ్చిన లక్ష్యం వరకు మాత్రం బోయింగ్ 737 మ్యాక్స్ విమానాల తయారీకి మాత్రమే అనుమతిస్తామన్నారు. తయారీ పెంపుపై విధించిన ఆంక్షలు ఎంత కాలం అమల్లో ఉంటాయనేది ఇప్పుడే చెప్పలేమన్నారు. భారత్ నుంచి మ్యాక్స్ 737 విమానాల కోసం ఎయిరిండియా 181 విమానాలను, ఆకాశ్‌ఎయిర్ 204, స్పైస్‌జెట్ 142 చొప్పున ఆర్డర్ల కోసం ఒప్పందాలు చేసుకున్నాయి. ప్రస్తుత పరిణామంతో డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డిజిసిఎ) ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలి.

29న బవేజా స్టూడియోస్ ఐపీవో

హైదరాబాద్: పబ్లిక్ ఇష్యూకు రావడం ద్వారా రూ.97.20 కోట్లు సేకరించే యోచనలో ఉన్నట్లు చలన చిత్రాల ప్రొడక్షన్ సంస్థ బవేజా స్టూడియోస్ తెలిపింది. ఇందుకోసం ఇన్షియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపిఒ)కు వస్తున్నట్లు వెల్లడించింది. జనవరి 29న ఇష్యూ ప్రారంభమై ఫిబ్రవరి 1న ముగియనుంది. ఈ ఇష్యూలో రూ.10 ముఖ విలువ కలిగిన 54 లక్షల ఈక్విటీ షేర్లను జారీ చేయనున్నట్లు ప్రకటించింది. ఒక్కో షేరు ధరల శ్రేణిని రూ.170-180గా నిర్ణయించింది. అప్లికేషన్ కొరకు కనీస లాట్ 800 షేర్లను కొనుగోలు చేయాల్సి ఉంటుంది. కనీస అప్లికేషన్ మొత్తం రూ.1.44 లక్షలుగా ఉంది. సమీకరించిన నిధులు వర్కింగ్ క్యాపిటల్ అవసరాలు, సాధారణ కార్పొరేట్ అవసరాలకు ఉపయోగించనున్నట్లు వెల్లడించింది.

స్కై 2.0లో వికాస్ లైఫ్‌కేర్‌కు వాటాలు

హైదరాబాద్ : దుబాయ్‌లోని స్కై2.0 క్లబ్‌లో వాటాలను కొనుగోలు చేసినట్లు వికాస్ లైఫ్ కేర్ లిమిటెడ్ తెలిపింది. ఇందుకోసం 79 మిలియన్ల పెట్టుబడులు పెడుతోన్నట్లు పేర్కొంది. ఇందుకోసం బ్లూస్కై ఈవెంట్ హాల్ ఎఫ్‌జడ్-ఎల్‌ఎల్‌సిఒ ఒప్పందం చేసుకున్నట్లు వికాస్ లైఫ్‌కేర్ లిమిటెడ్ తెలిపింది. దీంతో స్కై2.0లో 60 శాతం వాటాలు దక్కించుకోనున్నట్లు వెల్లడించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రక్రియ పూర్తి కానుందని తెలిపింది.

వేడుకగా హైబిజ్ టీవీ రియాల్టీ అవార్డ్స్ ప్రధానోత్సవం



హైదరాబాద్ : హైబిజ్ టివి రియాల్టీ అవార్డ్స్ -2024 ప్రధానోత్సవం వేడుకగా జరిగింది. హైటెక్స్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ బిసి కమిషన్ ఛైర్మన్ వకుళభరణం కృష్ణ మోహన్ రావు హాజరై విజేతలకు అవార్డులను ప్రధానం చేసారు. రియాల్టీ రంగం ఉన్నత స్థాయిలో అభివృద్ధి చెందటానికి సహకారం అందిస్తున్న సంస్థలు, వ్యక్తులకు, 25 వివిధ విభాగాలలో అవార్డులను అందజేశారు.

రియాల్టీ అవార్డ్స్-2024 మొదటి ఎడిషన్ అవార్డుల కార్యక్రమంలో క్రెడాయ్ జాతీయ ప్రధాన కార్యదర్శి జి రామ్ రెడ్డి, మహా సిమెంట్ సీనియర్ ప్రెసిడెంట్ మార్కెటింగ్ విజయ్ వర్ధన్ రావు, ఎల్ఐసి హౌసింగ్ ఫైనాన్స్ రీజినల్ మేనేజర్ జై ప్రకాష్ బాబు, సుధాకర్ గ్రూప్ ఎండి జైదేవ్ మీలా, హైబిజ్ టివి ఎండి ఎం రాజ్ గోపాల్, సిఇఒ జె సంధ్య రాణి తదితరులు పాల్గొని వివిధ విభాగాలలో విజేతలకు అవార్డులను అందజేశారు.

మతరాజకీయాలను ఓడించాలి

- గణతంత్ర దినోత్సవంలో సీపీఐ నేత చాడ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దేశంలో మత రాజకీయాలను ఓడించాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం హైదరాబాద్‌లోని మఖ్దూంభవన్ ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో గణతంత్ర దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ పతాకాన్ని చాడ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మతాల పేరుతో కులాల కుట్రలు, ప్రాంతీయ విబేధాలతో ప్రజలను చీల్చే పరిపాలన కేంద్రంలో సాగుతున్నదని విమర్శించారు. మోడీ అధికారంలోకి వచ్చాక మత సామరస్యం దెబ్బతిన్నదని అన్నారు. రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏండ్లు అవుతున్నదనీ, ప్రాథమిక హక్కులు ఏ మేరకు అమలయ్యాయని ప్రశ్నించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బాబు రాజేంద్రప్రసాద్ ఈ దేశంలో ఉన్న భాషలు, భావాలను ఆకలింపు చేసుకుని లౌకిక వ్యవస్థను నిర్మించారని చెప్పారు. మోడీ హయాంలో లౌకిక వ్యవస్థకే ప్రమాదం పొంచి ఉందన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజల్లో చైతన్యం తెచ్చి ఉద్యమాలను నిర్మించేందుకు కంకణబద్ధులు కావాలని ఆయన పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలను పట్టించుకోలేదని విమర్శించారు. పక్కా ఇండ్లు, ఇండ్లస్థలాలు, రేషన్ కార్డులు, మౌలికసదుపాయాల కల్పనకు కొత్త ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పశ్య పద్మ, ప్రజాపక్షం సంపాదకులు కె శ్రీనివాస్ రెడ్డి, ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు, ఏఐటీయూసీ రాష్ట్ర ఉపప్రధాన కార్యదర్శి ఎం నర్సింహా, కార్యదర్శి బి వెంకటేశం, ఎస్టీయూటీఎస్ ప్రధాన కార్యదర్శి సదానందం గౌడ్, అరసం రాష్ట్ర నాయకులు బొమ్మగాని నాగభూషణం, తెలంగాణ గిరిజన సమాఖ్య ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్య నాయక్, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నెదునూరి జ్యోతి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మణికంఠరెడ్డి, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ వలీఉల్లాఖాద్రీ, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్ శ్రీకాంత్, సీపీఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్ ఛాయాదేవి, తెలంగాణ ప్రజానాట్యమండలి అధ్యక్షులు కురిమిద్ద శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహ్మా, వర్కింగ్ ఉమెన్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ పి ప్రేమ్ పావని తదితరులు పాల్గొన్నారు.

వెంకయ్యకు, మెగాస్టార్‌కు కేసీఆర్ శుభాకాంక్షలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, ప్రముఖ నటుడు చిరంజీవికి ప్రతిష్టాత్మక పద్మ విభూషణ్ అవార్డులు దక్కడం పట్ల బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

దేశం మరింత ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి.

భారత గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్ర, దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.సర్వసత్తాక, గణతంత్ర దేశంగా ప్రజాస్వామ్య భారత్ ఆవిర్భవించి 75 ఏండ్లవుతున్నదని తెలిపారు. భవిష్యత్తులో మన దేశం అన్ని రంగాల్లో మరింత ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కేసీఆర్ ఆకాంక్షించారు.

ఎమ్మెల్సీ ఇచ్చి కాంగ్రెస్ గౌరవించింది

- కోదండరాం గురించి మాట్లాడే అర్హత కేటీఆర్‌కు లేదు :మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

తమ పార్టీ ప్రొఫెసర్ కోదండరాంకు ఎమ్మెల్సీ పదవినిచ్చి గౌరవించిందని మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి అన్నారు. ఆయనకు ఎమ్మెల్సీ పదవి ఇస్తే బీఆర్ఎస్ నేతలు ఎందుకు బాధపడుతున్నారో అర్థం కావడం లేదన్నారు. శుక్ర వారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర కోసం కాంగ్రెస్ ఎంపీలు పోరాటం అంతా..ఇంతా కాదని గుర్తు చేశారు. తెలంగాణ ఉద్యమంతా ఒక ఛత్రి కింద ఉండాలనే ఉద్దేశంతోనే కోదండరాంను జేఏసీ ఛైర్మెన్‌గా ఎన్నుకుందన్నారు. విలువలతో రాజకీయాలను మాట్లాడలేదని చెప్పారు.

సామాజిక రంగాల్లో సమానత్వం కావాలి

- దళిత స్త్రీ శక్తి నేత గెడ్డం ఝాన్సీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రజలు కులాలకు, మతాలకు, వర్గాలకు, జండర్‌కు అతీతంగా అందరూ సమానంగా బతకాలంటే ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాల్లో సమానత్వం సాధించాలని దళిత స్త్రీ శక్తి జాతీయ కన్వీనర్ గెడ్డం ఝాన్సీ తెలిపారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని దళిత స్త్రీ శక్తి, డిక్కి ఆధ్వర్యంలో శుక్రవారం'వ్యాపార రంగంలో దళిత, ఆదివాసీ స్త్రీలు' అనే అంశంపై సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఝాన్సీ మాట్లాడుతూ స్త్రీలు ఆర్థిక స్వావలంబన సాధించినప్పుడే హింస లేనీ, వేదనల్లేని సమాజం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. డిక్కి జాతీయ నాయకులు వనజాక్షి మాట్లాడుతూ వ్యాపార రంగంలో రాణించాలంటే విశ్వాసం, నమ్మకంతో పాటు ఇష్టం కూడా ఉండాలని తెలిపారు.కార్యక్రమంలో డిక్కి రాష్ట్ర అధ్యక్షులు అరుణ, బాలరాజు,పరమేష్, నారాయణ పాల్గొన్నారు.

స్విగ్గీ, ఫ్లిప్‌కార్ట్ ఉద్యోగుల తొలగింపులు

న్యూఢిల్లీ : స్టార్టప్ సెక్టార్‌లో "ఫండింగ్ వింటర్"గా పిలువబడుతున్న నేపథ్యంలో స్విగ్గీ, ఫ్లిప్‌కార్ట్ ఉద్యోగుల తొలగింపులను ప్రకటించాయి. ఫుడ్ డెలివరీ సంస్థ స్విగ్గీ.. దాని శ్రామికశక్తిలో దాదాపు 7 శాతం మందిని తగ్గించటానికి సిద్ధంగా ఉంది. అంటే దాదాపు 350 నుంచి 400 మంది ఉద్యోగులు ఈ ప్రభావాన్ని ఎదుర్కోనున్నారు. ఇందులో ప్రధానంగా దాని (స్విగ్గీ) సాంకేతిక బృందాలు, కస్టమర్ కేర్ విభాగంలోని ఒక విభాగం నుంచి ఈ తొలగింపులు ఉండనున్నట్టు తెలుస్తున్నది. ఇలా ఉద్యోగులకు ఉద్వాసన పలకటం స్విగ్గీకి ఇది రెండోసారి. గతేడాది జనవరిలో 380 ఉద్యోగులను సంస్థ తొలగించింది. అలాగే, ఇ-కామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్ తన వర్క్‌ఫోర్స్‌లో దాదాపు 1,000 మంది ఉద్యోగులను (5 శాతం మంది) తొలగిస్తున్నది. ఫ్లిప్‌కార్ట్ ప్రస్తుతం దాని ప్రారంభ పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ) కోసం సిద్ధమవుతున్నది.

ఆల్ట్ న్యూస్ సహవ్యవస్థాపకుడు మహమ్మద్ జుబైర్‌కు తమిళనాడు మత సామరస్య పురస్కారం

చెన్నై: నిజనిర్ధారణ వెబ్‌సైట్ ఆల్ట్ న్యూస్ సహ వ్యవస్థాపకుడు మహ్మద్ జుబైర్‌ను తమిళనాడు ప్రభుత్వం 2024 కొట్టాయ్ అమీర్ కమ్యూనల్ హార్మొనీ అవార్డుతో సత్కరించింది. 'మత సామరస్య పరిరక్షణలో ఆయన అందించిన సేవలకు' ఆయనకు అవార్డు లభించింది. అవార్డు కింద రూ. 25,000 నగదు, పతకం, ప్రశంసాపత్రం ఉంటాయి. మత సామరస్యాన్ని పెంపొందించటంలో విశిష్ట సేవలందించినందుకు తమిళ నాడు ముఖ్యమంత్రి ప్రతి సంవత్సరం గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్రానికి చెందిన వ్యక్తికి దీనిని అందజేస్తారు. కాగా, జుబేర్ స్వస్థలం తమిళనాడులోని కృష్ణగిరి జిల్లా. "సోషల్ మీడియాలో వస్తున్న వార్తల వాస్తవికతను" నిర్ధారించటంలో ప్రతీక్ సిన్హాతో కలిసి జుబైర్ స్థాపించిన ఆల్ట్ న్యూస్ వెబ్‌సైట్ సహకారాన్ని కూడా అవార్డుకు సంబంధించిన సైటేషన్ పేర్కొన్నది. ఈ అవార్డును అందుకోవడం చాలా ఆనందంగా ఉన్నదనీ, ఆల్ట్ న్యూస్ పనికి గుర్తింపు లభించినందుకు చాలా సంతోషంగా ఉన్నదని జుబైర్ అన్నారు.

బొగ్గు గనిలో మంటలు

- ఆరుగురు మృతి.. నలుగురికి గాయాలు
- నాగాలాండ్‌లో ఘటన

కోహిమా : నాగాలాండ్‌లోని బొగ్గు గనిలో మంటలు చెలరేగటంతో ఆరుగురు మైనర్లు మృతి చెందారు. మరో నలుగురు గాయపడ్డారు. వోఖా జిల్లా రుచాన్ గ్రామంలోని బొగ్గు గనిలో ఈ ఘటన చోటు చేసుకున్నది. జనరేటర్‌లో కొంత లీకేజీ కారణంగా మంటలు చెలరేగినట్టు తెలుస్తున్నదని పోలీసు అధికారి ఒకరు తెలిపారు. " ఈ ఘటనలో ఆరుగురు అక్కడికక్కడే మరణించారు. వారిలో నలుగురికి స్వల్ప కాలిన గాయాలయ్యాయి. విషాద ప్రమాదంలో గాయపడిన వారిని తదుపరి వైద్య చికిత్సల కోసం దిమాపూర్‌లోని ఆలివ్ ఆస్పత్రికి తరలించారు" అని అధికారులు తెలిపారు. మరణించిన ఆరుగురు మైనర్లలో ఐదుగురు గోరఖా వర్గానికి చెందినవారు కాగా, ఒకరు ముస్లిం. అందరూ అసోంలోని గోలాఘాట్ జిల్లాకు చెందినవారు. వీరు రాథోల్ మైనర్లుగా పనిచేస్తున్నారు.


టీపీఎస్‌కే కార్యాలయంలో...


సచివాలయంలో...


శాసన మండలిలో...


టీఎస్‌పీఎస్సీ కార్యాలయంలో...


సీపీఐ కార్యాలయంలో...



శంకరన్ ఐఏఎస్ అకాడమీలో...


టీజేఎస్ కార్యాలయంలో...

రాజ్యాంగ నిర్మాణంలో అంబేద్కర్ కృషి వెల కట్టలేనిది

- పౌరుల చావు బతుకులు సీఏఏతో ముడిపడి ఉన్నాయి : గణతంత్ర వేడుకల్లో ప్రొఫెసర్ మాడభూషి శ్రీధర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

భారత రాజ్యాంగం అర్థమైతేనే దాని గొప్పతనం తెలుస్తుందని నల్సార్ యూనివర్సిటీ విశ్రాంత ప్రొఫెసర్ మాడభూషి శ్రీధర్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఎస్‌వీకే మేనేజింగ్ కమిటీ కార్యదర్శి ఎస్ వినయ్‌కుమార్ అధ్యక్షతన 'భారత రాజ్యాంగం దాని ఔన్నత్యం' అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ 'జగనగణ మన' ప్రతిజ్ఞను నిరంతరం పఠించాల్సిన సందర్భం ఏర్పడిందని చెప్పారు. రాజ్యాంగ నిర్మాణం కోసం అంబేద్కర్ చేసిన కృషి వెల కట్టలేనిదని చెప్పారు. అక్షరక్షరం పరిశీలించి, ఎప్పటికీ ఆమోదయోగ్యంగా రూపొందించారని వివరించారు. ఒకనాడు రాజ్యాంగ పీఠికను చదవినందుకు కేసయిందనీ, ప్రస్తుతం అందరూ చదవాల్సిన అవసరం ఏర్పడిందని తెలిపారు. పీఠిక ఔనత్యాన్ని వివరిస్తూ..దాని రచయిత అంబేద్కరని చెప్పారు. రాజ్యాంగ లక్ష్యాలను నిలబెట్టుకోవాల్సిన బాధ్యత పౌరులపైనే ఉందని గుర్తు చేశారు. ఆ నిబంధనలు ఇంకా రాలేదనీ, వాటితోనే..పౌరుల చావు బతుకులు ముడిపడి ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పౌరహక్కులకు భంగం వాటిల్లుతున్న సందర్భంలో ఉన్నామని ఆందోళన వ్యక్తం చేశారు. సీఏఏ నిబంధనలు ఎన్నికలకు ముందు వస్తాయో..ఆ తర్వాత వస్తాయో చూడాలన్నారు. రాబోయే కాలంలో రాజ్యాంగంలో మార్పులు వసాయని వింటున్నామనీ, అవి ఎలాంటి మార్పులు, ఎవరికి ఉపయోగపతాయో తెలియని విషయం కాదన్నారు. మన కోసం రాసుకున్న రాజ్యాంగం, మనల్ని మనలాగా ఉండనిస్తుందా? లేదా? అనేది ఆందోళనగా ఉందని చెప్పారు. అనంతరం నేతాజీ చిత్ర ప్రదర్శన, కవి సమ్మేళనం, ఇస్త్రీ పెట్టె నాటకాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో టీపీఎస్‌కే నాయకులు భూపతి వెంకటేశ్వర్లు, మురళీధర్‌గౌడ్, నటుడు వంజార కృష్ణమూర్తి, బాలోత్సవ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్ సోమయ్య, సుజావతి, జి బుజ్జిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ విలువలను కాపాడేది కాంగ్రెస్సే

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాజ్యాంగ విలువలను కాపాడేది కాంగ్రెస్ పార్టీయేనని టీపీసీసీ కార్య నిర్వాహక అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ గుర్తు చేశారు. బీజేపీకి స్వతంత్ర ఉద్యమంతో సంబంధం లేదన్నారు. నెహ్రూ, రాజీవ్ గాంధీ చేసిన సంస్కరణలతో దేశం ముందుకు పోతున్నదని చెప్పారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన గణతంత్ర వేడుకలను పురస్కరించుకుని జాతీయ జెండాను ఎగురవేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వతంత్ర ఉద్యమంలో బీజేపీ పాత్ర ఏమీ లేదన్నారు. కానీ దేశానికి స్వతంత్రాన్ని తామే తెచ్చినట్టు చెబుకుంటున్నారని విమర్శించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు ఆలోచించుకుని ముందుకు పోవాలని కోరారు. దేశ ప్రజల కోసం రాహుల్ గాంధీ యాత్ర చేస్తున్నారని గుర్తు చేశారు. కుటుంబ పాలన, మతతత్వ రాజకీయాలకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పోరాటం చేస్తున్నదని చెప్పారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, సలహాదారులు షబ్బీర్ అలీ, హర్కర వేణుగోపాల్, ఎమ్మెల్సీ వెంకట్, ఎమ్మెల్యేలు, కార్యనిర్వాహక అధ్యక్షులు అంజన్‌కుమార్ యాదవ్, జగ్గారెడ్డి, మాజీ ఎంపీలు వి. హనుమంతరావు, మల్లు రవి, మధు యాష్కీ, సీనియర్ నేత కోదండ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ జెండావిష్కరణలో మహేష్‌కుమార్‌గౌడ్



దేశంలో అన్ని వర్గాల ప్రజలకు బీజేపీ అన్యాయం చేస్తుంది సినీ నటి, కాంగ్రెస్ నేత దివ్యవాణి

దేశంలో అన్ని వర్గాల ప్రజలకు బీజేపీ అన్యాయం చేస్తున్నదని సినీనటి, కాంగ్రెస్ నేత దివ్యవాణి ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆమె విలేకర్లతో మాట్లాడారు. యాభై రోజుల కాంగ్రెస్ పాలనలో మహిళలకు విశ్వాసం పెరిగిందన్నారు. ఉచిత బస్సుప్రయాణంతో పది కోట్ల మంది మహిళలు ప్రయోజనం పొందారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రగతిభవన్‌ను ప్రజా భవన్‌గా మార్చిందన్నారు. రాజకీయ విలువలు పెంచేలా కేసీఆర్ అనారోగ్యంతో ఉన్నప్పుడు సీఎం వెళ్లి పరామర్శించడం మంచి సంప్రదాయమని కొనియాడారు. .ఏపీసీసీ అధ్యక్షులుగా షర్మిల నియామించడం మంచి శుభసూచికమన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో నూతన ఉత్సాహంతో పనిచేయాల్సిన అవసరముందన్నారు.

ఉద్యమంలో మాదిరిగానే ఇప్పుడూ పని చేస్తాం...

ప్రొఫెసర్ కోదండరాం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ ఉద్యమకాలంలో పని చేసినట్టే భవిష్యత్తులోనూ పని చేస్తామని టీజేఎస్ అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం తెలిపారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొని రాజ్యాంగ పీఠికను చదివి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఎమ్మెల్సీ ఇస్తామన్న మాటను నిలబెట్టుకున్నారని తెలిపారు. ఇది టీజేఎస్ కార్యకర్తల సేవా ఫలితమన్నారు. గణతంత్ర దినోత్సవం రోజున రాజ్యాంగ విలువల కోసం బతకాలనే నిర్ణయం తీసుకోవాలని సూచించారు. కొంత మంది రాజ్యాంగం పనికి రాదంటున్నారనీ, అయితే ప్రజలు ఏ విలువల కోసమైతే పోరాటం చేశారో అవి రాజ్యాంగంలో పొందుపరిచి ఉన్నాయని గుర్తుచేశారు. సమాన అవకాశాలు, హక్కులు, రక్షణ ఉండాలంటూ రాజ్యాంగం సూచిస్తున్నదని తెలిపారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రాజ్యాంగం మార్చాలనే విషయాన్ని గుర్తుచేశారు. తద్వారా చైనా, సింగపూర్‌లో ఉన్న నియంతృత్వ పాలన ఇక్కడ కూడా ఉండాలని ఆయన భావిస్తున్నారని విమర్శించారు. సమాజ మార్పు దానంతట అదే జరగదని స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమం అంతా రాజ్యాంగ విలువల ప్రకారం జరిగిందని చెప్పారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ మూడు లేకపోతే చిన్న రాష్ట్రాల స్వేచ్ఛ ఉండేది కాదన్నారు. రాష్ట్రంలో ఆశించిన మార్పుల కోసం కృషి చేయాల్సి ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వ పదవులు తమ సొంతానికి ఉపయోగించడానికి కాదని తెలిపారు.



గణతంత్ర వేడుకల్లో విషాదం

- విద్యుద్ఘాతంతో ఇద్దరు మృతి
- బాధిత కుటుంబాలకు మంత్రి సీతక్క పరామర్శ
- ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటన

నవతెలంగాణ-ములుగు

గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లలో విద్యుద్ఘాతంతో ఇద్దరు యువకులు మృతిచెందారు. ఈ క్రమంలో బాధిత కుటుంబాలను పంచాయతీరాజ్ స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క పరామర్శించారు. ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ములుగు జిల్లా కేంద్రానికి చెందిన బొడ అంకిత్ కుమార్, ల్యాడ విజయ్, బోడ కళ్యాణ్ చక్రి జాతీయ జెండాను అమర్చుతుండగా.. కరెంట్ తీగలకు తగిలి విద్యుత్ షాక్‌కు గురయ్యారు. బొడ అంకిత్ కుమార్, ల్యాడ విజయ్ మృతిచెందారు. గాయపడిన కళ్యాణ్ చక్రిని ములుగు జిల్లా ఆస్పత్రికి తరలించారు. విషయం తెలిసిన వెంటనే మంత్రి వెళ్లి బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఒక్కో కుటుంబానికి రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. తక్షణ సహాయం 10 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. వేడుకలు జరిగేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ఈ ఘటన దురదృష్టకరమని, బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. గాయపడిన కళ్యాణ్ చక్రికి మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. మంత్రి వెంట కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ప్రత్యామ్నాయ విద్యుదుత్పత్తిపై ప్రత్యేక దృష్టి

2030 అవసరాలకనుగుణంగా ఉత్పత్తి :డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

నవతెలంగాణ-చేవెళ్ల

రాష్ట్ర ప్రజల భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ప్రత్యామ్నాయ విద్యుత్ ఉత్పత్తికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం చందనవెల్లి గ్రామంలో శుక్రవారం జున్నా సోలార్ పవర్ ప్యానెల్ ఉత్పత్తి ప్లాంటును ఆయన ప్రారంభించారు. సోలార్ పవర్ ప్యానెల్ ఉత్పత్తి విధానం గురించి ఇంజినీర్లను అడిగి తెలుసుకున్నారు. గ్లాస్ లోడింగ్, భస్సింగ్, లే అప్, ల్యామినేటింగ్ ఫ్రేమింగ్, క్యూరింగ్ లైన్, క్లీనింగ్ సెక్షన్, సన్ సిమ్ లెటర్, ఐ పోర్టు, ఫైనల్ ఈ.ఎల్ ప్రాసెస్ యూనిట్స్‌ను పరిశీలించారు. అనంతరం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. 2030 నాటికి ప్రజల వినియోగానికి ఉండే డిమాండ్‌కనుగుణంగా ప్రత్యామ్నాయ విద్యుత్తును ఉత్పత్తి చేస్తామన్నారు. ప్రపంచంలో మానవ జాతికి.. విద్యుత్ శక్తికి మధ్య విడదీయరాని బంధం ఏర్పడిందన్నారు. విద్యుత్ శక్తి అవసరాల డిమాండ్ రోజు రోజుకూ పెరిగిపోతున్న క్రమంలో అందుకనుగుణంగా ప్రత్యామ్నాయంగా విద్యుత్ ఉత్పత్తిని పెంచుకోవాల్సి ఉంటుందన్నారు. విద్యుత్ రంగంపై గత ప్రభుత్వం రూ.81 వేల కోట్ల పైబడి అప్పుల భారం మోపిందన్నారు. ప్రత్యామ్నాయ విద్యుత్ ఉత్పత్తి కోసం మాజీ ప్రధానులు ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ వేసిన పునాదులు ప్రజల అవసరాలు తీర్చుతున్నాయని వివరించారు.

చంద్రన్‌వెల్లి గ్రామంలో భూసేకరణలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిపిస్తామని భట్టి గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఎంజాయ్‌మెంట్ సర్వే పేరిట భూమి లేని వారి పేర్లను భూ సేకరణలో చేర్చి నిజమైన రైతులకు పరిహారం ఇవ్వలేదని.. గతంలో తాను పాదయాత్రలో భాగంగా ఈ ఊరికి వచ్చినప్పుడు రైతులు తన దృష్టికి తీసుకొచ్చారని గుర్తు చేశారు.

భూ బాధితుల విజ్ఞప్తి మేరకు నిజమైన లబ్దిదారులకు పరిహారం ఇప్పించేందుకు సమగ్ర విచారణ చేయిస్తాన్నారు. పరిహారాన్ని కొల్లగొట్టిన దళారులపై విచారణ చేయించి వాస్తవాలు బయటికి తీసుకొస్తామన్నారు.

భూ బాధితులకు స్థానికంగా ఏర్పాటు చేసిన పరిశ్రమల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వకుండా పరిశ్రమలు అన్యాయం చేస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, పరిశ్రమ నిర్వాహకులు జున్న శేఖర్ రెడ్డి, జున్న బస్వీ రెడ్డి, ఈదుల నరేందర్ రెడ్డి, భీమవరపు అనిల్ కుమార్ రెడ్డి, భీమవరపు దుర్గాప్రసాద్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు చల్లా నరసింహారెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పామేనా భీమ్ భరత్ పాల్గొన్నారు.



చందనవెల్లిలో జున్నా సోలార్ పవర్ ప్యానెల్ ప్లాంటు ప్రారంభం

విలువలు, విధానాలు లేని వ్యక్తి డీకే అరుణ

సీడబ్ల్యూసీ సభ్యులు చల్లా వంశీచంద్ రెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

విలువలు, విధానాలు లేని వ్యక్తి బీజేపీ నేత డీకే అరుణ అని సీడబ్ల్యూసీ సభ్యులు చల్లా వంశీచంద్ రెడ్డి విమర్శించారు. అవకాశవాద రాజకీయాలకు ఆమె మారుపేరు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసదుద్దీన్ పిలిస్తే డీకే అరుణ ఎంఐఎం లోకి సైతం పోతారని ఎద్దేవా చేశారు. డీకే అరుణ అనడం కంటే దగాకోరు అరుణ అంటే కరెక్ట్ సెట్ అవుతుందని వ్యాఖ్యానించారు. 2019 ఎన్నికల్లో మహబూబ్ నగర్ ఎంపీగా పోటీ చేసేందుకు కాంగ్రెస్ పార్టీని లో రూ.15 కోట్లు ఇవ్వాలంటూ డీకే అరుణ డిమాండ్ చేశారని గుర్తు చేశారు. ఆమె పార్టీని డబ్బులు అడిగినట్టు ప్రమాణం చేసేందుకు నేను సిద్ధమన్నారు. ఈనెల 28న ఉదయం 11 గంటలకు మహబూబ్ నగర్‌లోని టీచర్స్ కాలనీ లోని రామ మందిరానికి వస్తాననీ, మీరు రావాలంటూ అరుణకు సవాల్ విసిరారు. అరుణది నాకంటే గొప్ప రాజకీయ చరిత్ర ఏం కాదనీ, నేను డబ్బులకు అమ్ముడు పోయే వ్యక్తిని అయితే డీకే అరుణ లాగా బంగ్లాలపై బంగ్లాలు కట్టుకునే వాడినన్నారు. అన్ని డబ్బులు తీసుకుని అసెంబ్లీ ఎన్నికల్లో ఎందుకు పోటీ చేయలేదో ప్రజలకు చెప్పాలంటూ డీకే అరుణను డిమాండ్ చేశారు. తనపై వ్యక్తిగత విమర్శలు చేస్తే ఊరుకోబోనని హెచ్చరించారు.

విద్యార్థులు మేధస్సుకు పదును పెట్టాలి

పదో తరగతి భవిష్యత్‌కు పునాది

- జాతీయ జెండాను ఆవిష్కరించిన మాజీ మంత్రి హరీశ్‌రావ్

నవ తెలంగాణ-సిద్దిపేట

సాంకేతిక పరిజ్ఞానంతో విద్యార్థులు మేధస్సుకు పదును పెట్టాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం సిద్దిపేట గర్ల్స్ హైస్కూల్‌లో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొని పదవ తరగతి విద్యార్థులకు డిజిటల్ కంటెంట్ బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లా డుతూ.. డిజిటల్ కంటెంట్ బుక్స్ మన బాలికల ఉన్నత పాఠశాలలో ప్రారంభం చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. కార్పొరేట్ స్కూల్‌ను తలపించేలా పాఠశాలను తీర్చిదిద్దుకున్నామని, అద్భుత మైన గ్రౌండ్ ఏర్పాటు చేసుకున్నా మన్నారు. పదో తరగతి విద్యార్థులకు కేసీఆర్ డిజిటల్ కంటెంట్, టీహెచ్ఆర్ బహుమతిని అడ్వాన్స్‌గా అందజేస్తు న్నానని తెలిపారు. బాగా చదివి అత్యధిక మార్కులు సాధించాలని, అప్పుడే మీకు ఇచ్చిన ఈ గిఫ్ట్‌కు ఫలితం, సార్థకత ఉంటుందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక సిద్దిపేట అన్ని రంగాల్లో ఆదర్శంగా నిలుస్తుందని, అదే స్ఫూర్తితో విద్యారంగంలో ఆదర్శంగా నిలిచింద న్నారు. ఈ ఏడాది నియోజకవర్గంలో 2516 మందికి ఈ బుక్స్ పంపిణీ చేస్తున్నామన్నారు. క్యూ ఆర్ కోడ్‌ను మీ ఇంట్లో మీ అమ్మ, నాన్న ఆన్ లైన్ ఫోన్‌లో స్కాన్ చేస్తే వేంటనే ఆ సబ్జెక్ట్ అంశంపై టీచర్ బోర్డుపైన 3డి రూపంలో క్లాస్ చెబుతారని చెప్పారు. మీ అమ్మ నాన్నలకు ఉత్తరం రాశానని, వారికి ఫోన్ చేసి మీరు ఎలా చదువుతున్నారని అడుగు తానన్నారు. పదో తరగతి భవిష్యత్‌కు గొప్ప పునాది అని తెలిపారు. రాష్ట్రంలో సిద్దిపేట నియోజకవర్గాన్ని100 శాతం ఫలితాలు సాధించి అగ్రస్థానంలో నిలపాలన్నదే తన తాపత్రయమన్నారు.



హే రామ్..!

సంపాదకీయం

డెబ్బై నాలుగో గణతంత్ర దినోత్సవాన్ని పూర్తి చేసుకున్నాం. 1950 జనవరి 26న భారత రాజ్యాంగం అమలులోకి వచ్చిన చారిత్రక సందర్భానికి గుర్తుగా మన దేశం ఏటా ఈ వేడుకను జరుపుకుంటున్నది. అలా డెబ్బది నాలుగేండ్లు పూర్తి చేసుకుని డెబ్బది అయిదవ వడిలోకి ప్రవేశించిన వజ్రోత్సవ సమయమిది. సాధారణంగా ఇలాంటి సందర్భంలో ఈ రాజ్యాంగ దినోత్సవ వేడుక అంగరంగ వైభవంగా, స్ఫూర్తిదాయకంగా జరుగుతుందని భావించడం సహజం. కానీ అలా జరుగకపోగా ఆ రాజ్యాంగ పునాదులే కదులుతున్న అలికిడి వినిపిస్తోంది. ఈ సందర్భంగా రాజ్యాంగ స్ఫూర్తి, లక్ష్యాలపై జరగాల్సిన కనీస చర్చ కూడా ఇటు ప్రసారమాధ్యమాల్లోనూ అటు ప్రభుత్వ వేదికల్లోనూ లేకపోగా... అది పూర్తిగా అయోధ్య రామాలయ వేడుకలతో కప్పివేయబడింది. లేదంటే ఇదే సమయంలో మందిర ప్రారంభోత్సవం (జనవరి 22) నుంచి మహాత్ముని వర్ధంతి (జనవరి 30) వరకూ రామాలయ వారోత్సవాలకు స్వయంగా ప్రధానే పిలుపునివ్వడంలోని మతలబేమిటి? రామాలయ వారోత్సవాల మీద ఉన్న శ్రద్ధ రాజ్యాంగ ఉత్సవాల మీద లేకపోవడమేమిటి? ఈ నేపథ్యంలో ఇది ప్రగతిశీలురు, రాజకీయ విశ్లేషకులనేకులకు ఉద్దేశపూరిత చర్యగా కనిపించడంలో ఆశ్చర్యమేముంది?

"ఆరోగ్యకరమైన లౌకిక దృక్పథమే నిజమైన ప్రజాస్వామ్యానికి పునాది" అన్నాడు అంబేద్కర్. అది మచ్చుకైనా లేకుండా పోతే అంతకంటే విషాదమేముంటుంది..? "ప్రజాస్వామ్యమనేది అసమ్మతిగుండా ప్రవహిస్తుంది" అన్నాడు మహాత్మాగాంధీ. అసమ్మతిని ప్రకటిస్తే "ఆందోళన జీవులు" అని ఎగతాళి చేస్తున్నాడు ప్రధాని మోడీ. అసమ్మతిని, విమర్శను నిర్దాక్షిణ్యంగా అణచి వేయడమే ఇప్పుడొక విధానంగా సర్వసాధారణమై పోయింది. ఇది ప్రజా క్షేత్రంలోనే కాదు పార్లమెంటులోనూ పదేపదే రుజువవుతున్న సత్యం.

భారత రాజ్యాంగం ఈ దేశానికి ఏ లౌకిక, సమ్మిళిత రాజ్యాన్ని లక్ష్యంగా నిర్దేశించిందో సరిగ్గా ఇప్పుడు ఆ లక్ష్యానికే ముప్పు ఏర్పడిందని పరిస్థితులు సూచిస్తున్నాయి. లౌకికవాదం, ఆర్థిక స్వావలంబన, సామాజిక న్యాయం, ఫెడరలిజం ఆలంబనగా మన గణతంత్ర భారత్ ఆవిర్భవించింది. జాతీయోద్యమ ఆకాంక్షలకు ప్రతీకగా అది నిర్మించబడింది. స్వాతంత్ర్యానికి పూర్వం ఉన్న ఫ్యూడల్ భావజాలానికి భిన్నమైన ఆదర్శాలు, ఆధునిక వైజ్ఞానిక భావనలు పునాదిగా ఈ దేశ నిర్మాణం జరగాలని భారత రాజ్యాంగం నిర్దేశించింది. ఏ మత ప్రమేయమూ లేని పాలనా వ్యవస్థను ఆదేశించింది. లౌకిక, సామ్యవాదాలతోపాటు సమాఖ్య విధానం, స్వతంత్ర న్యాయవ్యవస్థ, పార్లమెంటరీ ప్రజాస్వామ్యం, ప్రాథమిక హక్కులను ఈ గణతంత్ర రాజ్య మౌలిక స్వరూపంగా పేర్కొన్నది. ఈ స్వభావమే డెబ్బది నాలుగేండ్లుగా కాలపరీక్షకు నిలిచి ఈ దేశాన్ని ఒక్కటిగా నడుపుతోంది. భిన్న మతాలు, కులాలు, విభిన్న సంస్కృ



తులు, ప్రాంతాలతో కూడిన భారత ప్రజలను ఒకే జాతిగా ఐక్యంగా నిలుపుతోంది. ఇప్పుడు ఈ మౌలిక స్వభావానికే ముప్పు ఏర్పడింది. ఈ ముప్పు ఈ దేశ పాలకుల నుండే ఎదురవుతుండటం ఆందోళనకరం.

లౌకిక, సామ్యవాద అనే పదాలనే రాజ్యాంగ పీఠిక నుండి తొలగించిన పాలకుల కాలమిది. వీరు నిర్లజ్జగా మతమే తమ అస్తిత్వంగా రాజకీయాలు సాగిస్తున్న వైనం బహిరంగ రహస్యం! లౌకిక స్వభావాన్ని కోల్పోతే ఏ దేశంలోనూ ప్రజాస్వామ్యం మనజాలదని చరిత్ర చెపుతోంది. నేటి ఆధునిక ప్రపంచం కూడా ఇదే రుజువు చేస్తోంది. కానీ ఈ దేశంలో ఏం జరుగుతోంది? పౌరసత్వానికి సైతం మతాన్నే ప్రామాణికంగా ఎంచుకోవడం మొదలు ఏకంగా ప్రభుత్వమే ఒక మతానికి ప్రాతినిధ్యం వహించే దశకు చేరింది..! "ఆరోగ్యకరమైన లౌకిక దృక్పథమే నిజమైన ప్రజాస్వామ్యానికి పునాది" అన్నాడు అంబేద్కర్. అది మచ్చుకైనా లేకుండాపోతే అంతకంటే విషాదమేముంటుంది..? "ప్రజాస్వామ్యమనేది అసమ్మతి గుండా ప్రవహిస్తుంది" అన్నాడు మహాత్మాగాంధీ. అసమ్మతిని ప్రకటిస్తే "ఆందోళన జీవులు" అని ఎగతాళి చేస్తున్నాడు ప్రధాని మోడీ. అసమ్మతిని, విమర్శను నిర్దాక్షిణ్యంగా అణచివేయడమే ఇప్పుడొక విధానంగా సర్వసాధారణమైపోయింది. ఇది ప్రజాక్షేత్రంలోనే కాదు పార్లమెంటులోనూ పదేపదే రుజువవుతున్న సత్యం. నేడు అధికారంలో ఉన్నవారు పౌరసమాజంలో ప్రశ్నించే సామర్థ్యాన్ని ఒక క్రమపద్ధతిలో బలహీన పరుస్తున్నారు.

భారత రాజ్యాంగం ఈ దేశం రాష్ట్రాల సమాఖ్య అని స్పష్టంగా చెప్పింది. కేంద్రం, రాష్ట్రాల మధ్య స్పష్టమైన అధికార విభజన చేసింది. ఇప్పుడా సమాఖ్య స్ఫూర్తికే విఘాతం కలుగుతోంది. కేంద్ర పాలకులు రాష్ట్రాల హక్కులను ఒక్కొక్కటిగా హరిస్తూ సమాఖ్య వ్యవస్థను నీరు గారుస్తున్నారు. ఇందుకు జీఎస్టీ మొదలు ఎస్‌ఈపీ వరకు ఉదాహరణలు కోకొల్లలు. రాష్ట్రాల ఉనికినే ప్రశ్నార్థకంగా మార్చి సర్వాధికారాలను కేంద్రం గుప్పిట్లో పెట్టుకునే ప్రయత్నాలు వేగంగా జరుగుతున్నాయి. మరోవైపు స్వతంత్రంగా వ్యవహరించాల్సిన వ్యవస్థలన్నీ ఏలికల నిరంకుశత్వానికి బలైపోతున్నాయి. చివరికి న్యాయవ్యవస్థ కూడా ఇందుకు మినహాయింపు కాకపోవడం కలవరపెట్టే అంశం. సుప్రీంకోర్టు పనితీరులో సైతం జోక్యం చేసుకుంటున్నారు. మంత్రులే న్యాయవ్యవస్థ స్వతంత్రతను బహిరంగంగా సవాలు చేస్తున్నారు. కొలీజియం ప్రతిపాదనలను ఖాతరు చేయకుండా తమకు ఇష్టమైన వారినే న్యాయమూర్తులుగా నియమిస్తున్నారు. ఇప్పుడీ దాడుల నుండి రాజ్యాంగాన్నీ, రాజ్యాంగ వ్యవస్థలను కాపాడుకోవడం ద్వారానే ఈ దేశాన్నీ కాపాడుకోగలం. "భారత ప్రజలమైన మేము ఈ రాజ్యాంగాన్ని మాకు మేము సమర్పించుకుంటున్నాం" అంటూ రాజ్యాంగ పీఠిక భారత ప్రజలందరి తరుపునా ప్రకటిస్తోంది. ఇప్పుడు దాన్ని కాపాడుకోవడం ప్రజల బాధ్యతే....

'భారతదేశ భావన' ను పరిరక్షించుకుందాం!

స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాలను సమర్థించే "భారతదేశ భావన" నేడు ప్రమాదంలో పడింది.అలాంటి భారతదేశ భావనకు మద్దతిచ్చే రాజకీయ శక్తులు,మతతత్వ శక్తుల హింసాత్మక దాడి నుండి ఈ దేశాన్ని రక్షించేందుకు దళితులు, ఆదివాసీలు, మైనార్టీలు, మహిళలను ఏకం చేయాల్సిన సమయం ఆసన్నమైంది.



రామ్ పునియానీ

2019లో నరేంద్రమోడీ నాయకత్వంలోని భారతీయ జనతా పార్టీని తిరిగి అధికారంలోకి తీసుకొని రావడంలో పుల్వామా విషాదం, బాలకోట్ వైమానిక దాడులు ఒక ప్రధానమైన పాత్ర పోషించాయని మాజీ గవర్నర్ సత్యపాల్ మాలిక్ చెప్తున్నాడు. ఆయన చెప్పేదాని ప్రకారం,2024 సాధారణ ఎన్నికల్లో తిరిగి అధికారాన్ని దక్కించు కునేందుకు బీజేపీ అలాంటి సన్నివేశాన్నే సృష్టిస్తుంది.ఆ క్రమంలోనే బీజేపీ, దాని అనుబంధ సంస్థలు అయోధ్యలోని రామ మందిరం చుట్టూ మతతత్వ పిచ్చిని సృష్టిస్తున్నాయి.ఈ పిచ్చి మధ్యలో,బాలల హక్కుల న్యాయవాది, రచయిత్రి అయిన శరణ్య అయ్యర్,తోటి ముస్లింలకు "డెబ్బై రెండు గంటల ప్రేమ, విచారం"గా వర్ణించబడే 72 గంటల ఉపవాసం, పశ్చాత్తాపాన్ని చేపడుతున్నట్లు చెప్పింది. ఆమె మొఘల్ వారసత్వంలో "గర్వాన్ని" కనుగొంటుంది.మన దేశం లాంటి వైవిధ్యమైన దేశానికి శుభసూచకం కానటువంటి ఒక విభజన వాతావరణాన్ని ఈరెండు విరుద్ధ ప్రచోదనాలు తెలియ జేస్తున్నాయి.

భారత స్వాతంత్ర్యోద్యమకాలంలో భారతదేశ భావనకు దారి చూపిన సమాజంలోని అవే వర్గాలన్నీ ఐక్యం కావడమే 'భారతదేశభావన' కు ఉన్న ఏకైక ఆశాకిరణం. ఇది వారి సమిష్టి ఉద్యమం, పుట్టుక ఆధారిత శ్రేణీగత వ్యవస్థ విలువలపై ఆనందాన్ని వ్యక్తం చేస్తున్న శక్తులు,భారత రాజ్యాంగానికి భిన్నంగా పవిత్రమైన గ్రంథాలను సమర్థించే శక్తులను బలహీనపరిచేందుకు చేస్తున్నవారి ముఖ్యమైన ప్రయత్నమిది. వారి ఉద్యమాలన్నీ చెల్లాచెదురుగా అయిపోయాయి. వారి సామూహిక ప్రయోజనాలు భిన్నంగా ఉండవచ్చు కానీ స్వాతంత్ర్యోద్యమ కాలంలో ఉద్భవించిన భారత దేశ భావన,భారత రాజ్యాంగాన్ని రక్షించడంలో వారి ప్రయోజనాల్ని, పార్టీలు, గ్రూప్‌లకు అతీతంగా సమిష్టిగా వ్యక్తీకరించవలసిన అవసరం ఉంది.

అలాగే, ఆలయ ప్రారంభోత్సవాలు కూడా మత సామరస్యాన్ని ప్రోత్సహిస్తున్నాయని రెండు సందర్భాలు మనకు తెలియజేస్తాయి. 1939లో ఢిల్లీలో లక్ష్మీనారాయణ దేవాలయాన్ని (బిర్లా టెంపుల్)ను ప్రారంభిస్తూ,మహాత్మా గాంధీ ఇలా పేర్కొన్నారు," ఇది, హిందూ శ్వాసాన్నాచరించే ప్రతీ ఒక్కరి ప్రార్థనగా ఉండాలనీ,ప్రపంచంలోని ప్రతీ మతం రోజురోజుకూ వృద్ధి చెందాలని, ఇది మొత్తం మానవాళికి సేవ చేయాలి. మతాలకు సమానమైన గౌరవ భావనను ప్రచారం చేయడానికి, గత మత పరమైన అసూయలు, ఘర్షణల్ని మరచిపోవడానికి ఈ దేవాలయాలు తోడ్పడాలని నేను ఆశిస్తున్నాను." కొద్దోగొప్పో ఇదే తరహాలో ఇంతకు ముందు స్వామీ వివేకానంద కూడా ఇలా అన్నారు: "ఇక్కడ భారతదేశంలో హిందువులు, క్రైస్తవుల కోసం చర్చిలు, మహమ్మదీయుల కోసం మసీదులను నిర్మిం చారు, ఇప్పుడు కూడా నిర్మిస్తున్నారు." 'లెక్చర్స్ ఫ్రమ్ కొలంబో టూ అల్మోరా' అనే తన రచనలో వివేకానందుడు ఇలా అంటాడు: "మన మతపరమైన భావనలు, విశ్వాసాలు భిన్నమైనవి అయినప్పటికీ మనం దాతృత్వంతో ఉండడమే కాకుండా ఒకరికి ఒకరం సానుకూలంగా సహాయంగా ఉండాలని అర్థం చేసుకోవాలి. భారతదేశంలో మనం ఇదే పని చెయ్యాలి."

శరణ్య ఉపవాస దీక్షదీనికి పూర్తి విరుద్ధంగా ప్రస్తుత వాతావరణం ఉన్నట్లు ప్రతిబింబిస్తుంది. ఆనంద్ పట్వర్ధన్ చేత నిర్మించబడి, సెన్సార్ బోర్డు ఆమోదించిన ప్రసిద్ధమైన 'రామ్ కే నామ్' సినిమాను ప్రదర్శిస్తున్న సాంస్కృతిక కార్యకర్తలను జనవరి 20న హైదరాబాద్‌లో అరెస్ట్ చేసి, నాన్‌బెయిలబుల్ వారెంట్లను జారీచేసిన సంఘటనలో కూడా ఇది ప్రతిబింబిస్తుంది. అయోధ్యలోని రామ్‌లల్లా ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం అనేది కేవలం దశాబ్దాల ప్రాచీన రామ జన్మభూమి ఉద్యమానికి పరాకాష్ట మాత్రమే కాక, జాతీయ చైత న్య పునర్నిర్మాణానికి ప్రారంభం కూడా అని, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ పత్రిక 'ఆర్గనైజర్' సంపాదకుడు ప్రఫుల్లకేత్కర్ వాదన. అంటే ప్రాథమికంగా దీనర్థం, మొత్తం సామాజిక మార్పు ప్రక్రియ, స్వాతంత్ర్యోద్యమానికి తోడుగా ఉన్న భారతదేశ భావన, ('హిందూ భారతదేశం' అని పిలువబడే దాని రాకతో) ఇప్పుడు ఉనికిలో లేకుండా చేస్తున్నారు. బహుళ దశల ద్వారా మతతత్వ శక్తులు హిందూ రాజ్యాన్ని సాధించాయి. అందరికీ స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, న్యాయం కోసం కృషి చేయడానికి, వలసవాద అధికారానికి వ్యతిరేకంగా పోరాటం చేసేందుకు సమాజంలోని భిన్న వర్గాల వారి ఏకీకరణ 'భారతదేశ భావన' కు తోడైంది. 'భారతదేశ భావన' ఉన్న ఈ మహోన్నత ఉద్యమం భారత రాజ్యాంగం విలువలతో పరాకాష్టకు చేరింది.

ఈ భారతదేశ భావనకు సవాళ్ళున్నాయి. రాజ్యాల విలువల్లో వాటి మూలాలున్నాయి, దానినే మనం స్థూలంగా ఫ్యూడల్ సమాజం అంటున్నాం. ఆలయ ప్రాణప్రతిష్ఠ చుట్టూ పిచ్చిని సృష్టించే ఈ శక్తులు కొనియాడుతున్న ఈ విలువల్లో పుట్టుకపై ఆధారపడే కులం, వర్గం, లింగ శ్రేణీగత వ్యవస్థలు ప్రధానమైనవి. ముస్లింలీగ్, హిందూ మహాసభ, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్‌గా ముందుకు వచ్చిన భిన్న మతాల రాజులు, భూస్వాములు, వారి సిద్ధాంతకర్తలలో వీటి మూలాలున్నాయి. ముస్లిం మతతత్వ శక్తులు వారి ఫ్యూడల్ విలువల భావనల్ని పాకిస్థాన్‌లో అమలు చేస్తుంటే, ఇప్పుడు హిందూ మతతత్వ శక్తులు సంతోషిస్తున్నాయి, క్రమంగా పెరుగుతున్న తీవ్రతతో, ఇప్పుడు రామ మందిర ప్రతిష్ఠాపనతో అర్ధ ఉన్నత శిఖరానికి చేరుకుంటుంది.

స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, లేక స్నేహభావంపై దృష్టిని కేంద్రీకరించిన భగత్‌సింగ్, అంబేద్కర్, గాంధీల విలువలలో స్వాతంత్ర్యోద్యమ భారతదేశ భావన తనను తాను వ్యక్తీకరించింది. జాతిపితతో కొన్ని అభిప్రాయ భేదాలున్నప్పటికీ, సుభాష్ చంద్రబోస్ కూడా నికరంగా ఈ 'భారతదేశ భావన'కు బద్ధుడై ఉన్నాడు.

ఉన్నతవర్గాల భూస్వామ్య, మనుస్మృతి ఆరాధనా భావజాలం హిందూ రాజ్యం, హిందుత్వకు సాంఘిక పునాదిగా ఉండేది. ఈ శక్తులు, ఈ భావజాలం, ముఖ్యంగా గడచిన నాలుగు దశాబ్దాల కాలంలో బాగా వృద్ధి చెందాయి, పాక్షికత్వం (సెక్టేరియనిజం) రోజురోజుకూ మరింత బలపడుతుండడంతో సంతోషిస్తున్నాయి. గాంధీజీ, వివేకానందుడు దేనినైతే బలపరి చారో దానికి భిన్నంగా వారు సంకుచితమైన మందిర ప్రతిష్ఠ ప్రణాళికను ముందుకు తీసుకొని వస్తున్నారు. మనుస్మృతిలో అంతర్లీనంగా ఉండే బ్రాహ్మణవాదం అని పిలువబడే ప్రత్యేకమైన 'నాగరిక విలువలను' మరింత లోతుగా పెంచడం కోసమే ఏకపక్షీయ (సెక్టేరియన్) జాతీయ వాదులున్నారు. మనుస్మృతి విలువలను వదిలించుకునేందుకు నిలబడినవారు, భారతీయత అనే గొడుగుకింద అందరినీ కలుపుకొని పోతున్నవారు కులం, వర్గం, లింగ భేదాలకు అతీతంగా కలిసి నిలబడే వారు,



ఈ భారతదేశ భావనకు సవాళ్ళున్నాయి. రాజ్యాల విలువల్లో వాటి మూలాలున్నాయి. దానినే మనం స్థూలంగా ఫ్యూడల్ సమాజం అంటున్నాం. ఆలయ ప్రాణప్రతిష్ఠ చుట్టూ పిచ్చిని సృష్టించే ఈ శక్తులు కొనియాడుతున్న ఈ విలువల్లో పుట్టుకపై ఆధారపడే కులం, వర్గం,లింగ శ్రేణీగత వ్యవస్థలు ప్రధానమైనవి. ముస్లింలీగ్, హిందూ మహాసభ, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్‌గా ముందుకు వచ్చిన భిన్న మతాల రాజులు, భూస్వాములు, వారి సిద్ధాంతకర్తలలో వీటి మూలాలున్నాయి. ముస్లిం మతతత్వ శక్తులు వారి ఫ్యూడల్ విలువల భావనల్ని పాకిస్థాన్‌లో అమలు చేస్తుంటే, ఇప్పుడు హిందూ మతతత్వ శక్తులు సంతోషిస్తున్నాయి, క్రమంగా పెరుగుతున్న తీవ్రతతో, ఇప్పుడు రామమందిర ప్రతిష్ఠాపనతో అర్థ ఉన్నత శిఖరానికి చేరుకుంటుంది.

హిందూ భారతదేశం వారి వివిధ రకాల బెదిరింపులకు గురవుతున్నారు. ముస్లిం పాకిస్థాన్‌కు సమాంతర, వ్యతిరేకమైన వర్గాలు పుట్టుకొస్తున్నాయి.

భారత స్వాతంత్ర్యోద్యమకాలంలో భారతదేశ భావనకు దారిచూపిన సమాజంలోని అవే వర్గాలన్నీ ఐక్యం కావడమే 'భారతదేశ భావన'కు ఉన్న ఏకైక ఆశాకిరణం. ఇది వారి సమిష్టి ఉద్యమం, పుట్టుక ఆధారిత శ్రేణీగత వ్యవస్థ విలువలపై ఆనందాన్ని వ్యక్తం చేస్తున్న శక్తులు, భారత రాజ్యాంగానికి భిన్నంగా పవిత్రమైన గ్రంథాలను సమర్థించే శక్తులను బలహీనపరిచేందుకు చేస్తున్న, వారి ముఖ్యమైన ప్రయత్నమిది. వారి ఉద్యమాలన్నీ చెల్లాచెదురుగా అయిపోయాయి. వారి సామూహిక ప్రయోజనాలు భిన్నంగా ఉండవచ్చు కానీ స్వాతంత్ర్యోద్యమ కాలంలో ఉద్భవించిన భారత దేశ భావన,భారత రాజ్యాంగాన్ని రక్షించడంలో వారి ప్రయోజనాల్ని, పార్టీలు, గ్రూప్‌లకు అతీతంగా సమిష్టిగా వ్యక్తీకరించవలసిన అవసరం ఉంది.

ఏకపక్షీయం కాని (నాన్ సెక్టేరియన్) అనేక పార్టీలు నేడు ఉనికిలో ఉన్నాయి. ఎన్ని భేదాభిప్రాయాలు ఉన్నప్పటికీ కూడా ఈ పార్టీలకు చెందిన పూర్వీకులు చాలా మంది బ్రిటీష్ వలసవాద శక్తులకు వ్యతిరేకంగా పోరాడారు. సమాజంలోని ఈ వర్గాల సామాజిక, రాజకీయమైత్రికి ప్రాధాన్యత ఇవ్వవలసిన సమయం ఆసన్నమైంది. వలసపాలన సమాజంలోని పెద్ద వర్గాల ప్రయోజనాలకు హానికరంగా ఉండేది, అదేవిధంగా విభజన ద్వారా పాలన సాగిస్తున్న అధికార పార్టీ సమాజంలోని బలహీన వర్గాల హక్కులను కాలరాస్తుంది.ఇది గడచిన పది సంవత్సరాల కాలంలో చాలా స్పష్టంగా కనిపించింది.

పిచ్చి,పిచ్చితో పోరాడలేదు. దళితులు, మతపరమైన మైనార్టీలు, మహిళలు, కార్మికులు, ఆదివాసీల లాంటి సమాజంలోని బలహీన వర్గాల్ని ఐక్యం చేసే భావజాలం మనకు అవసరం. స్వాతంత్ర్య ఉద్యమంతో పాటే వచ్చిన 'భారతదేశ భావన' యొక్క విలువలను కాపాడే ఉమ్మడి బాధ్యత పై తరగతుల వారందరిదీ.


("ద వైర్" సౌజన్యంతో)

అనువాదం : బోడపట్ల రవీందర్, 9848412451

అయోధ్యలోని రామ్‌లల్లా ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం అనేది కేవలం దశాబ్దాల ప్రాచీన రామజన్మభూమి ఉద్యమానికి పరాకాష్ట మాత్రమే కాక, జాతీయ చైతన్య పునర్నిర్మాణానికి ప్రారంభం కూడా అని, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ పత్రిక 'ఆర్గనైజర్' సంపాదకుడు ప్రఫుల్లకేత్కర్ వాదన. అంటే ప్రాథమికంగా దీనర్థం,మొత్తం సామాజిక మార్పు ప్రక్రియ, స్వాతంత్ర్యోద్యమానికి తోడుగా ఉన్న భారతదేశ భావన,('హిందూ భారతదేశం' అని పిలువబడే దాని రాకతో) ఇప్పుడు ఉనికిలో లేకుండా చేస్తున్నారు. బహుళ దశల ద్వారా మతతత్వ శక్తులు హిందూ రాజ్యాన్ని సాధించాయి. అందరికీ స్వేచ్ఛ, సమానత్వం,సౌభ్రాతృత్వం, న్యాయం కోసం కృషి చేయడానికి,వలసవాద అధికారానికి వ్యతిరేకంగా పోరాటం చేసేందుకు సమాజంలోని భిన్న వర్గాల వారి ఏకీకరణ 'భారతదేశ భావన'కు తోడైంది.

'ధరణి' లోపాలు - ఒక పరిశీలన

ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ధరణిని "భూమాత" పథకంగా మార్చి అందులోని లోపాలను సరిచేయడానికి ఐదు గురితో కమిటీ వేయడం హర్షించదగ్గ విషయం. ఈ దిగువ లోపాలను సరిచేయడం ద్వారా భూమాత పథకాన్ని రైతులకు అందుబాటులోకి తేవాలి.గత ప్రభుత్వం రెవెన్యూ చట్టం "పాసు పుస్తకాల చట్టం - 1971" లోని సెక్షన్ 26ను మార్పు చేస్తూ 2020 సెప్టెంబర్ 9న శాసనసభలో ప్రవేశపెట్టి చట్టంగా రూపొందించారు. దానికి "ధరణి పథకం" అని పేరు పెట్టారు. 17 సెక్షన్లతో ఈ చట్టాన్ని రూపొందించారు. ఈ చట్ట మార్పిడితో రైతుల సమస్యలు అన్ని పరిష్కారం అయ్యా యని ప్రభుత్వం ప్రకటించింది. కానీ గత లోపాలకు తోడు, అదనపు లోపాలతో రైతులు ఇబ్బందులు పడ్డారు. గత ప్రభుత్వం నాటి ఆర్థికమంత్రి హరీశ్‌రావు నాయకత్వాన వేసిన కమిషన్ కూడా ధరణిలో 20లోపాలు ఉన్నట్లు గుర్తించింది. మీ సేవ ద్వారా లోపాలు సరిదిద్దుకోవాలని చెప్పినప్పటికీ ఇంతవరకు ఏ ఒక్క లోపం సరికాలేదు. ధరణిని ప్రారంభించిన ప్రభుత్వం దళితుల, వెనకబడిన వర్గాలకు ఇచ్చిన అసైన్డ్ భూములను తమ ఫాంహౌస్‌ల కొరకు బలవంతపు రిజిస్ట్రేషన్లు చేసుకున్నట్టు 'ప్రజాపాలన'లో వేల దరఖాస్తులు వచ్చాయి. పల్లెవనం, డబుల్‌బెడ్ రూం, ప్రాజెక్టులు, రహదారుల పేరుతో పేదల భూములను నష్టపరిహారం ఇవ్వకుండా ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. ప్రభుత్వ అధికారులు చేసిన తప్పుల వలన, అనగా రికార్డులు ఉద్దేశ్యపూర్వకంగా తప్పులు రాయడంతో లక్షలమందికి పాసుపుస్తకాలు రాలేదు. దీనిపై వేసిన కేబినెట్ కమిటీ ధరణి లోపాలవల్ల 13లక్షల మందికి పాసుపుస్తకాలు ఇవ్వలేదని నివేదిక ఇచ్చింది.



సారంపల్లి మల్లారెడ్డి

ధరణి చట్టంలోని సెక్షన్-8లో వారసత్వంగా వచ్చిన ఆస్తిని కూడా వారసులకు రిజిస్ట్రేషన్ చేయాలని, అందుకు మ్యుటేషన్ ఫీజు చెల్లించాలని నిర్ణయించారు. వారసత్వంగా వచ్చే ఆస్తికి ధరణి నాటికి ఎలాంటి రిజిస్ట్రేషన్లు గాని, ఛార్జీలు గాని లేవు. ప్రస్తుతం ఉన్న చట్టాన్ని సవరించి రిజిస్ట్రేషన్ రద్దు చేయాలి. కుటుంబ "భాగస్వామ్య పత్రం (ఫైస్లానామ)" ద్వారా వారసత్వ హక్కులు మార్చాలి.పురాతన కాలం నుండి వస్తున్న రెవెన్యూ రికార్డుల్లోని "సాగుదారుల కాలం (కాస్తు కాలం)"ను తొలగించారు. దీని వల్ల వాస్తవ సాగుదారులకు నష్టం వాటిల్లింది. తెలంగాణలో సాదాబైనామాలపై కొనుగోలు చేసినవారు, కౌలుకు చేసేవారు, భూములు తాకట్టుపెట్టుకున్నవారు తమ హక్కులు కోల్పోయారు. రెవెన్యూ చట్టం లోని సెక్షన్-26 ప్రకారం (1) పట్టాదారుకు (2) వాస్తవ సాగుదారుకు (3) కౌలుదారుకు (4) స్వాధీనపు దారుకు పాసుపుస్తకాలు ఇవ్వాలి. పట్టాదారుకు ఇచ్చే పాసు పుస్తకంతో పాటు, వాస్తవ సాగుదారుకు మరో పాసు పుస్తకం ఇవ్వాలని చట్టం చెప్పింది. దాన్ని గత ప్రభుత్వం తొలగించడం వల్ల లక్షల మంది తమ స్వాధీనపు హక్కును కోల్పోయారు. రెవెన్యూ రికార్డుల్లో తిరిగి సాగుదారుల కాలం (కౌలుదారులకాలం)ను పెట్టాలి. గతంలో తహశీల్దారు, ఆర్డీవో, కలెక్టర్ కోర్టుల్లో రెవెన్యూ కేసులు ఫైల్ చేసారు. ఈ మూడు కోర్టులను గత ప్రభుత్వం రద్దు చేసింది. ఫలితంగా ఆ కోర్టుల్లో నడుస్తున్న 16,140 కేసులను రద్దు చేసారు. ట్రిబ్యునల్ ద్వారా పరిష్కరి స్తామని చెప్పినప్పటికీ పరిష్కారం కాలేదు. ప్రతి వివాదం ఉన్న రైతు సివిల్ కోర్టుకు వెళ్ళడం సాధ్యంగాని పని. అందువల్ల రైతులకు అందుబాటులో ఉన్న రెవెన్యూ కోర్టులను పునరుద్ధ రించాలి. భూముల రిజిస్ట్రేషన్‌లో "22ఎ నిషేధ రిజిస్టర్"ను విస్తరించారు. గతంలో ప్రభుత్వ భూములకు, అసైన్డ్ భూ ములు, అడవి బంజర్లకు మాత్రమే వర్తించిన ఈ నిషేధ చట్టా న్ని పట్టాదారులకు కూడా అన్వయింపజేసారు. ఒక భూమిలో కొంతభాగం రిజిస్ట్రేషన్ చేసినచో మిగతా భూమిని 22ఎ క్రింద నిషేధించారు. నిషేధపు రిజిస్టర్‌లోని వాస్తవ హక్కుదారుల భూములను తొలగించాలి.

కౌలుదారులు

గ్రామసభల ద్వారా కౌలుదారులను గుర్తించాలి. ఏడాదికి ఉపయోగపడే విధంగా "లోన్ ఎలిజిబులిటీ కార్డు"ను ఇవ్వాలి. గతంలో 2011 చట్టం ప్రకారం కార్డులను ఇచ్చినప్పటికీ దానిలో "ఈ కార్డు పట్టాదారుకు వ్యతిరేకంగా ఎలాంటి సాక్ష్యంగా చెల్లనేరదు" అని రాయబడింది. అందువల్ల ఒక సంవత్సరానికి సంబంధించి (1) బ్యాంకు రుణాలు (2) పంటల బీమ (3) ప్రభుత్వ పరిహారాలు (4) ప్రభుత్వ పథకాలు - సబ్సిడీలు వగైరాకు మాత్రమే ఉపయోపడతాయి. అందువల్ల గ్రామ సభలు జరిపి ప్రతియేటా మే చివరి నాటికి కౌలుదారులకు కార్డులు ఇవ్వాలి. ప్రస్తుతం ధరణి చట్టంలోని లోపాలను సవరించుటకు కొత్తగా సవరణ చట్టాలు చేయాలి.

ధరణి లోపాలు

ధరణి వెబ్‌సైట్ అమలులోకి వచ్చిన తర్వాత ప్రభుత్వం చేసిన లోపాలన్నీ ఒక్కొక్కటిగా బయటికి వచ్చాయి. 1) చనిపోయిన పట్టాదారు పేరు మీద పాసు పుస్తకాలు వచ్చినవి 2)ఆధార్ తప్పుగా నమోదైనవి 3) పాసు పుస్తకాలలో ఫొటోలు తప్పుగా ఉన్నవి 4) పట్టాదారు పేరు తప్పుగా రాయబడినవి 5) వ్యవసాయేతర భూములకు (నాలా) పాసుపుస్తకాలు ఇచ్చినవి 6) పాసుపుస్తకంలో తక్కువ విస్తీర్ణం రాయబడినవి 7) పాసుపుస్తకంలో ఎక్కువ విస్తీర్ణం రాసినవి 8)ఒకే ఖాతాను రెండుచోట్ల రాసినవి 9)సర్వే నెంబర్లలో తప్పులు రాసినవి 10)అమ్ముకున్న అసైన్డ్ భూములకు పాసుపుస్తకాలు ఇచ్చినవి 11)అటవీశాఖతో వివాదాలున్న భూములకు పాసుపుస్తకాలు ఇచ్చినవి. ఇవేకాక మరిన్ని లోపాలు ఉన్నాయి. గత ప్రభుత్వం 13 లోపాలను సరిచేయడానికి "ఒక మాడ్యూల్" నిర్ణయించి ప్రతి రైతునుండి రు.1650లు మీ సేవద్వారా చెల్లించి పై లోపాలను సరిచేసుకోవాలని ప్రకటించింది. లక్షల మంది మీ సేవలో ఫీజు చెల్లించారు. వాస్తవానికి పైలోపాలు ప్రభుత్వ అధికారుల ద్వారా జరిగినవి మాత్రమే. వాటిని సరిచేయడానికి రైతులు ఎలాంటి ఫీజులు చెల్లించాల్సిన అవసరం లేదు. కానీ వేలాది రూపాయలు రైతుల నుండి అక్రమంగా వసూలు చేసింది. ఫీజు చెల్లించినవారికి కూడా నేటికీ ఎలాంటి సవరణలు చేయలేదు. అందువల్ల ధరణి చట్టం ద్వారా వచ్చిన లోపాలను "డిజిటలైజేషన్ లోపాల పేరుతో" గత ప్రభుత్వం దాటవేసింది. ప్రస్తుత ప్రభుత్వం ఈ లోపాలను సరిచేయడానికి గ్రామాల్లో సభలు ఏర్పాటు చేయడం ద్వారా యంత్రాంగాన్ని ఏర్పాటు చేసి సరిచేయాలి. వ్యవసాయేతర భూములను విడిగా రిజిస్టర్ చేసి, వెబ్‌సైట్‌లో పొందుపర్చాలి. హార్టికల్చర్ భూములను కూడా విడిగా రిజిస్టర్ మెయింటైన్ చేయాలి. ఆ విధంగా చేయడం వల్ల రైతుబంధు నిధులు దుబారా కాకుండా ఉంటాయి. "భూమాత" పథకాన్ని సమగ్రంగా తయారుచేయడానికి వ్యవసాయ భూములకు మాత్రమే పాసుపుస్తకాలు ఇవ్వాలి. వానాకాలం సాగుచేస్తున్న భూములలో 50శాతం యాసింగిలో సాగుచేయరు. దీని వల్ల బడ్జెట్‌పై అదనపు భారం పడుతున్నది. 1940లో రాష్ట్రంలో భూసర్వే జరిగింది. నేటి వరకు ఎలాంటి సర్వేలు జరగలేదు. అక్రమార్కులు రికార్డులను మార్పులు చేసారు. భూసర్వే జరపడానికి ఈ ప్రభుత్వం యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలి. సాదా బైనామాలను రెగ్యులరైజ్ చేయాలి. కొనుగోలు చేసిననాటి రిజిస్ట్రేషన్ ఛార్జీలను వసూలు చేయడం ద్వారా రికార్డ్స్ ఆఫ్ రైట్స్ (ఆర్‌వోఆర్)ను అమలు చేయాలి. దేవాదాయ, ధర్మాదాయ, వక్ఫ్, భూదాన భూములను సర్వే చేసి భూ ఆక్రమణల నుండి రక్షించాలి.


కోనేరు రంగారావు కమిటీ సిఫార్సులను అమలు చేయడం ద్వారా ప్రభుత్వ సీలింగ్, బంజర్లను పేదలకు పంచాలి.1973 భూ సంస్కరణల చట్టంలోని లోపాలను సరిదిద్దాలి. క్యాబినేట్ ఆమోదంతో సీలింగ్ చట్టాలకు తూట్లు పొడిచే విధంగా గత ప్రభుత్వం భూములను కేటాయించింది. ఫాంహౌస్‌ల సంస్కృతి విస్తరించి అసైన్డ్ భూములను లాక్కున్నారు. వీటిని విడుదల చేసి తిరిగి లావణీ పట్టాదారులకు భూములను ఇవ్వాలి. భూసేకరణ సందర్భంగా లావోణి, అసైన్డ్ భూములకు మార్కెట్ ధర చెల్లించాలి. లేదా భూమికి భూమి ఇచ్చి భూసేకరణ చేయాలి. ధరణి చట్టం-సెక్షన్లలోని లోపాలను సవరణ చేస్తూ శాసనసభలో ఆమోదించి చట్టం చేయాలి.

పట్టాదారుకు ఇచ్చే పాసుపుస్తకంతో పాటు, వాస్తవ సాగుదారుకు మరో పాసుపుస్తకం ఇవ్వాలని చట్టం చెప్పింది. దాన్ని గత ప్రభుత్వం తొలగించడం వల్ల లక్షల మంది తమ స్వాధీనపు హక్కును కోల్పోయారు. రెవెన్యూ రికార్డుల్లో తిరిగి సాగుదారుల కాలం (కౌలుదారుల కాలం)ను పెట్టాలి.గతంలో తహశీల్దారు, ఆర్డీవో, కలెక్టర్ కోర్టుల్లో రెవెన్యూ కేసులు ఫైల్ చేసారు. ఈ మూడు కోర్టులను గత ప్రభుత్వం రద్దు చేసింది. ఫలితంగా ఆ కోర్టుల్లో నడుస్తున్న 16,140 కేసులను రద్దు చేసారు. ట్రిబ్యునల్ ద్వారా పరిష్కరిస్తామని చెప్పినప్పటికీ పరిష్కారం కాలేదు.



లౌకిక రాజ్యం ఎటుపోతోంది!?

ప్రజాస్వామ్య దేశంలో ప్రజలు నాయకుల్ని నమ్మి ఓటేసి అధికార పీఠాన్ని అప్పగిస్తే?. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా.. విలాసవంతమైన జీవితాల్లో పాలకులు, ధనికులు బిజీగా ఉన్నారు. జీవన భారం భరించలేక కడుపులు మాడ్చుకుంటూ పేదలు దరిద్రపు కబంధహస్తాల్లో నలిగిపోతూనే ఉన్నారు. వీరికి నిలువ నీడ లేదు, పూట గడవడం లేదు. దేశంలో అప్పులు పెరిగిపోతున్నాయి. ధనవంతుల ఆస్తులూ కూడా రెట్టింపు అవుతున్నాయి. మరి ఎక్కడ పోతుంది దేశ సంపద? స్వాతంత్ర్యం తరువాత ప్రజాపాలనలో దేశ సంపద ఎవరిపాలైందో ప్రభుత్వ గణాంకాలే రూఢీ చేస్తున్నాయి. దేశంలో ప్రాణం లేని దేవుళ్లకుకు ఉన్న విలువ ఆకలితో అలమటిస్తున్న అభాగ్యులకు లేదు. ప్రజలకు సేవ చేస్తామని పాలన పగ్గాలు చేపట్టిన వారు దేశంలో నింగి నుండి నేల వరకు అన్నింటిని టోకున కార్పొరేట్, పారిశ్రామికులకు కారు చౌకగా అమ్మేస్తున్నారు. మరోవైపు వారికి రాయితీలు, పన్నులు మినహాయింపులిస్తూ, ఆర్థిక ఎదుగుదలకు మనం ఎంచుకున్న పాలకులే తోడ్పడుతున్నారు. ఓటేసిన ప్రజల బాగోగులు విస్మరిస్తున్నారు. అలా దేశంలో గుప్పెడు మంది చేతిలో జాతి సంపద చేరడం అబివృద్ధి అని చెప్పడం భావ్యమేనా?



మన దేశంలో సాధారణ ఎన్నికలకు చేరువవుతున్న వేళ చివరి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ఈ నెల చివరి నుంచి పది రోజుల పాటు జరగబోతున్నాయి. ఫిబ్రవరి 1న ఆర్థిక మంత్రి మధ్యంతర బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. ఈ సమావేశాల అనంతరం ఏ క్షణమైనా ఎన్నికల కమిషన్ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించే అవకాశం ఉంది. కేంద్ర ప్రభుత్వం ఇంకొన్ని ఓటు బ్యాంక్ కీలక నిర్ణయాలు తీసుకోవచ్చనే అభిప్రాయాలు వెలువడుతున్నాయి. అయితే ఈ క్రమంలో గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయకలేదన్న వాస్తవం ప్రజలు మరచిపోరాదు. నల్లధనం తెస్తామని ఉన్న కరెన్సీని రద్దుచేసి ఆ తర్వాత రిజర్వ్‌బ్యాంకు వేదికగా ధనికులకు పక్షపాతం వహిస్తూ దేశాన్ని అప్పుల పాలు చేసింది. బుల్లెట్ ట్రైన్ చూపిస్తూ, రైల్వేలనే అమ్మేసింది. రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఉన్న ఉద్యోగాలే ఊడపీకింది. న్యూ ఎడ్యుకేషన్ పాలసీ అని విద్యను ప్రభుత్వం ఆధీనంలో లేకుండా అమ్మేస్తూ, అశాస్త్రీయతను పెంచిపోషిస్తోంది. ప్రతిపక్ష పార్టీ(నాయకు)లపై ఈడీ, ఐటీ, సీబిఐలను ఉసిగొలుపుతున్న అప్రజాస్వామిక విధానం, మరోవైపు జీఎస్టీ, సెస్సులు, పన్నులతో ప్రజల అరకొర ఆదాయాన్ని జలగల్లా పీల్చుచూ భారాన్ని మోపుతూనే ఉన్నది. దీనికి కారణం ప్రజలు ఎంచుకున్న నేతలే. కేంద్రంలో తమకు ఇష్టం వచ్చినట్టు పాలన సాగిస్తున్నారు.

పేదరికం, ఉపాధిలేమి, నిరుద్యోగం, రైతు ఆత్మహత్యలు, అధిక ద్రవ్యోల్బణం, పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ వంటి వాటి పై పన్నులతో పాటు ఆకాశాన్ని తాకుతున్న నిత్యావసర వస్తువుల ధరల కారణంగా ప్రజల పరిస్థితి ఇప్పుడు "మూలిగే నక్కపై తాటిపండు పడిన చందంగా" ఉంది. కనీస అవసరాలు కూడా తీర్చుకోలేని దుస్థితిలో పేద, మధ్యతరగతి ప్రజలు విలవిల్లాడుతున్నారు. తాజాగా బిల్కిస్‌బానో కేసులో సుప్రీంకోర్టు తీర్పు గుజరాత్ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలను తప్పు పట్టిన తీరు ఇలాంటి పరిస్థితుల నుండి దేశ ప్రజలను దృష్టి మళ్లించడానికి మత రాజకీయాలను, భావోద్వేగాలను రెచ్చగొట్టి రాబోవు ఎన్నికల్లో లబ్దికోసం ఓటు బ్యాంకు విన్యాసాలకు పూనుకుంటున్న విషయం గమనించాలి. ప్రజాస్వామ్య, లౌకిక రాజ్యంలో రామ మందిరం ప్రాణప్రతిష్ఠ ఎన్నికల స్టంట్‌లో ఒక భాగమే. రాబోయే ఎన్నికల్లో పార్టీకి రాజకీయ ప్రయోజనం చేకూర్చేందుకు ఈ కార్యక్రమాన్ని ఉపయోగించుకుంటోంది. ఎన్నికల విజయం కోసం మతాన్ని వాడుకోవడం లౌకిక రాజ్యంలో అప్రజాస్వామికం.

రాబోయే ఎన్నికల్లో గత పదేండ్ల ప్రభుత్వ వ్యతిరేకతను దృష్టి మళ్ళించడానికి పాన్ ఇండియా కథనాన్ని వండి వార్చారు. ఈ కథనం కాశ్మీరు లేదా పాకిస్తాన్ అంశాల కంటే భావోద్వేగాలను పురికొల్పే విధంగా ఉంది. ఈ అంశాల గురించి ప్రతిపక్షాలు, మీడియా, ప్రజాసంఘాలు వాస్తవాలను ప్రజలకు, ఓటర్లకు అవగాహన కల్పించాలి. రాముడు రాజకీయాలకు అతీతుడు అన్న విషయాన్ని ప్రజల మనసులో నాటేలా చేయాలి. ఎన్నికల్లో విజయం సాధించాలని కోరుకుంటున్న రాజకీయ పార్టీకి, ప్రజల మత విశ్వాసాలకు సాధనంగా మారడాన్ని అనుమతించకూడదని స్పష్టం చేయాలి. ఓ హిందువు రాముడిని విశ్వసించేవాడు బీజేపీ ఓటర్ కానక్కర్లేదని నచ్చచెప్పాలి. సుప్రీంకోర్టు తీర్పు మేరకే రామ మందిరాన్ని నిర్మిస్తున్న వాస్తవాన్ని ప్రతిపక్షాలు, మీడియా, ప్రజా సంఘాలు ప్రజలు గుర్తించేలా ప్రయత్నించాలి. రాజకీయ మందిరంగా మార్చిన ఈ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని వ్యతిరేకిస్తున్న హిందూ సమాజం కూడా ఉంది. రాజకీయ పార్టీ వేరు? రాముడు వేరు? అనే భావన కల్పించే మతగురువులు కొందరు దీన్ని బహిరంగంగానే వ్యతిరేకిస్తున్న వాస్తవాన్ని ప్రజలకు చెప్పాల్సి ఉంది.

ఇక భారత పౌరులు ఎన్నికలు సమీపిస్తున్న వేళ సంక్లిష్ట భావోద్వేగ పరిస్థితులను విచక్షణతో ఆలోచిస్తూ.. ఎన్నికల్లో ఓటు కోసం వచ్చిన వారిని తన రోజువారి జీవితంపై ప్రభావం చూపే అంశాలపై ప్రశ్నించాలి. ఎందుకంటే ప్రజల జీవితాలను బాగు చేయాలంటే ఈ అవగాహన అవసరం. ప్రజలు ఎలా జీవిస్తున్నారు, ఏం పని చేస్తున్నారు. విద్యా నైపుణ్యాలు ఏ స్థాయిలో ఉన్నాయి? వంటి వాటిని ప్రభుత్వం వాస్తవాలు తెలియజేయకుండా, దాస్తున్నది. వీటిపై దృష్టి సారించకుండా ప్రజల్ని హిందూవాదంతో రెచ్చగొడుతూ మతాలకు రాజకీయ రంగు పులుముతోంది. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రజల్ని తప్పుదారి పట్టించే విధానాలు ఇంకా పెరుగుతాయి. అయితే వాటికి ప్రభావితం కాకుండా లౌకిక సంక్షేమ రాజ్యాన్ని కాపాడే దిశగా ప్రతి పౌరుడు ఆలోచించి అడుగేయాల్సిన తరుణమిది.



- మేకిరి దామోదర్, 9573666650

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఖమ్మం
శనివారం | జనవరి 27, 2024 | www.navatelangana.com

కమిషనర్ సుజాతకు ఉత్తమ ఉద్యోగి అవార్డు



నవతెలంగాణ-సత్తుపల్లి

సత్తుపల్లి మున్సిపల్ కమిషనర్ కోడూరు సుజాతకు ఉత్తమ ఉద్యోగి అవార్డు లభించింది. శుక్రవారం ఖమ్మంలో జరిగిన 75వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో కలెక్టర్ వీపీ గౌతమ్ సుజాతకు ఉత్తమ ఉద్యోగి అవార్డును ప్రదానం చేశారు. కమిషనర్‌గా వివిధ విభాగాల్లో ఉద్యోగ బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తూ మున్సిపాలిటీ అభివృద్ధి పథంలో నడిచేందుకు కృషి జరిపినందుకు సుజాతను ఈ అవార్డుకు ప్రభుత్వం ఎంపిక చేసింది. కమిషనర్ సుజాతకు ఉత్తమ ఉద్యోగి అవార్డు రావడం పట్ల మున్సిపల్ ఛైర్మెన్ కూసంపూడి మహేశ్, కౌన్సిలర్లు, మున్సిపల్ కార్యాలయంలోని వివిధ విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బంది కమిషనర్ సుజాతకు అభినందనలు తెలిపారు.

నేడు మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్

నవతెలంగాణ-నేలకొండపల్లి

జన విజ్ఞాన వేదిక నేలకొండపల్లి మండల శాఖ ఆధ్వర్యంలో నేడు ఉదయం 10 గంటలకు నేలకొండపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహించనున్నట్లు జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి సిహెచ్. భాస్కర్‌రెడ్డి, మండల అధ్యక్షులు సుంతరమోని నాగార్జున తెలిపారు. శుక్రవారం స్థానికంగా విలేకరులతో వారు మాట్లాడారు. మండలంలోని ప్రభుత్వ ప్రైవేటు ఉన్నత పాఠశాలల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభా పాటలను, సృజనాత్మకమైన శక్తిని వెలికి తీసేందుకు చెకుముకి టాలెంట్ టెస్టులు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. తద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవడానికి తోడ్పడతాయన్నారు. మరిన్ని వివరాల కోసం 9948060106, 9959428042, ఫోన్ నెంబర్లని సంప్రదించాలని తెలిపారు.

ఉత్తమ వైద్యాధికారిగా డాక్టర్ నెల్లూరు చందన



నవతెలంగాణ-కామేపల్లి

గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం కామేపల్లి మండల వైద్యాధికారి డాక్టర్ నెల్లూరు చందనకు ఉత్తమవైద్యాధికారిగా ప్రశాంత పత్రం జిల్లా కలెక్టర్ విపి. గౌతమ్ చేతులమీద అందజేశారు. కామేపల్లి మండలంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంతోపాటు ప్రత్యేకంగా ఓపి ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాలు చేయడం వారిని ప్రత్యేకంగా గుర్తించి ఉత్తమ వైద్యాధికారిగా ప్రసంస పత్రం గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఖమ్మం కలెక్టరేట్‌లో అందజేశారు. ఈ సందర్భంగా ఉత్తమ వైద్యాధికారిగా ప్రశంస పత్రం అందుకున్న వైద్యాధికారి డాక్టర్ నెల్లూరు చందనకు ప్రభుత్వ వైద్య సిబ్బందితోపాటు మండల పరిధిలోని ప్రజాప్రతినిధులు అధికారులు ఘనంగా సన్మానించి అభినందించారు. విధినిర్వాహణలో సమర్ధవంతంగా శక్తివంచనలేకుండా కృషి చేసినందుకు ప్రసంస పత్రం గౌరవం దక్కిందన్నారు.

గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ పద్మావతికి ఉత్తమ ప్రతిభ పురస్కారం



నవతెలంగాణ-ఎర్రుపాలెం

గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఖమ్మం జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలకు సంబంధించిన ఉత్తమ ప్రిన్సిపాల్‌గా ఎం. పద్మావతి ఖమ్మం జిల్లా కలెక్టర్ విసి గౌతమ్ చేతుల మీదుగా ఉత్తమ ప్రతిభ పురస్కారాన్ని అందుకున్నారు. ఎర్రుపాలెం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఉత్తమ ప్రతిభ పురస్కారం అందుకున్న సందర్భంగా పలువురు పద్మావతిని అభినందించారు.

కోటపాడుకు ఉత్తమ గ్రామపంచాయతీ అవార్డు

-అవార్డు అందుకున్న సర్పంచ్ బాతుల రమణ



నవతెలంగాణ-రఘునాథపాలెం

ఉత్తమ పంచాయతీ అవార్డును రఘునాథపాలెం మండల పరిధిలోని కోటపాడు పంచాయతీ అవార్డును దక్కించుకుంది. గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఖమ్మం కలెక్టర్ విపి. గౌతమ్ చేతుల మీదుగా గ్రామ సర్పంచ్ బాతుల రమణా సర్పంచ్‌కు అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ రమణ మాట్లాడుతూ.. కోటపాడు పంచాయతీలో ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తున్నానని, కోటపాడు గ్రామ పంచా యతీ అభివృద్ధికి కృషి చేశాను, కాబట్టే ఆ ప్రతిఫలమే ప్రభుత్వ గుర్తించిన ఈ ఉత్తమ పంచాయతీ అవార్డు రావడం చాలా సంతోషకరంగా ఉన్నదనీ ఆమె అన్నారు.



కరుణాకర్‌రెడ్డికి ఉత్తమ ఎంపీడీఓ అవార్డు

నవతెలంగాణ-వైరా

వైరా ఎంపిడిఓ దగ్గుల కరుణాకర్‌రెడ్డి 75 వ రిపబ్లిక్ దినోత్సవం సంద ర్భంగా ఉత్తమ ఎంపిడిఓ గా శుక్రవారం ఖమ్మంలో జరిగిన వేడుకల్లో జిల్లా కలెక్టర్ విపి. గౌతం చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఎంపిడిఓగా వైరా మునిసిపాలిటీ ఇంచార్జి కమీషనర్‌గా ద్వంద బాధ్యతలు నిర్వహిస్తూ మండల, వైరా పట్టణ ప్రజల ప్రశంసలు అందుకున్నారు. అంతేగాక గత సంవత్సరం నవంబర్ 30 న జరిగిన శాసన సభ ఎన్నికల కు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారిగా సమర్ధవంతంగా బాధ్యతలు నిర్వహించి జిల్లా కలెక్టర్, ఇతర అధికారుల దృష్టిని ఆకర్షించారు. నిత్యం ప్రజలతో ఉండాలనుకునే తత్వం కూడా ఆయనలోని ప్రత్యేక లక్షణం. అడ్మినిస్ట్రేషన్ ,పరిపాలనా అంశాలపై అవగాహన కలిగిన కరుణాకర్‌రెడ్డికి అవార్డు రావటం పట్ల మండల ప్రజలు రాజకీయ నాయకులు అభినందనలు తెలిపారు.

ఆరు ఇసుక ట్రాక్టర్లు సీజ్

నవతెలంగాణ-ఖమ్మం రూరల్

ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ఆరు ఇసుక ట్రాక్టర్లను పోలీసులు సీజ్ చేసిన సంఘటన మండల పరిధిలోని కోదాడ క్రాస్ రోడ్డులో శుక్రవారం చోటుచేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎటువంటి అనుమతులు లేకుండా ముదిగొండ మండలం గంధసిరి నుంచి ఆరు ఇసుక ట్రాక్టర్లు ఖమ్మం వైపు వెళ్తున్నాయి. మార్గమధ్యలో కోదాడ క్రాస్ రోడ్డులో వాహనాలు తనిఖీ చేస్తూ పట్టుబడ్డ ట్రాక్టర్‌లపై కేసు నమోదు సీజ్ చేసినట్లు ఎస్ఐ సురేశ్ తెలిపారు.

ఎన్ఎస్ఎస్ జిల్లా పీఓకి కలెక్టర్ ప్రశంస

నవతెలంగాణ ఖమ్మం

ఖమ్మం జిల్లా ఎన్.ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్, ఎస్ఆర్‌బిజిఎన్ఆర్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ పిఓగా విశిష్ట సేవలందించిన ఎన్.శ్రీనివాసరావుని గణతంత్ర దినోత్సవ సందర్భంగా శుక్రవారం కలెక్టర్ వి.పి.గౌతం ప్రశంసా పత్రం అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. జాకిరుల్లా, అధ్యాపకులు తదితరులు అభినందించారు.

విద్యార్థులకు బహుమతులు ప్రదానం



నవతెలంగాణ-ముదిగొండ

భారత గణతంత్ర దినోత్సవం (రిపబ్లిక్ డే) సందర్భంగా మండల పరిధిలో ఖానాపురం ప్రాథమిక పాఠశాల విద్యార్థిని, విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించగా పోటీలో గెలుపొందిన విజేతలకు శుక్రవారం రూ10 వేలు విలువ చేసే బహుమతులు గ్రామసర్పంచ్ మాలోజి ఉషగోవిందు వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె. రూప మాట్లాడుతూ ప్రతి ఏడాది రిపబ్లిక్ డే సందర్భంగా పాఠశాల పిల్లలకు నిర్వహించే ఆటల పోటీలకు గ్రామ సర్పంచ్ మాలోజి ఉషగోవిందు సొంతంగా ఆర్థిక తోడ్పాటును అందించడం అభినందనీయమన్నారు. ఈ ఏడాది కూడా పాఠశాల విద్యార్థులకు బహుమతులు వితరణ చేసిన గ్రామ సర్పంచ్ మాలోజి ఉషాగోవిందుకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మాలోజి ఉషగోవిందు, గ్రామ ఉపసర్పంచ్ పోకల బాబు, పంచాయతీ కార్యదర్శి ఎం. భాగ్యలక్ష్మి, పాఠశాల ఉపాధ్యాయులు రాయల భాస్కరరావు, ఎస్ఎంసి చైర్మెన్ వెంకటనారాయణ, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా గణతంత్ర దినోత్సవం



- వివిధ శాఖలలో ఉత్తమ సేవలందించిన అధికారులకు ప్రశంసా పత్రాలు
- జిల్లా కలెక్టర్ వీపీ. గౌతమ్

నవతెలంగాణ-ఖమ్మం

భారత గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్‌లో 75 వ గణతంత్ర దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తొలుత జిల్లా కలెక్టర్ వీపీ. గౌతమ్ జాతీయ జెండాను ఆవిష్కరించి, పోలీసుల నుండి గౌరవ వందనం స్వీకరించారు. జిల్లా అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు ప్రగతిపై ఆయన సందేశం ఇచ్చారు. పాఠశాలల విద్యార్థులచే చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. అనంతరం వివిధ శాఖలలో ఉత్తమ సేవలందించిన అధికారులు, ఉద్యోగులకు కలెక్టర్ ప్రశంసా పత్రాలు అందజేశారు. స్వాతంత్ర్య సమరయోధులు, వనజీవి రామయ్యలను కలెక్టర్ సన్మానించారు. అభివృద్ధి పథకాల అమలుపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, స్త్రీ-శిశు సంక్షేమ శాఖ, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, ఎస్సి, ఎస్టీ, బిసి, మైనారిటీ శాఖలచే శకటాల ప్రదర్శనను ఆహుతులు ఆసక్తిగా తిలకించారు. ఉద్యానవన, పట్టు పరిశ్రమ శాఖ, వ్యవసాయ శాఖ, వ్యవసాయ మార్కెటింగ్ శాఖ, విద్యా శాఖ, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, అటవీశాఖ, వైద్య ఆరోగ్యశాఖ, నీటిపారుదల, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ, ఎస్సి, ఎస్టీ, బిసి, మైనారిటీ సంక్షేమ గురుకులాలు, పౌరసరఫరాల శాఖ, నీటిపారుదల, పశు సంవర్ధక శాఖ, మత్స్య శాఖ, గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థలు తమ శాఖల కార్యకలాపాలను ప్రదర్శిస్తూ స్టాళ్లు ఏర్పాటుచేయగా, కలెక్టర్, అతిధులు సందర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి బిఎస్. జగ్జీవన్ కుమార్, న్యాయమూర్తులు, పోలీస్ కమీషనర్ సునీల్ దత్, జిల్లా ప్రజాపరిషత్ చైర్మెన్ లింగాల కమల్ రాజ్, నగర మేయర్ పునుకొల్లు నీరజ, అదనపు కలెక్టర్లు బి. సత్యప్రసాద్, డి. మధుసూదన్ నాయక్, మునిసిపల్ కమీషనర్ ఆదర్శ్ సురభి, శిక్షణ కలెక్టర్ మయాంక్ సింగ్, శిక్షణా ఐపీఎస్ మౌనిక, జిల్లా అటవీ అధికారి సిద్దార్థ్ విక్రమ్ సింగ్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.





రాజ్యాంగ స్ఫూర్తితోనే కాంగ్రెస్ ప్రభుత్వ పాలన

- మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి
- ఖమ్మం, కూసుమంచిలోని క్యాంపు ఆఫీసుల్లో జాతీయ జెండావిష్కరణ

నవతెలంగాణ-ఖమ్మం/కూసుమంచి

దేశ సర్వసత్తాక ప్రజాస్వామ్యానికి భారత రాజ్యాంగం దిక్సూచిగా నిలుస్తోందని మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి అన్నారు. 75వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఖమ్మం, కూసుమంచిలోని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంప్ కార్యాలయాల్లో జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం అమలులోకి వచ్చిన ఈ రోజు సుదినం అని అభివర్ణించారు. ఇదే స్ఫూర్తితో మంత్రి పొంగులేటి అన్ని వర్గాల సంక్షేమానికి విశేష కృషి చేస్తున్నారని తెలిపారు.



ఆటో అడ్డాల వద్ద...

ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో ఐటీ హబ్ ఎదురుగా ఉన్న ఆటో స్టాండ్, పాత బస్టాండ్, టీటీడీ ఎదురుగా ఉన్న ఆటో స్టాండ్ల వద్ద, తారకరామ ఆటోనగర్ లో ఫోర్ వీలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, జలగంనగర్, మేకల నారాయణ నగర్‌తో పాటు పలుచోట్ల నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో దయాకర్‌రెడ్డి పతాకావిష్కరణ చేశారు.

రైతు గోసను గాలికి వదిలేసిన అధికారులు

నవతెలంగాణ-వైరా

2023 ఖరీఫ్ సీజన్లో జిల్లాలో నకిలీ వరి విత్తనాలు విక్రయించి సొమ్ము చేసుకున్న సత్తుపల్లికి చెందిన "వరుణ్ సీడ్స్" వరి విత్తన కంపెనీ డీలర్ రైతులను నిండా ముంచాడు. వైరా మండలంలోని విప్పలమడక తదితర గ్రామాలలో సుమారు 15 మంది రైతులు వరుణ్ సీడ్ కంపెనీ నుండి కొనుగోలు చేసిన ఎంటీయూ 1262 రకం నకిలేదేనని జిల్లా వ్యవసాయాధికారులు, వరి శాస్త్రవేత్తలు నిర్ధారించి సరిఫికెట్లు కూడా ఇచ్చారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్ వీపీ.గౌతం జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల పై ఆగ్రహం వ్యక్తం చేసిన అనంతరం విత్తన డీలర్ లైసెన్స్‌ను రద్దు చేశారు. అదే సమయంలో ఖరీఫ్ సీజన్‌లో ఈ విత్తనం నాటి తీవ్రంగా నష్ట పోయిన రైతులను గాలికి వదిలేశారు. సత్తుపల్లి కేంద్రంగా నకిలీ వరి విత్తనాల వ్యాపారం చేస్తున్న వరుణ్ ప్రసాద్ లైసెన్స్ రద్దు అయిన తర్వాత కొన్ని రోజుల తర్వాత నష్టపోయిన రైతుల తో మాట్లాడారు. నష్ట పోయిన మొత్తం కాకుండా తాను విక్రయించిన విత్తన బస్తా ఒక్కో దానికి 5000 రూపాయల చొప్పున చెల్లిస్తానని విప్పలమడక గ్రామంలో వరుణ్ ప్రసాద్ నియమించుకున్న ఏజెంట్ ద్వారా రైతులను నమ్మించాడు. ఎందుకైనా రైతులు అంగీకరించటంతో, రైతులు తనపై ఎటువంటి చర్యలు తీసుకోలేకనే 5 వేల రూపాయలకు అంగీకరించారనే అహంకార దోరణితో వారం రోజులుగా ఎన్ని సార్లు ఫోన్ చేసినా ఎత్తటం లేదు. నకిలీ వరి విత్తనాలతో తీవ్రంగా నష్టపోయిన రైతులు చేసేది లేక పోలీసు అధికారులకు పిర్యాదు చేయాలని నిర్ణయించుకున్నారు. అంతే గాక జిల్లా కలెక్టర్‌ను కలిసి న్యాయం చేయాలని కోరనున్నట్లు బాధిత రైతులు తెలిపారు.

ముువ్వెన్నెల జెండా రెపరెపలు



హార్వెస్ట్ పబ్లిక్ స్కూల్‌లో ....

నవతెలంగాణ-ఖమ్మం

నగరంలోని హార్వెస్ట్ పబ్లిక్ స్కూల్ ప్రాంగణంలో 75వ రిపబ్లిక్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత హార్వెస్ట్ గ్రూప్ ఆఫ్ విద్యాసంస్థల ప్రిన్సిపల్ పార్వతీరెడ్డి జెండాను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ నాగేశ్వరరావు, హార్వెస్ట్ జూనియర్ కళాశాల అకడమిక్ హెడ్ మీనన్ రెడ్డి, సెంటర్ హెడ్ నర్సింహరావు, సీనియర్ ఉపాధ్యాయులు విఎస్ఎన్. మూర్తి, ప్రైమరీ హెచ్‌ఎమ్ అరుణ దీప్తి, అకడమిక్ ఇంచార్జ్‌లు శ్యామల, సెవ్ ఇంచార్జ్ ఉమామహేశ్వరరావు, నాగరాజు, స్టేట్ బోర్డ్ ఇంచార్జెస్ జాకీర్ తదితరులు పాల్గొన్నారు.



రెజొనెన్స్ స్కూల్‌లో...

నగరంలోని శ్రీనగర్ కాలనీలో రెజొనెన్స్ స్కూల్‌లో గణతంత్ర దిన్సోతవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత పాఠశాల డ్కెరెక్టర్ కొండా శ్రీధర్ రావు జాతీయ జెండాను ఎగురవేసి గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డ్కెరెక్టర్ కొండా కృష్ణవేణి, ప్రధానోపాధ్యాయులు ఎం.ప్రసన్నరావు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతరులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో...

నగరంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ లో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత పాఠశాల లో పాఠశాల డైరెక్టర్ రవీందర్ రెడ్డి జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వినూత్నం గా.. విద్యార్థుల మెదడుకి మరింత మెరుగులు పెట్టె విధంగా ఏర్పాటు చేసిన నాలెడ్జ్ ఎక్స్‌పో, మనం ఎంత ఎదిగిన ఒదిగి ఉండాలి అనే నానుడి ని నిరూపిస్తూ చారిటీ షో.. కోసం ఏర్పాటు చేసిన ఫుడ్ స్టాల్స్ మరింత ఆకర్షనీయంగా నిలిచాయని తెలిపారు. గత మూడు రోజులుగా అత్యంత ఉత్సాహం గా జరుగుతున్న స్పోర్ట్స్ మీట్ లో పాల్గొన్న ప్రతీ ఒక్కరిని పాఠశాల డైరెక్టర్ రవీందర్ రెడ్డి, ప్రిన్సిపాల్ కొత్తూరి స్వప్న , పేరు పేరు నా అభినందించారు.ప్రత్యేక అతిధిగా నారాయణపురం సర్పంచ్ కనక దుర్గ చేతులు మీదుగా ఛాంపియన్ షిప్ ట్రోఫీని విజేతలకి అందించారు.



బొమ్మ కళాశాలలో...

నగరంలోని బొమ్మ ఇంజనీరింగ్ కళాశాలలో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత జాతీయ జెండాను కళాశాల చైర్మన్ బొమ్మ రాజేశ్వరరావు ఎగరవేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రెటరీ ఊదరు శ్రీధర్, వైస్ చైర్మన్ బొమ్మ సత్య ప్రసాద్, డైరెక్టర్ మాధవి, కళాశాల ప్రిన్సిపల్స్ విజయరావు, విజయభాస్కర్ ,రంజిత్ తదితరులు పాల్గొన్నారు.



నూతన కలెక్టరేట్ ఆవరణలో

75వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం నూతన కలెక్టరేట్ ఆవరణలో గణతంత్ర వేడుకలలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. సత్యప్రసాద్ ముువ్వన్నెల జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల నుండి గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్, శిక్షణా సహాయ కలెక్టర్ మయాంక్ సింగ్, కలెక్టరేట్ ఏవో అరుణ, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పోలీస్ కమిషనర్ కార్యాలయంలో...

నగరంలోని 75వ భారత గణతంత్ర దినోత్సవం పురస్కారించుకొని పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఖమ్మం పోలీస్ కమీషనర్ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు పోలీస్, హోంగార్డ్స్, మినిస్ట్రీయల్ స్టాఫ్ సిబ్బందికి గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడారు.

శ్రీకృష్ణప్రసాద్ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో...

శ్రీకృష్ణప్రసాద్ మెమోరియల్ స్కూల్ లో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్కూల్ చైర్ పర్సన్ (పోలీస్ కమిషనర్ సతీమణి) నిషిత శర్మ జెండా ఆవిష్కరించారు. ఆనంతరం విద్యార్థులకు స్వీట్లు పంచారు.

సీపీఆర్ హెడ్ క్వార్టర్స్, సీటీసీ ఆధ్వర్యంలో...

సిటీ ఆర్మడ్ రిజర్వు హెడ్ క్వార్టర్స్, (సిటీసీ) పోలీస్ శిక్షణ కేంద్రంలో ఏఆర్ అడిషనల్ డీసీపీ కుమారస్వామి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆడిషనల్ డీసీపీ లాంఆర్డర్ ప్రసాద్‌రావు, ఏఆర్ ఆడిషనల్ డీసీపీ కుమారస్వామి, ట్రైనీ ఐపిఎస్ పి.మౌనిక, టౌన్ ఏసీపీ హరికృష్ణ, సీసీఆర్బీ ఏసీపీ గణేష్, ట్రాఫిక్ ఏసీపీ సారంగపాణి, వైరా ఏసీపీ రహెమాన్, ఏసీపీలు నర్సయ్య, సుశీల్ సింగ్, కృపాకర్, రవి పాల్గొన్నారు.

టీడీపీ ఆధ్వర్యంలో...

నగరంలోని తెలుగుదేశంపార్టీ ఖమ్మం జిల్లా కార్యాలయంలో గణతంత్ర దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. తొలుత తెలుగుదేశంపార్టీ పార్లమెంట్ అధ్యక్షులు డాక్టర్" వాసిరెడ్డి రామనాధం మహత్మ గాంధీ, డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ముువ్వన్నెల జెండాను ఎగురవేశారు. అనంతరం కార్యాలయంలోని స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ ఉపాధ్యక్షులు కొండబాల కరుణాకర్, మల్లెంపాటి అప్పారావు, నాగార్జున శ్రీనివాస్, చుండూరు రాజరాజేశ్వరి, మందపల్లి కోటేశ్వరరావు, ఉప్పర్ల వెంకటేశ్వర్లు, పారుపల్లి సురేష్, మీగడ రామారావు, గడిపూడి వెంకటేశ్వర్లు, దామా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

16 వ డివిజన్‌లో

నగరంలోని 16 వ డివిజన్ దంసలాపురం కొత్త కాలనీలో గణతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించారు. తొలుత మాజీ సర్పంచ్ , కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మందడపు బ్రహ్మారెడ్డి జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మందడపు బ్రహ్మారెడ్డి, వెంకట్రామిరెడ్డి, సత్యాల వెంకటేశ్వర్లు, బొమ్మిశెట్టి రమేష్, కణతాల నరసింహారావు, నర్ల శ్రీనివాసరావు, కొండా లక్ష్మీ నారాయణ గౌడ్, నందగిరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

టీఎన్జీవో ఆధ్వర్యంలో...

టీఎన్జీవో జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు షేక్.అఫ్జల్ హసన్, ఆర్‌వీఎస్.సాగర్ ఆధ్వర్యంలో 75 వ గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. నగరంలోని వీడియోస్ కాలనిలో టీఎన్జీవో ఫంక్షన్ హాల్ ప్రాంగణంలో టీఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షులు జాతీయ జెండాను ఎగురవేసి గౌరవ వందనం చేశారు. తొలుత మహాత్ముల చిత్రపటాల కు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు నందగిరి శ్రీను, రాష్ట్ర కార్యదర్శి జిఎస్.ప్రసాద్, మహిళ విభాగం జిల్లా అధ్యక్షురాలు శాబాసు జ్యోతి, స్వప్న ,తాలూకా యూనిట్‌ల అధ్యక్ష, కార్యదర్శులు నాగుల్ మీరా, సాయి శిరణ్మయి, కళ్లెం వెంకట్‌రెడ్డి, శివ స్వప్న, సువర్ణన్ పాల్, కట్టా నవీన్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



పీజీ కళాశాలలో....

నగరంలోని కాకతీయ యూనివర్సిటీ పీజీ కళాశాలలో 75వ గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల ఆవరణలో జాతీయ జెండాను ప్రిన్సిపాల్ డాక్టర్ చేకూరి రవికుమార్, హైదరాబాద్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ అధ్యాపకుడు ప్రొఫెసర్ ఎస్. రాధాకృష్ణతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అనంతరం రిపబ్లిక్ డే సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో...

75వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ విపి. గౌతమ్ పతాకావిష్కరణ చేశారు. తొలుత కలెక్టర్ జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ క్యాంపు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఖమ్మం నగరంలోని 51వ డివిజన్‌లో గణతంత్ర దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జాతీయ జెండాను స్థానిక కార్పొరేటర్ ఎగురవేశారు.



న్యూవిజన్‌లో 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్

గణతంత్ర దినోత్సవ వేడుకలలో భాగంగా స్థానిక న్యూవిజన్ పాఠశాలలో త్రివర్ణ పతాకాన్ని పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీ జే.వి. మైఖేల్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్స్ యం.డి. అబాద్ అలీ, కె, మాధవి, ఎన్. శ్రీలేఖ ముందుగా జాతిపిత మహాత్మ గాంధీ, రాజ్యాంగ నిర్మాత డా॥ బి.ఆర్. అంబేడ్కర్ చిత్ర పటాలకు నివాళులర్పించారు. పాఠశాల ఎన్.సి.సి. కేడర్ గౌరవ వందనాన్ని సమర్పించారు.భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను ఉపయోగించుకుంటూ, బాధ్యతలను కూడా గుర్తెరిగి ప్రతివారు నడుచుకోవాలని , అప్పుడే దేశం ప్రగతి పథంలో పయనిస్తుందని పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీ అబాద్ అలీ తెలిపారు. తదనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ఛైర్మన్ శ్రీ సిహెచ్.జి.కె. ప్రసాద్, అకాడమిక్ డైరెక్టర్ సి.హెచ్. కార్తీక్ ప్రిన్సిపాల్ అబాద్ అలీ, సిహెచ్. మాధవి, పాఠశాల ఎ.ఒ., డి.వెంకటరెడ్డి మరియు అధ్యాపక బృందం పాల్గొన్నారు.



రాజ్యాంగ హక్కులను పరిరక్షించాలి

- శ్రీచైతన్య విద్యాసంస్థల ఛైర్మన్ మల్లెంపాటి శ్రీధర్
- శ్రీచైతన్య ఇంటర్నేషనల్ ఒలంపియాడ్ పాఠశాలలో ఘనంగా గణతంత్ర వేడుకలు

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్

భారత రాజ్యాంగ హక్కులను పరిరక్షించుకునేందుకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని తెలంగాణ శ్రీచైతన్య విద్యాసంస్థల ఛైర్మన్ మల్లెంపాటి శ్రీధర్ అన్నారు. స్థానిక శ్రీచైతన్య ఇంటర్నేషనల్ ఒలంపియాడ్ పాఠశాలలో శుక్రవారం 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ముందుగా త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రపంచలోకెల్లా అతిపెద్దదైన భారత రాజ్యాంగాన్ని రూపొందించిన ఘనత డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్‌కు దక్కుతుందన్నారు. ప్రతి విద్యార్థికి దేశభక్తి స్ఫూర్తి కలిగి ఉండాలని ఆయన తెలిపారు. చిన్నారుల జాతీయ నాయకుల వేషధారణ మరియు సంస్కృతిక కార్యక్రమాలు అందరిని అకర్షించాయి. పాఠశాలలో నిర్వహించిన క్రీడా పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డిజియం. చేతన్ మాథూర్, కోఆర్డినేటర్ కృష్ణారావు, ప్రిన్సిపాల్స్ టిఎల్ఎన్.శర్మ, రాజ్ కుమార్ జోషి,ఏడుకొండలు, వైస్ ప్రిన్సిపాల్స్ రామకృష్ణారెడ్డి, సురేష్, ఐ.పి.ఎల్ ఇన్‌చార్జ్ రాజశేఖరరెడ్డి, డీన్స్ కె.వి.ఆర్,లక్ష్మీనారసింహ, నవీన్, రామారావు, ఉపాధ్యాయులు మరియు తల్లిదండ్రులు పాల్గొన్నారు.



నిర్మల్ హృదయ్ పాఠశాలలో గణతంత్ర వేడుకలు

నవతెలంగాణ-ఖమ్మం

నగరంలోని నిర్మల్ హృదయ్ ఉన్నత పాఠశాలలో 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత పాఠశాల కరస్పాండెంట్ వంగ సాంబశివారెడ్డి జాతీయ జెండాను ఎగురవేశారు. గత సంవత్సరం పాఠశాలలో జరిగిన పరీక్షల్లో వచ్చిన మార్కుల ఆధారంగా విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ సుధాకర్ రెడ్డి, ప్రధానోపాధ్యాయిని ఏ.పద్మజ, తదితరులు పాల్గొన్నారు.



సర్వజ్ఞలో ఘనంగా రిపబిక్ డే వేడుక

నవతెలంగాణ-ఖమ్మం

నగరంలోని వీడియోస్ కాలనీలో సర్వజ్ఞ పాఠశాలలో 75వ గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎన్.సి.సి విద్యార్థుల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం పాఠశాల నిర్దేశకులు కె. నీలిమా జెండాను ఎగురవేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడారు. ఎందరో అమరవీరుల ప్రాణత్యాగాలతో పరాయి పాలననుంచి దేశానికి విముక్తి, పౌరులకు స్వేచ్ఛ, స్వాతంత్ర్యలు సిద్ధించయాన్నారు. పాఠశాల ఛైర్మన్ ఆర్.వి. నాగేంద్రకుమార్ మాట్లాడారు. ఈ కార్యక్రమాలలో పాఠశాల ప్రిన్సిపల్స్, ఉపాధ్యాయనీ, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



వీవీసీ గ్రూప్ ఆధ్వర్యంలో గణతంత్ర వేడుకలు

నవతెలంగాణ-ఖమ్మం

నగరంలోని వీవీసీ కాంప్లెక్స్, మమతారోడ్ వివిసి గ్రూప్ ఆధ్వర్యంలో శుక్రవారం గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత వివిసి గ్రూప్ ఆధినేత వంకాయలపాటి రాజేంద్రప్రసాద్ జాతీయ జెండాను ఎగురవేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం అమలులోకి వచ్చిన ఈ రోజుని అందరూ ఘనంగా జరుపుకోవాలని, మనకు ఈ రాజ్యాంగాన్ని అందించిన రాజ్యాంగ ప్రదాత డాక్టర్ బి.ఆర్అంబేత్కర్ కి ఎంతో రుణపడి ఉంటామని అన్నారు. వివిసి ట్రస్ట్ ద్వారా 25 లక్షలతో ఖమ్మం మెడికల్ కాలేజీనకు ఉచిత అంబులెన్సును ఇంతకుముందు కలెక్టర్ ద్వారా ఇచ్చామని అన్నారు. అప్పుడు ఖమ్మం మెడికల్ కాలేజీ వారి అభ్యర్దన మేరకు ఆ అంబులెన్సులో వెంటిలేటర్‌ను కూడా ఈ రోజు అందచేస్తున్నామన్నారు.

వ్యవసాయ సంక్షోభంతో అందరికీ నష్టం

- పోరాడి కేంద్ర ప్రభుత్వం మెడలు వంచాలి
- ఖమ్మంలో రైతు, కార్మిక సంఘాలు ట్రాక్టర్లు, వాహనాల ప్రదర్శన

నవతెలంగాణ-ఖమ్మం



వ్యవసాయ సంక్షోభంతో అందరికీ నష్టం వాటిల్లుతుందని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరరావు, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షులు భాగం హేమంతరావు, రైతు కూలీ సంఘం అధ్యక్షుడు కోటేశ్వరరావు, బందెల వెంకయ్య అన్నారు. సంయుక్త కిసాన్ మోర్చా, అఖిల భారత కార్మిక సంఘాలు సమన్వయ కమిటీ సంయుక్త పిలుపు మేరకు శుక్రవారం ఖమ్మంలో ట్రాక్టర్లు వాహనాలు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా మాదినేని రమేష్, దొడ్డపాటి రమేష్, మలీద్ నాగేశ్వరరావు, వెంకట్రామిరెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో రాంబాబు, వెంకటేశ్వరరావు, హేమంతరావు, కోటేశ్వరరావు, వెంకయ్య మాట్లాడుతూ వ్యవసాయ రంగ సంక్షోభం కు కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల వైఖరి కారణ అన్నారు. వ్యవసాయం మీద ఆధారపడే రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కూలీలు సంక్షోభంలో ఉన్నారని, వ్యవసాయాన్ని ఆధారం చేసుకుని వ్యాపారం చేస్తున్న వాళ్ల లాభాల్లో ఉన్నారని తెలిపారు. ఏటా పదివేల మందికి పైగా రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారని, అవి పాలకులు చేస్తున్న హత్యలని తెలిపారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అమలు చేస్తామని ఎన్నికల ముందు మోడీ చెప్పి అధికారంలోకి వచ్చాక పట్టించుకోలేదన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర అమలైనా లాభం రాదని, మద్దతు ధరకు చట్టం తేవాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయన్నారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సుల ప్రకారం కనీసం మద్దతు ధర నిర్ణయించాలన్నారు. ప్రభుత్వ బ్యాంకుల నుంచి స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ద్వారా రుణాలు ఇవ్వాలన్నారు. రైతు ఆత్మహత్యలు ఆపడానికి కేరళలో రుణ విమోచన చట్టం తెచ్చారని, అలాంటి చట్టం దేశమంతా కావాలని కోరితే మోడీ ఒప్పుకోలేదన్నారు. విద్యుత్ సవరణ బిల్లు భారత ప్రజలందరికీ నష్టమని, బడా పెట్టుబడిదారులకు, కాంట్రాక్టర్లకు లాభం అని తెలిపారు. వ్యవసాయాన్ని సంక్షోభం నుంచి గట్టెక్కించడానికి అందరూ చేతులు కలపాలన్నారు. కార్మికులు రైతులు ఒకే తాటిపైకి వచ్చి పోరాడి ప్రభుత్వాల మెడలు వంచాలన్నారు. రైతు సమస్యలు పరిష్కారం కోసం రైతు కార్మికులు ఐక్య ఉద్యమాలు జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు తుమ్మా విష్ణు, కార్యదర్శి కళ్యాణం వెంకటేశ్వరరావు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి తోట రామాంజనేయులు, సింగ్ నరిసింహారావు, ఐఫ్ టియు జిల్లా కార్యదర్శి రామయ్య , మురళి, గిరి, కిసాన్ కాంగ్రెస్ నాయకులు దాసరి దానియేలు రైతు సంఘాల నాయకులు వాసిరెడ్డి ప్రసాద్, సుదర్శన్ రెడ్డి, మీరా, చలపతిరావు, నాగేశ్వరరావు మేరగు సత్యనారయణ,ప్రకాష్,అవుల వెంకటేశ్వర్లు, గంగాధర్, కుటుంబరావు రమ్య, జానికి తదితరులు పాల్గొన్నారు.



శాస్త్ర సాంకేతిక రంగాల పురోగతి సృజనోత్సవ్

- అబ్బురపరిచిన ప్రియదర్శిని సృజనోత్సవ్
- పాల్గొన్న జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షులు
- మల్లెంపాటి వీరభద్రరావు, కాటేపల్లి నవీన్ బాబు, కన్వీనర్ అట్లూరి.వెంకటరమణ

నవతెలంగాణ-ఖమ్మం రూరల్



మండలంలోని పెద్దతండా పంచాయతీ పరిధిలోని సాయి ప్రభాత్ నగర్ వద్ద గల ప్రియదర్శిని విద్యాసంస్థల ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరుగుతున్న సృజనోత్సవ్ టెక్నో-కల్చరల్ ఫెస్ట్ మొదటి రోజు నాలుగు జిల్లాల వ్యాప్తంగా 800 మంది విద్యార్థినులు పాల్గొని 6 అంశాల్లో తమ ప్రతిభను చాటారు. ఈ సందర్భంగా సృజనోత్సవ్ ప్రారంభ సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన జన విజ్ఞాన వేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షులు మల్లెంపాటి వీరభద్రరావు మాట్లాడుతూ సైన్స్ టెక్నాలజీ నేటి ప్రపంచ గమనాన్ని మార్చే దిశగా మన ముందుకు వచ్చిందని తద్వారా అన్ని రంగాల్లో ఉత్పాదక శక్తిని పెంచి విశ్వ మానవాళి అవసరాలు తీర్చాలని ఆ దిశగా పరిశోధనలు సాగాల్సిన అవసరాన్ని గుర్తు చేశారు. విద్యాసంస్థల అధినేత డాక్టర్ కాటేపల్లి నవీన్ బాబు మాట్లాడుతూ రెండు దశాబ్దాలుగా విద్యార్థుల సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా విద్యాసంస్థలను నిర్వహిస్తున్నామని తదనుగుణంగానే యువ, స్పార్క్, తానా సాహిత్య ఉత్సవాలను నిర్వహించామని అదే ఒరవడిలో ఇప్పుడు సృజనోత్సవ్ విద్యార్థినుల ముందుకు తెచ్చామని అన్నారు. ఇంత స్థాయిలో విద్యార్థినులు పాల్గొనటం గర్వకారణమని అన్నారు. సృజనోత్సవ్ కన్వీనర్ అట్లూరి వెంకటరమణ మాట్లాడుతూ... దశాబ్దాల పాటు యువశక్తికి ప్రేరణ కోసం ప్రియదర్శిని విద్యాసంస్థలు పాటుపడటాన్ని ఆశీర్వదిస్తున్న ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. వివిధ అంశాలలో నాలుగు జిల్లాల వ్యాప్తంగా 800 మంది విద్యార్థినులు తరలి రావటం విద్యార్థినులలో ఉన్న ఆసక్తిని తెలియజేస్తోందని అన్నారు. టెక్నో కల్చరల్ ఫెస్ట్ విధి విధానాలను సృజనోత్సవ్ కో-ఆర్డినేటర్ యం.శివకుమార్ వివరించారు. మొదటి రోజు సుమారు 2000 మంది వివిధ కళాశాలల,పాఠశాలల విద్యార్థులు ప్రియదర్శిని విద్యాసంస్థల విద్యార్థినులు తయారు చేసిన వివిధ ఆవిష్కరణలు తిలకించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ గోపాల్, డిగ్రీ కళాశాలల ప్రిన్సిపల్స్ వి.రామారావు, యం.వెంకటేశ్వరరావు అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ జెండా ఆవిష్కరణ



నవతెలంగాణ - బోనకల్

మండలంలో గణతంత్ర దినోత్సవ వేడుకలను శుక్రవారం అధికారులు, ప్రజా ప్రతినిధులు ఘనంగా నిర్వహించారు. తహసిల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ అనిశెట్టి పున్నం చందర్, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో బయారపు అశోక్ పోలీస్ స్టేషన్లో ఎస్సై బుల్లెద్దు సాయికుమార్ మండల వ్యవసాయ కార్యాలయంలో మండల వ్యవసాయ శాఖ అధికారిని సర్వశుద్ధి సరిత బోనకల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ లింగమనేని నళిని శ్రీ, ఐకెపి కార్యాలయం వద్ద ఏపీఎం యద్దనపూడి పద్మలత, జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ప్రత్యేక అధికారిని బుడిపాటి కమలవాహిని బాలికల, బాలుర గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్స్ తాడి అంజలి, భూక్య పార్వతి జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండల వైద్యాధికారిని వేముల స్రవంతి మండల పశు వైద్యశాలలో వైద్యాధికారి ఎర్రగుంట్ల అన్వేష్ మండల విద్యుత్ శాఖ కార్యాలయంలో ఏఈ దొండేటి ఉమామహేశ్వరరావు నీటిపారుదుల, ఆయకట్ట అభివృద్ధి శాఖ కార్యాలయంలో డీఈ తమ్మారపు వెంకటేశ్వర్లు జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. బోనకల్ గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ బుక్కా సైదా నాయక్ ఖమ్మం ఆటో స్టాండ్ వద్ద, బోనకల్ - జగ్గయ్యపేట ఆటో స్టాండ్ వద్ద, సుభాష్ చంద్రబోస్ విగ్రహం వద్ద ఎస్సై బొల్లెద్దు సాయికుమార్ జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు, అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద ఆయా గ్రామాల సర్పంచులు జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. మండల పరిషత్, తహసిల్దార్ కార్యాలయాల వద్ద జరిగిన కార్యక్రమాలలో జడ్పిటిసి మోదుగు సుధీర్ బాబు నాయబ్ తహసిల్దార్ తిరుమల కరుణాకర్ రెడ్డి ఎంపీఓ వ్యాకరణం వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రి మండల పరిషత్ కార్యాలయ సూపరింటెంట్ తన్నీరు నరేంద్ర గిర్దావర్- 1 గూగుల్ లక్ష్మణ్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాలి దుర్గారావు, టిడిపి మండల అధ్యక్షుడు రావుట్ల సత్యనారాయణ, ఆయా కార్యాలయాల సిబ్బంది, పలువురు పంచాయతీ కార్యదర్శులు, రేషన్ షాపు డీలర్లు, పోలీస్ స్టేషన్ వద్ద ఏఎస్ఐ దారెల్లి బాలస్వామి, హెడ్ కానిస్టేబుళ్లు అద్దంకి ఆనంద్ కుమార్, సువర్ణ బాబు కానిస్టేబుళ్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయికి త్రివేణి ప్రాజెక్టులు

- విద్యార్థులను అభినందిన డీఈవో

నవతెలంగాణ-ఖమ్మం



గత వారం జరిగిన జిల్లా స్థాయి బాలల వైజ్ఞానిక ప్రదర్శనలో ఖమ్మం నగరంలోని త్రివేణి పాఠశాలకు చెందిన విద్యార్థులు తయారుచేసిన రెండు ప్రాజెక్టులు ప్రథమ బహుమతిని గెలుచుకున్నాయని పాఠశాల డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి తెలిపారు. అలాగే ఒక ప్రాజెక్టు ద్వితీయ బహుమతిని గెలుచుకున్నదని, ప్రథమ బహుమతి గెలుపొందిన ప్రాజెక్టులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాయని, ప్రథమ బహుమతి పొందిన ప్రాజెక్టుల వివరాలు 9వ తరగతికి చెందిన వీక్షిత్, ధీరధులు వ్యవసాయాన్ని ఉపాయంశంగా ఎన్నుకొని జవాన్ రక్ష కిసాన్ మిత్ర అనే పేరుతో చేసిన ప్రాజెక్టు, 9వ తరగతి చెందిన డార్విన్ బాలాజీ, కార్తికేయలు రవాణా, సమాచార వినిమయం అనే అంశంలో లైఫ్ సేవర్ హెల్మెట్ అనే ప్రాజెక్టును చేశారని తెలిపారు. ఈ రెండు ప్రాజెక్టులు జిల్లా స్థాయిలో మొదటి బహుమతి గెలుపొంది రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాయని అన్నారు. ఆరోగ్యం ఉపాంశంగా ఎన్నుకొని మల్టిపుల్ డివైస్ ఫర్ పెరాలసిస్ పీపుల్ అనే ప్రాజెక్టుని తయారు చేసిన అమన్, అఖిల్ రెడ్డి అనే 9వ తరగతి విద్యార్థులు ద్వితీయ బహుమతిని పొందారని తెలిపారు. పై ప్రాజెక్టులన్నింటికీ రోశయ్య గైడ్ టీచరుగా వ్యవహరించారు. బహుమతులు సాధించిన విద్యార్థులను జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర శర్మ, జిల్లా సైన్స్ అధికారి జగదీష్, జిల్లా సైన్స్ కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లు, ఎంఈవో శ్రీనివాస్, త్రివేణి కృష్ణవేణి విద్యాసంస్థల డైరెక్టర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు, పాఠశాల సిఆర్ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ, పాఠశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, పాఠశాల వైస్ ప్రిన్సిపల్ స్వప్న, ముస్తఫా, అశోక్, క్యాంపస్ ఇంచార్జ్ చార్లెస్ సందీప్, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు అభినందించారు.

బీఆర్ఎస్ నేత నున్నా రమణ అరెస్ట్



తిరుమలాయపాలెం : మండల పరిధిలోని పిండిప్రోలు శివారులో ఓ వెంచర్లో 10 జూన్ 2021లో అక్రమంగా జిలిటిన్ స్టిక్స్ మందు గుండు సామగ్రితో బాంబ్ బ్లాస్టింగ్ చేయడంతో అతనిపై తిరుమలాయపాలెం పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు అయింది. గతంలో ఉన్న అధికార పార్టీ అండదండలతో తప్పించుకుని తిరగడంతో శుక్రవారం నున్నా రమణ స్వగ్రామం మహబూబాద్ జిల్లా డోర్నకల్ మండలం ఉయ్యాలవాడ గ్రామంలో పోలీసులు చాకచక్యంగా అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు తిరుమలాయపాలెం ఎస్సై వరాల శ్రీనివాస్ తెలిపారు.



బ్లూమింగ్ మైండ్స్ సెంట్రల్ స్కూల్ లో గణతంత్ర దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-ఖమ్మం

నగరంలోని బ్లూమింగ్ మైన్స్ సెంట్రల్ స్కూల్ అండ్ జూనియర్ కళాశాలలో శుక్రవారం 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత పాఠశాల కరస్పాండెంట్ అశోక్ రెడ్డి జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఏ. కిరణ్ కురూర్, వైస్ ప్రిన్సిపాల్ జి. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



టీపిఆర్పీఏ కార్యాలయం ఎదుట గణతంత్ర దినోత్సవం వేడుకలు

నవతెలంగాణ-ఖమ్మం

నగరంలోని టిపిఆర్పీఏ కార్యాలయం ఎదుట శుక్రవారం 75వ గణతంత్ర దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత జిల్లా గౌరవాధ్యక్షులు వి.మల్లికార్జునరావు జాతీయ జెండా ఎగుర వేశారు. అనంతరం గోపీచంద్ అధ్యక్షతన జరిగిన సభలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ రాష్ట్ర అధ్యక్షులు రాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి కల్యాణం నాగేశ్వరరావు, టి.యస్.రావు, మాధవరావు, గణపతి, పి.ఝాన్సీ, జిల్లా రైతు సంఘం అధ్యక్షులు బొంతు రాంబాబు, వీరబాబు, మోహన్, వీరాస్వామి, మధు, వెంకటేశ్వరావు, రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



త్రివేణి పాఠశాలలో గణతంత్ర దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-ఖమ్మం

నగరంలోని త్రివేణి పాఠశాలలో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత డాక్టర్ జి.సురేష్, రిటైర్డ్ ఐఏఎఫ్ వేంరెడ్డి వెంకటరెడ్డి, జ్యోతి ప్రజ్వలన చేసి జెండా ఆవిష్కరించారు. పాఠశాల విద్యార్థిని విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందర్నీ అలరించాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పాఠశాల ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. 75 సంవత్సరాల గణతంత్ర భారతదేశం ఎన్నో మైలురాళ్లను చేరుకొని అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని అలాగే భారతదేశం ప్రపంచంలోనే అగరగామి ఆర్థిక సామాజిక రక్షణ వ్యవస్థలుగా రూపొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కృష్ణవేణి, త్రివేణి విద్యాసంస్థల డైరెక్టర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు, పాఠశాల సిఆర్ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ, పాఠశాల వైస్ ప్రిన్సిపల్ స్వప్న, ముస్తఫా, అశోక్, క్యాంపస్ ఇంచార్జ్ చార్లెస్, సందీప్, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉత్తమ రైల్వే ఉద్యోగిగా బోనకల్ వాసి ధర్మేందర్

నవ తెలంగాణ - బోనకల్



బోనకల్ గ్రామానికి చెందిన రైల్వే ఉద్యోగి సావర్తి ధర్మేందర్ ఉత్తమ ఉద్యోగిగా ఎంపికయ్యాడు. 75వ గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా సికింద్రాబాద్ లోని లాలాగూడా లోకో గ్రౌండ్ లో శుక్రవారం నిర్వహించిన ఉత్సవాలలో సావర్తి ధర్మేందర్ కు ఉత్తమ ఉద్యోగి అవార్డును సికింద్రాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ బర్తేష్ కుమార్ జైన్ చేతుల మీదుగా ఉత్తమ అవార్డుతోపాటు ప్రశంసా పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు రైల్వే ఉన్నతాధికారులు అభినందించారు. విధి నిర్వహణలో ధర్మేందర్ ప్రదర్శించిన నైపుణ్యాలను పలువురు కొనియాడారు.



స్మార్ట్ కిడ్జ్‌లో గణతంత్ర సంబురం

నవతెలంగాణ-ఖమ్మం

నగరంలోని స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో శుక్రవారం 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత పాఠశాల డైరెక్టర్ చింత నిప్పు సుకన్య జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణచైతన్య మాట్లాడుతూ మన దేశం సంపూర్ణ స్వరాజ్యంగా 1950 జనవరి 26న గణతంత్ర దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. ప్రతి విద్యార్థి దేశభక్తిని పెంపొందించుకోవాలని స్వాతంత్ర్య సమరయోధుల జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. వివిధ పోటీల్లో గెలుపొందిన చిన్నారులకు బహుమతులు అందించారు. రాష్ట్రస్థాయి డ్రాయింగ్ పోటీల విజేతలకు ప్రశంసా పత్రాలు అందజేశారు. పాఠశాల చిన్నారులు స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలో అలరించారు.

గణతంత్ర రాజ్యాన్ని కాపాడుకుందాం

- లౌకిక వ్యవస్థను కాలరాస్తున్న మోడీ సర్కారుపై ఉద్యమించాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని

నవతెలంగాణ-కొత్తగూడెం



స్వపరిపాలన లక్ష్యంతో సాధించుకున్న స్వాతంత్ర్యాన్ని అర్థవంతం చేసుకొని భిన్నత్వంలో ఏకత్వం అనే లక్ష్యాన్ని సాధించుకునేందుకు ప్రత్యేక రాజ్యాంగాన్ని రూపొందించుకున్నామని, ఈ రాజ్యాంగాన్ని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ తమవంతు కృషి చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పిలుపు నిచ్చారు. 75వ ఘనతంత దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆటో, భవన నిర్మాణ, హమాలీ అడ్డాలు, కార్మిక వాడలు, బస్తీలు, గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభల్లో కూనంనేని మాట్లాడుతూ మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాజ్యాంగ విలువలను రోజురోజుకు దిగజారుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాల్లో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె.సాబీర్ పాషా, జిల్లా కార్యవర్గ సభ్యులు బందెల నర్సయ్య, దుర్గరాశి వెంకటేశ్వర్లు, సలిగంటి శ్రీనివాస్, జిల్లా సమితి సభ్యులు వాసిరెడ్డి మురళి, కంచర్ల జమలయ్య, గెద్దాడ నగేష్, ఎస్కె. ఫహీమ్, కె.రత్నకుమారి, భూక్య శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్‌కు త్రివేణి విద్యార్థిని ఎంపిక

నవతెలంగాణ-కొత్తగూడెం టౌన్



లక్ష్మీదేవి పల్లిలో గల త్రివేణి పాఠశాల విద్యార్థినీ బి.దిప్షక అంత ర్జాలం ద్వారా వారు నిర్వహించిన స్టేట్ లెవెల్ బాల వైజ్ఞానిక ప్రదర్శన ఆర్ఎస్‌బివిపి 2023-24 సంవత్సరం లిక్విడ్ ట్రీస్, బయో ఎంజైమ్స్ వర్కింగ్ మోడల్ ద్వారా తన ప్రతిభ కనబరిచింది. ఈ నెల 28న తారీఖున విజయవాడలో జరగబోవు సౌత్ ఇండియా స్థాయి పోటీలలో పాల్గొననుంది. త్రివేణి పాఠశాలలో నిరంతరం సైన్స్ పట్ల అవగాహన ఆసక్తి కలిగించే కార్యక్రమాలే ఈ గెలుపునకు మూలం అని ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ, గైడ్ టీచర్ జ్యోతిలను త్రివేణి పాఠశాలల డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేందర్ చౌదరి అభినందించారు. ఈ కార్యక్రమంలో త్రివేణి పాఠశాలల డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి జగదీష్, సిఆర్‌ఓ కాట్రగడ్డ మురళి కృష్ణ, ప్రిన్సిపాల్ వైవి సురేష్, శ్రీనివాస్ సింగ్, సౌజన్యలు పాల్గొని అభినందనలు తెలియజేశారు.

ఉత్తమ ఉద్యోగులుగా మణుగూరు ప్రభుత్వ అధికారులు

- కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంస పత్రాన్ని అందుకున్న ఫారెస్ట్ రేంజర్ ద్వాలియా

నవతెలంగాణ-మణుగూరు



75వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ అధికారులుగా మణుగూరు నుండి పలువురు అధికారులు అందుకున్నారు. మణుగూరు ఫారెస్ట్ రేంజర్ ద్వలియా ప్రశంస పత్రం అందుకున్నారు. అటవీశాఖ జోనల్ లెవెల్ క్యాష్ అవార్డు డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ అరుణ ప్రశంస అందుకున్నారు. మణుగూరు అటవీశాఖ రేంజ్ నుండి అటవీశాఖ జిల్లా లెవెల్ అవార్డులు కూడా మణుగూరు అధికారులు అందుకున్నారు. తహసీల్దార్ కార్యాలయం నుండి రామ్ నాయక్, మణుగూరు మున్సిపాలిటీ సిబ్బంది నరేంద్ర (జవాన్), విజయ్ (పర్యావరణం), శ్రీను (సిస్టం అసిస్టెంట్), పోలీస్ శాఖలో డిఎస్పి రైటర్ సామల వెంకటేశ్వర్లు, ఎస్పీ రోహిత్ రాజ్, కలెక్టర్ చేతుల మీదుగా వీరు ప్రశంస పత్రం అందుకున్నారు. వీరందరికీ మణుగూరు పుర ప్రముఖులు, ప్రజలు ప్రశంసలు కురిపిస్తున్నారు.

ప్రశంసా పత్రం అందుకోవడంతో మరింత బాధ్యత పెరిగింది : ఎంపీఓ

నవతెలంగాణ-పినపాక



75వ గణతంత్ర దినోత్సవ సందర్భంగా ఉత్తమ ఎంపీఓగా పినపాక మండలంలో విధులు నిర్వహిస్తున్న ఎంపీఓ వెంకటేశ్వర రావుకు ఉత్తమ ప్రశంస పత్రం వరించింది. శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ప్రియాంక అలా, ఎస్పి రోహిత్ రాజ్ చేతుల మీదగా ప్రశంసా పత్రంను అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తమ మైన సేవలు అందజేయడమే తమ లక్ష్యం అని తెలియజేశారు.

ఉత్తమ వసతి గృహ సంక్షేమ అధికారిగా గద్దల

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



75వ గణతంత్ర దినోత్సవ సందర్భంగా భద్రాచలం బీసీ వసతి గృహ సంక్షేమ అధికారి గద్దల నరసింహారావు కలెక్టర్, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, జిల్లా వెనకబడిన తరగతుల అధికారి ఈ.ఇందిర చేతుల మీదుగా ఉత్తమ వసతి గృహ సంక్షేమ అధికారిగా ప్రశంస పత్రం అందుకున్నాడు.

ఘనంగా గణతంత్ర దినోత్సవం

నవతెలంగాణ-అశ్వారావుపేట



నియోజక వర్గం కేంద్రం అయిన అశ్వారావుపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేగా మొదటి సారి ఆదినారాయణ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆయిల్ఫెడ్ డివిజనల్ కార్యాలయంలో డీఓ బాల క్రిష్ణ, కొబ్బరి విత్తనోత్పత్తి క్షేత్రంలోఉద్యాన అధికారి కిషోర్, వ్యవసాయ కళాశాలలో ఏడీ హేమంత్ కుమార్, తహశీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ క్రిష్ణ ప్రసాద్, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, పీఆర్ కార్యాలయంలో డీఈ రామం, ఎన్పీడీసీఎల్ కార్యాలయంలో ఏడీఈ వెంకటేశ్వర్లు, పోలీస్ సర్కిల్ కార్యాలయంలో సీఐ కరుణాకర్, ఆబ్కారీ కార్యాలయంలో సీఐ నాగయ్యలు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

ఎంపీడీవోకు ఉత్తమ అవార్డు

నవతెలంగాణ-టేకులపల్లి



75వ గణతంత్రదినోత్సవ సందర్భంగా టేకులపల్లి ఎంపీడీవో వీరబాబుకు ఉత్తమ అవార్డు కలెక్టర్ అందజేసినట్లు శుక్రవారం తెలిపారు. మండలంలోని 36 గ్రామపంచాయతీలో అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేసి ఉత్తమ అవార్డు ఎంపీడీవో సాధించడంతో మండల ప్రజాపరిషత్ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు అభినందనలు తెలిపారు.

ఉత్తమ సేవా పథకాన్ని అందుకున్న రికార్డ్ అసిస్టెంట్

నవతెలంగాణ-జూలూరుపాడు



75వ గణతంత్ర వేడుకల దినోత్సవం సందర్భంగా జూలూరుపాడు ఎంపీడీవో కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న రికార్డ్ అసిస్టెంట్ వనమా మురళీకృష్ణ శుక్రవారం కలెక్టర్, ఎస్పీ, జిల్లా పరిషత్ సీఈవో, అశ్వారావుపేట ఎమ్మెల్యే చేతుల మీదుగా ఉత్తమ సేవా పథకాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన్ను కార్యాలయ సిబ్బంది, మండల ప్రజలు అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



75వ గణతంత్ర దినోత్సవ సందర్భంగా భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు క్యాంపు కార్యాలయంలో ఘనంగా ఉత్సవాలను నిర్వహించారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని నూతన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం కూడా నేడే ప్రారంభించగా బీఆర్ఎస్ పార్టీ శ్రేణులతో పాటు పట్టణ ప్రముఖులు ఇతర రాజకీయ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకట్రావు మాట్లాడుతూ... ఎంతోమంది వీరులు ప్రాణాలు త్యాగం చేసి భారతదేశానికి స్వాతంత్రాన్ని తెచ్చి పెట్టారని ఆగస్టు 15 తారీకున స్వాతంత్రం వస్తే జనవరి 26 తారీకు నుండి మన రాజ్యాంగం అమల్లోకి వచ్చి గణతంత్ర దినోత్సవాన్ని దేశ ప్రజలు జరుపుకుంటున్నారని అన్నారు. అభివృద్ధి ఫలాలు వెనుకబడ్డ ప్రజలకు అందినప్పుడే నిజమైన స్వాతంత్రం సిద్ధించినట్టని స్పష్టం చేశారు.

ప్రపంచ దేశాలకు భారత్ ఆదర్శం

- గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ అలా
- అలరించిన సంస్కృతిక కార్యక్రమాలు
- ఉత్తమ సేవలకు ప్రశంసా పత్రాలు అందజేత

నవతెలంగాణ-కొత్తగూడెం



భారత దేశ స్వాతంత్ర్యం కోసం ఎంతో మంది దేశ భక్తుల, త్యాగల ఫలితంగా దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని, బ్రిటీష్ పాలన అనంతరం సంపూర్ణ స్వరాజ్యం సిద్ధించి, భారత సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజా స్వామ్య, గణతంత్ర రాజ్యంగా, ప్రపంచ దేశాలకు ఆదర్శంగా భారత్ దేశం అవతరించిందని కలెక్టర్ ప్రియాంక అల అన్నారు. శుక్రవారం 75వ గణతంత్ర దినోత్సవ సందర్భంగా కొత్తగూడెం ప్రగతి మైదానంలో జరిగిన గణతంత్ర వేడుకల్లో పాల్గొన్నారు. ముందుగా జాతీయ జెండా ఆవిష్కరించారు. గౌరవ వందన చేశారు. భారతదేశం సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యంగా అవతరించిన తరువాత మనల్ని మనం పరిపాలించుకోవడానికి దేశానికి రాజ్యాంగం అవసరమని భావించిన నాటి దార్శినికులు, మేధావులు రాజ్యాంగ పరిషత్‌ను ఏర్పాటు చేసి రాజ్యాంగ ముసాయిదా కమిటీ చైర్మెన్‌గా డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను ఎన్నుకున్నారని చెప్పారు. రాజ్యాంగం 1950 జనవరి 26న అమల్లోకి రావడంతో జనవరి 26ను నాటి నుండి గణతంత్ర దినోత్సవంగా ఎంతో ఘనంగా జరుపుకుంటున్నామని తెలిపారు. ఈ సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రగతిని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన మహాలక్ష్మీ పథకంతో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌలభ్యం లభించిందని చెప్పారు. ఇప్పటి వరకు 10 లక్షల 19వేల200మంది మహిళలు బస్సులో ప్రయాణించారన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీతో పేదలకు రూ.10లక్షల వరకు ఉచిత వైద్యం అందుతుందన్నారు. ప్రజా పాలన కార్యక్రమంలో ప్రజల చెంతే పాలన వచ్చిందని చెప్పారు. 252 మందికి వైద్య సేవలు అందినట్లు చెప్పారు.

అభయ అస్తంలో జిల్లాలో 3 లక్షల 34 వేల 227 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. గ్రామాల సర్వతో ముఖాభివృద్ధికి ప్రతి గ్రామం యూనిట్‌గా ప్రణాళికలు రూపకల్పనలో ప్రభుత్వం ముందుకెల్తుందని చెప్పారు. అందరి సమిష్టి కృషితో జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధిలోకి తీసుకు వెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ రోహిత్ రాజ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలు అందించినందుకు పలువుర అధికారులకు, సిబ్బందికి ప్రశంస పత్రాలు అందజేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి.

ఉత్తమ తహశీల్దార్‌గా క్రిష్ణ ప్రసాద్

నవతెలంగాణ-అశ్వారావుపేట



గణతంత్ర దినోత్సవం పురస్కరించుకుని మంచి పనితనం కనబరిచిన ఉద్యోగులకు అందించే ఉత్తమ సేవా పథకాలకు ఈ ఏడాది అశ్వారావుపేట తహశీల్దార్ వి.క్రిష్ణ ప్రసాద్ ఎంపికయ్యారు. 75వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రం అయిన కొత్తగూడెంలో కలెక్టర్ ప్రియాంక అలా, ఎస్‌పీ రోహిత్ రాజ్, ఎమ్మెల్యే ఆదినారాయణ చేతులు మీదుగా శుక్రవారం ప్రశంసా పత్రాన్ని తహశీల్దార్ క్రిష్ణ ప్రసాద్ అందుకున్నారు. వీరితో పాటు అశ్వారావుపేట తహశీల్దార్ కార్యాలయం యూడీసీ ప్రభాకర్ రావు, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఏ.సాగర్ సైతం ఉత్తమ ఉద్యోగి పత్రం అందుకున్నారు. వీరికి పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు అభినందనలు తెలిపి, హర్షం ప్రకటించారు.

భళా...ఐఏఎస్...!

- నేలపై కూర్చుని పిల్లల కళా ప్రదర్శనలు తిలకించిన పీఓ

నవతెలంగాణ-భద్రాచలం

అయన ఓ ఐఏఎస్ అధికారి. అయినా తనకు సాదాసీదాగా ఉండటమే ఇష్టం. ఎంతలా అంటే..నేలపైన కూర్చొని నేను సైతం సాధారణ మానవున్నే అనేలా...ఈ అరుదైన సంఘటన భద్రాచలం ఐటీడీఏ ప్రాంగణంలో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. భద్రాచలం ఐటీడీఏ ప్రాంగణంలో శుక్రవారం రిపబ్లిక్ డే వేడుకలను ఘనంగా జరిపారు. ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ప్రతిక్ జైన్ సతీ సమేతంగా ఈ



వేడుకకు హాజరయ్యారు. జాతీయ పతాక ఆవిష్కరణ అనంతరం పీఓ ఐటీడీఏ అభివృద్ధికి సంబంధించిన నివేదికను సమర్పించారు.

అనంతరం పిల్లలు ప్రదర్శించే సాంస్కృతిక కార్యక్రమాలకు సిద్ధమయ్యారు. వేదిక పైన సాంస్కృతిక ప్రదర్శనలు సాగుతుండగా, వేదికకు ముందు అతిథులు కుర్చీలో కూర్చునేలా ఏర్పాట్లు జరిగాయి. కానీ ఇందుకు భిన్నంగా పీఓ కుర్చీలన్నీ తీసివేపించి నేలపైనే కూర్చున్నారు. తనతో పాటు తన సతీమణి, భద్రాచలం ఐటిడిఏ ఏపీవో జనరల్ డేవిడ్ రాజ్, ఇతర ఐటీడీఏ యూనిట్ అధికారులు నేలపైనే కూర్చొని ఆద్యాంతం సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించారు. పిల్లలు డాన్సులు చేస్తూ ఉంటే... చప్పట్లు కొడుతూ వారిని ఉత్సాహపరిచారు. ఒక ఐఏఎస్ స్థాయి అధికారి నేలపై కూర్చొని సాంస్కృతిక ప్రదర్శనలు చూసిన సంఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది. హంగు, ఆర్భాటాలతో హడావుడి చేసే ఈ రోజుల్లో...సాధారణ వ్యక్తిగా ఐటీడీఏ పీవో ఐఏఎస్ స్థాయి అధికారి ఇలా రిపబ్లిక్ డే వేడుకల్లో పాల్గొనడం పలువురుని ఆశ్చర్యపరిచింది. భళా..యువ ఐఏఎస్ అధికారి ప్రతీక్ సార్ అంటూ... పలువురు ప్రశంసించారు.

ప్రతి ఒక్కరూ అంకిత భావంతో పనిచేయాలి

- నిర్దేశించుకున్న లక్ష్యం 700 లక్షల టన్నులు
- త్వరలో కొత్త గనులు
- గణతంత్ర వేడుకల్లో సింగరేణి సీ అండ్ ఎండి బలరామ్

నవతెలంగాణ-కొత్తగూడెం



సింగరేణి సంస్థ నాదే అనే అంకిత భావంతో ప్రతి ఒక్కరూ పనిచేయాలని, ఉత్పత్తి లక్ష్యాలను సాధించడమే కాదు, బొగ్గు ఉత్పత్తిలో రక్షణ, నాణ్యత పాటించాలని, సంస్థ నిర్దేశించిన 700 లక్షల టన్ను బొగ్గు సాధించాలని, సంస్థ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ పాటు పడాలని సింగరేణి చైర్మెన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరామ్ అన్నారు. శుక్రవారం కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో సింగరేణి ఆధ్వర్యంలో 75వ గణతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. తొలుత జాతీయ పతాకాన్ని ఎగరవేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్రం లభించిన తర్వాత మన కోసం, మనం రాసుకున్న రాజ్యాంగాన్ని అమలులోకి తెచ్చిన పవిత్ర దినం, ప్రపంచ మేధావి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సారథ్యంలో గొప్ప రాజ్యాంగాన్ని లిఖించుకోవడం జరిగిందన్నారు. చైర్మెన్‌గా బాధ్యతలు స్వీకరించిన ఈ నెల రోజుల కాలంలో నేను అనేక గనులు విజిట్ చేశానని, గని లోపల, బయట కూడా వందలాది మంది కార్మికులతో మాట్లాడానని చెప్పారు. గణతంత్ర దినోత్సవ వేడుకలను సంధర్భముగా ఉత్తమ సింగరేణియన్‌గా, ఉత్తమ అధికారులుగా, ఉత్తమ కార్మికులుగా ఎంపికైన వారని ఘనంగా సన్మానించారు. అనంతరం పట్టణంలోని పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరని అలరించాయి. ఈ సింగరేణి అధికారులు కె.బసవయ్య ఎన్.వి.కె. శ్రీనివాస్, జి.వేంకటేశ్వర రెడ్డి, డి.సత్యనారాయణ రావు, కె.రాజ్ కుమార్, కార్మిక సంఘాల నాయకులు, కళాకారులు మరియు కళాశాల మరియు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

ఏరియాలో : కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయములో జీఎం ఎం.షాలేం రాజు జాతీయ పతాకావిష్కరించారు. అనంతరం కొత్తగూడెం ఏరియా ప్రధాన గణతంత్ర దినోత్సవ వేడుకలలో భాగముగా ప్రొఫెసర్ జయశంకర్ (గ్రౌండ్స్ రుద్రంపూర్‌లో జాతీయ పతాకావిస్కరణ చేశారు. గౌరవ వందనం స్వీకరించారు. ఉత్తమ ఉద్యోగులుగా ఎంపిక కాబడిన 6 మంది ఉద్యోగులను వారి కుటుంబ సభ్యులను సన్మానించారు. ఈ కార్యక్రమములో జి.మధురవాణి షాలేం రాజు, జివి.కోటి రెడ్డి, వి.దుర్గా ప్రసాద్, బి.రవీందర్, బి.శివ కేశవ రావు, ఎం.వేంకటేశ్వర రావు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో : ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ రోహిత్ రాజ్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. జిల్లా ప్రజలకు, పోలీస్ అధికారులకు, సిబ్బందికి ఎస్పీ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓఎస్డి టి.సాయి మనోహర్, ఏఆర్ అడిషనల్ ఎస్పీ విజయ్ బాబు డీసీఆర్బీ డీఎస్పీ మల్లయ్య స్వామీ, కొత్తగూడెం డిఎస్పీ రెహమాన్, పాల్వంచ డిఎస్పీ వెంకటేష్, సైబర్ క్రైమ్స్ డిఎస్పీ కృష్ణయ్య, ఇల్లందు డీఎస్పీ రమణ మూర్తి, జిల్లా పోలీస్ కార్యాలయ ఏవో జయరాజు, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జెడ్పీ కార్యాలయంలో : జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో జెడ్పీ సీఈఓ మెరుగు విద్యాలత జాతీయ జెండా పతాకాన్ని అవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్ పర్సన్ కంచర్ల చంద్రశేఖర రావు, జిల్లా పంచాయతీ రాజ్ ఈఈ ఎస్.శ్రీనివాసరావు, ఉప ముఖ్య కార్యనిర్వాహణాధికారి బి.నాగలక్ష్మి, ఎంపిపి బాదావత్ శాంతి, ప్రజా ప్రతినిధులు, కార్యాల సిబ్బంది పాల్గొన్నారు.



లిటిల్ ఫ్లవర్స్ విద్యాసంస్థలలో గణతంత్ర దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

భద్రాచలం పట్టణంలోని లిటిల్ ఫ్లవర్స్ విద్యాసంస్థలలో వైభవంగా గణతంత్ర దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా విద్యాసంస్థల ఆవరణలో ఏర్పాటు చేసిన జాతీయ పతాకాన్ని లిటిల్ ఫ్లవర్స్ కళాశాల డైరెక్టర్ మాగంటి రమేష్ బాబు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించగా, విద్యా సంస్థల డైరెక్టర్ మాగంటి ప్రసాద్ బాబు జాతీయ నాయకుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం విద్యార్థినీ, విద్యార్థులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ... దేశ స్వాతంత్ర సంగ్రామంలో ఎంతోమంది ప్రాణాలు అర్పించి భారతదేశానికి స్వాతంత్రాన్ని తీసుకొచ్చారని గుర్తు చేశారు. స్వాతంత్రం పొందిన భారతదేశ ప్రజలందరికీ సమాన హక్కును కల్పిస్తూ రాజ్యాంగాన్ని రూపొందించుకొని జనవరి 26 తారీకు నుండి పూర్తిస్థాయిలో స్వయం పాలనను ఏర్పాటు చేస్తుందని తద్వారా 26 జనవరి నుండి స్వాతంత్రం పూర్తిస్థాయిలో అమలులోకి వచ్చిందని అన్నారు. అనంతరం విద్యార్థినీ, విద్యార్థులు వివిధ సాంస్కృతిక కళారూపాలు ప్రదర్శించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా దేశ నాయకులు చరిత్ర పై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విద్యార్థులకు మిఠాయిలు పంచి పండగ వాతావరణంలో గణతంత్ర దినోత్సవ వేడుకలను నిర్వహించగా ఈ వేడుకలలో లిటిల్ ఫ్లవర్స్ విద్యాసంస్థల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నూతన కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభం

నవతెలంగాణ-పినపాక



పినపాక మండలం ఈ.బయ్యారం క్రాస్ రోడ్‌లో కాంగ్రెస్ పార్టీ నూతన కార్యాలయాన్ని శుక్రవారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఉడుముల లక్ష్మారెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం కాంగ్రెస్ మండల అధ్యక్షులు రామనాదం ఆధ్వర్యంలో నూతన కార్యాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మండల అధ్యక్షులు రామనాథ మాట్లాడుతూ పార్టీని కార్యకర్తలు మరింత ముందుకు సాగేందుకు నూతన కార్యాలయం ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఇచ్చిన మాటకు కట్టుబడే నేత, మృదుస్వభావి ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రతి కార్యకర్తకు అందుబాటులో ఉంటారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చట్ట ప్రకారం పరిహారం చెల్లించాలి

నవతెలంగాణ-అశ్వారావుపేట



వెంకమ్మ చెరువు కాలువ నిర్మాణంలో భూములు కోల్పోయిన తమకు 2013 చట్ట ప్రకారం ఎకరాకు రూ.8 లక్షలు నష్ట పరిహారం చెల్లించాలని భూ నిర్వాసిత రైతులు నీటి పారుదల శాఖ ఈఈ సురేష్ కుమార్‌ను వేడుకున్నారు. మండలంలోని మల్లాయిగూడెంలో శుక్రవారం ఆయన భూ నిర్వాసితులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. భూసేకరణ సమయంలో నిర్ణయించిన ఎకరాకు రూ.1.35 లక్షలు చొప్పున 72 ఎకరాలకు రూ.78 లక్షలు మంజూరు అయిందని ఈఈ రైతులకు వివరించారు. మీరు అంగీకరిస్తే వెంటనే చెల్లిస్తామని చెప్పారు. ఈ పరిహారం తీసుకునేందుకు రైతులు అంగీకరించలేదు. ఎప్పుడో నిర్ణయించిన పరిహారం మాకు అవసరం లేదని, 2013 చట్ట ప్రకారం రూ.3 లక్షలు చెల్లిస్తేనే తీసుకుంటామని రైతులు తేల్చి చెప్పారు. దీనితో రైతులంతా ఏకగ్రీవంగా తీర్మానం చేసి అందిస్తే ఉన్నతాధికారులకు పంపించి అదనపు నిధులు మంజూరుకు కృషి చేస్తానని రైతులకు హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో డీఈఈ ఎల్.కృష్ణ, ఏఈ కె.కృష్ణ, పలువురు రైతులు పాల్గొన్నారు.

ఉత్తమ జీసీసీ మేనేజర్‌గా సుగ్గల

- పీఓ చేతుల మీదుగా పురస్కారం

నవతెలంగాణ-దమ్మపేట



గణతంత్ర దినోత్సవం పురస్కరించుకొని భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్ చేతులు మీదుగా దమ్మపేట జీసీసీ మేనేజర్ సుగ్గల నరసింహారావును ఉత్తమ జీసీసీ మేనేజర్‌గా శుక్రవారం అవార్డు, ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. దమ్మపేట జీసీసీ మేనేజర్‌గా సంస్థ నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో సాధించటంతో పాటు నరసింహారావు చేసిన కృషి వలన అన్నపురెడ్డిపల్లి, దమ్మపేటలలో ఐటీడీఏ ద్వారా గిరిజన పెట్రోలు బంకులను మంజూరు చేయించడమే కాకుండా వాటి నిర్మాణాలను దగ్గరుండి పూర్తి చేయించి పెట్రోల్ బంకులను మనుగడలోకి తీసుకురావడంలో నరసింహారావు కృషి ఎంతో ఉంది. దీంతోపాటు ప్రభుత్వం జీసీసీ ద్వారా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోళ్లను రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడంలోనూ రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం ద్వారా కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులు అమ్మిన ధాన్యాన్నికి సంబంధించి డబ్బులు రైతులు ఖాతాలో సకాలంలోపడటానికి వేగంగా పని చేసి నరసింహారావు అటు రైతుల నుండి, ప్రభుత్వ అధికారుల నుండి గతంలోనే ప్రశంసలు అందుకున్నారు. దీనికి తోడు నరసింహారావు దమ్మపేట జీసీసీ బ్రాంచ్‌ను నడిపిస్తున్న తీరు అధికారులను సైతం ఆమోదించే విధంగా ఉండటం ప్రజల్లో మంచి పేరు సంపాదించుకోవడమే కాకుండా జీసిసి ఉద్యోగులు, సిబ్బంది, జీసిసి హమాలీలకు ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండటం వారి సమస్యలను పరిష్కరించడంలో సైతం నరసింహారావు ముందున్నారు. దీంతో ప్రభుత్వం నరసింహారావు సేవలను మెచ్చి 2023-2024 సంవత్సరానికి గాను ఉత్తమ జీసీసీ మేనేజర్‌గా ఎంపిక చేసి సత్కరించింది. ఆయనకు పురస్కారం దక్కడం పట్ల తోటి ఉద్యోగులతో పాటు జీసీసీ హమాలీలు, ప్రజలు పెద్ద ఎత్తున నరసింహారావుకు అభినందనలు తెలియజేస్తున్నారు.

ఆరు గ్యారంటీలు అమలు చేయడమే ప్రభుత్వ లక్ష్యం

- గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మెన్

నవతెలంగాణ-ఇల్లందు

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆరు గ్యారంటీలు పగడ్బందీగా అమలు చేయడమే లక్ష్యమని ఎమ్మెల్యే కోరం కనకయ్య, అన్నారు. మున్సిపల్ చైర్మన్ డివి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం జరిగిన 75వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం అనంతరం మున్సిపల్ కార్యాలయంలో జండా ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఇల్లందు నియోజకవర్గ ప్రజలందరికీ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వర రావు, 22వ వార్డు కౌన్సిలర్ అంకెపాక నవీన్ కుమార్, పట్టణ అధ్యక్షులు డానియల్ నాయకులు మడుగు సాంబమూర్తి, శీను, సూర్యం, జాఫర్, కాంగ్రెస్ పార్టీ పట్టణ నాయకులు తదితరులు పాల్గొన్నారు.





పాల్వంచలో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-పాల్వంచ



75వ గణతంత్ర దినోత్సవ సందర్భంగా పాల్వంచలో ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, పరి శ్రమల్లో, కార్మిక సంఘాల్లో ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు పలు అసోసి యేషన్స్ యూనియన్స్ ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవాన్ని జాతీయ జెండాను ఎగురవేసి ఘనంగా జరుపుకున్నారు. గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కొత్తగూడెం థర్మల్ పవర్‌స్టేషన్ 5,6,7వ దశల్లో గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. చీఫ్ ఇంజనీర్స్ ఈ వెంకటేశ్వరరావు, ఎం.ప్రభాకర్‌రావులు జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వతంత్ర్య సంగ్రామం కోసం ఆనాటి పరిస్థితులు భారత రాజ్యాంగ ఆవశ్యకతను వివరిస్తూ అమరవీరులను స్మరించుకుని నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీర్లు ఆర్టిజన్స్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు. 1535 యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక కార్యాలయంలో సెంట్రల్ కమిటీ అధ్యక్షులు ఎంఎ వజీర్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. టిఆర్‌వికేఎస్ ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. యూనియన్ రాష్ట్ర సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్ జెన్కో కార్యదర్శి చారుగుండ్ల రమేశ్ 7వ దశ రీజినల్ అధ్యక్షులు శ్రీ తోట కోటేశ్వరరావు జాతీయ జెండాను ఆవిష్కరించారు. హెచ్ 142 యూనియన్ ఆధ్వర్యంలో ప్రాంతీయ కార్యాలయంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవి రామారావు జాతీయ జెండాను ఎగురవేశారు. పాల్వంచ మున్సిపల్ కార్యాలయంలో కమీషనర్ స్వామి జాతీయ జెండాను ఆవిష్కరించారు. పాల్వంచలో సొసైటీ కార్యాలయంలో డిసిఎంఎస్ చైర్మెన్ కొత్వాల శ్రీనివాసరావు జాతీయ జెండాను ఎగురవేశారు. పాల్వంచలోని పలు ప్రాంతాలలో కొత్వాల జాతీయ జెండాను ఆవిష్కరించారు. నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో ప్రిన్సిపాల్ పూరేటి నర్సింహారావు జాతీయ జెండాను ఆవిష్కరించారు.



శాంతిభద్రతలకు విఘాతం కల్పిస్తే ఊరుకోం : సీఐ

నవతెలంగాణ-చర్ల

శాంతి భద్రతలకు విఘాతం కల్పించేటట్లు నడుచుకుంటే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని చర్ల సీఐ బి.రాజగోపాల్ అన్నారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్లో జరిగిన ఓ పాత్రిక సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల ప్రజలకు హాని కలిగే విధంగా ఏ ఒక్కరూ నడుచుకోవద్దని అలాంటి విషయం పోలీసు వారి దృష్టికి వస్తే ప్రజా హాని చేసే వారిని సహించేది లేదని చట్టరీత్యా బాధ్యులను చేస్తూ ఎంతటి వారి పైన అయినా చర్యలు చేపడతానని ఆయన పునర్ఘాటించారు. సమాజ సేవలో ఉన్న పాత్రికేయులు, రాజకీయ నాయకులు కలిసిమెలిసి ఉండి మండల అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. ఏజెన్సీలో ఉన్న ప్రత్యేక పరిస్థితులకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ నడుచుకోవాలన్నారు. శాంతిభద్ర ద్యేయంగా పనిచేస్తున్న ప్రతి ఒక్క ఉద్యోగికి మండల ప్రజలు సహకరించాలని కోరారు. సంఘవిద్రోహక చర్యలు చేపట్టే వారికి ఎట్టి పరిస్థితిలో సహకరించవద్దని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సిఆర్పిఎఫ్ 141 బెటాలియన్ అధికారి రాజ్ కుమార్, చర్ల ఎస్ఐలు నర్సిరెడ్డి, సూరి తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐను సత్కరించిన మండల కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-దమ్మపేట



దమ్మపేట పోలీస్ స్టేషన్‌లో నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ కిషోర్ రెడ్డిని మండల కాంగ్రెస్ నాయకులు పలువురు మర్యాదపూర్వకంగా కలుసుకొని సత్కరించారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐను కలుసుకున్న నాయకులు ముందుగా గణతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ క్రమంలో పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో ఎస్ఐను సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు రావు గంగాధర్‌రావు, పర్వతనేని వర ప్రసాదరావు, మండల సర్పంచ్‌ల సంఘం కార్యదర్శి కుర్సం శ్రీను, తెలంగాణ ఉద్యమ నాయకుడు ముళ్ళపూడి వెంకటేశ్వరరావు, ఎస్ శ్రీధర్, మండలపల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు వెంకయ్య, వార్డు సభ్యుడు ఎస్‌కె రఫీ, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

మోడీ నియంత పాలనకు చరమగీతం పాడుదాం

- బీజేపీ ప్రభుత్వ రైతు, కార్మిక వ్యతిరేక విధానాలపై మోటార్ సైకిల్ ర్యాలీ
- సంయుక్త కిసాన్ మోర్చా

నవతెలంగాణ-కొత్తగూడెం



కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా శుక్రవారం జిల్లా కేంద్రంలో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్నామని సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు రేపాకుల శ్రీనివాస్, యలమంచిలి వంశీ, ఎస్‌కె.ఉమర్, లంజపల్లి విశ్వనాథం, జాటోత్ కృష్ణ, బుర్ర వెంకన్న దస్రు అధ్యక్షతన శుక్రవారం కొత్తగూడెం మార్కెట్ యార్డ్‌లో జరిగిన సభలో ఎస్‌కేఎం దేశ వ్యాప్త పిలుపులో భాగంగా ఈ సభనుద్దేశించి రైతు సంఘాల ఎస్‌కెఎం నాయకులు ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య, కాసాని ఐలయ్య, కందగట్ల సురేందర్, మచ్చా వెంకటేశ్వర్లు, అమర్లపూడి రాము, బానోతు ఊక్లా, ఎస్‌కెఎం రైతు సంఘానికి మద్దతుగా కార్మిక సంఘం నాయకులు ఏజే.రమేష్, నరాటి ప్రసాద్, గౌని నాగేశ్వరరావు, జడ సీతారామయ్య యాకూబ్ షావాలి పాల్గొని మాట్లాడారు. రైతులకు స్వామి నాథన్ కమిటీ సిఫార్సుల ప్రకారం రైతులు పెట్టిన పెట్టుబడికి 50 శాతం కలిపి మద్దతు ధరలు చట్టం చేయాలన్నారు. పేద మధ్యతరగతి రైతులందరికీ కేంద్ర ప్రభుత్వం రుణమాఫీ చేయాలి, 60 ఏళ్ళు పైబడిన వారికి పెన్షన్ ఇవ్వాలి, కేంద్ర మంత్రి అజయ్ మిశ్రాను మంత్రి వర్గం నుండి తొలగించాలి, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా 14 రకాల నిత్యావసర వస్తువులను అందించాలని, 2006 అటవీ హక్కుల చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. చుంచుపల్లి మండలం, విద్యానగర్ బైపాస్ రోడ్డు నుంచి లక్ష్మీదేవిపల్లి వ్యవసాయ మార్కెట్ వరకు మోటార్ సైకిళ్ళతో ర్యాలీ నిర్వహించారు. రైతులు, వ్యవసాయ కార్మికులు, కార్మికులు పెద్ద ఎత్తున తరలి వచ్చి జయప్రదం చేసిన శ్రేణులందరికీ ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. ప్రధానంగా ఫిబ్రవరి 16న జరిగే జాతీయ గ్రామీణ సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కేఎం జిల్లా రాష్ట్ర నాయకులు అన్నవరపు సత్యనారాయణ, తుపాకుల నాగేశ్వరరావు, లిక్కి బాలరాజు, కున్సోత్ ధర్మ ఊకంటి రవికుమార్, భూక్య శంకర్, భూక్య రమేష్, దొడ్డ రవికుమార్, కె.సత్య బాలకృష్ణ డి.వీరన్న, జాటోత్ కృష్ణ, స్వర్ణపాక నాగేశ్వరరావు, కల్లూరి కిషోర్, ఎట్టి నరసింహారావు, నిమ్మల రాంబాబు, మోతుకూరి మల్లికార్జునరావు, నరసింహారావు, యాస నరేష్, కుంజా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.





ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు

- ఆకట్టుకున్న మాంటిసోరి పాఠశాల సాంస్కృతిక కార్యక్రమాలు

నవతెలంగాణ-మణుగూరు



మణుగూరు సబ్ డివిజన్‌లో ఘనంగా 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో, మణుగూరు లోని గాంధీ బొమ్మ సెంటర్ మాంటిస్సోరి పాఠశాలలో, లారీ యూనియన్ ఆఫీస్ కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో రాఘవ రెడ్డి, ఎంపీడీఓ కార్యాలయంలో చంద్రమౌళి, మున్సిపాలిటీ కార్యాలయంలో ఉమామహేశ్వరరావులు మూడు రంగుల జెండాను ఎగరవేశారు. మండలంలోని 14 పంచాయతీలలో జెండా ఆవిష్కరించారు.

వ్యాపారులు, వినియోగదారులకు సౌకర్యంగా ఇంటిగ్రేటెడ్ మార్కెట్

- పెండింగ్ నిర్మాణాలు పూర్తి చేసి అందుబాటులోకి తేవాలి
- ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

నవతెలంగాణ-కొత్తగూడెం



చిరు వ్యాపారులకు, వినియోగదారులకు సౌకర్యవంతంగా ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణాలు జరుగుతున్నాయని, నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తేచ్చేందుకు చర్యలు చేపడుతున్నామని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. పట్టణంలోని రైతు బజార్‌లో నిర్మాణం పూర్తి చేసుకున్న మార్కెట్ సముదాయాన్ని ప్రారంభించి వ్యాపారులకు అందుబాటులోకి తెచ్చారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ రోడ్ల వెంట, చెట్ల క్రింద, తాత్కాలిక షెడ్లలో వ్యాపారాలు చేసుకున్న ఇబ్బందులు పడుతున్న చిరువ్యాపారులకు ఇంటిగ్రేటెడ్ మార్కెట్ సముదాయాలు సౌకర్యవంతంగా ఉంటాయని అన్నారు. మిగిలిన సముదాయాలు త్వరితగతిన పూర్తి చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఏఐటియుసి అనుబంధ చిరు వ్యాపారుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాతీయ జెండాను గణతంత్ర దినోత్సవం సందర్భంగా కూనంనేని ఆవిష్కరించి వ్యాపారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె.సాబీర్ పాషా, మున్సిపల్ చైర్పర్సన్ కాపు సీతాలక్ష్మి, మున్సిపల్ కమీషనర్ రఘు, డిఇ రవి, టిపివో ప్రభాకర్, ఏఈ రాము, కౌన్సిలర్లు కంచర్ల జమలయ్య భూక్య శ్రీనివాస్, ఏఐటియుసి నాయకులు గెద్దాడ నగేష్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బందెల నర్సయ్య, దుర్గరాశి వెంకటేశ్వర్లు, సలిగంటి శ్రీనివాస్, వ్యాపారులు, తదితరులు పాల్గొన్నారు.

రెపరెపలాడిన మువ్వన్నెల జెండా



నవతెలంగాణ-మణుగూరు

భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ నందు గణతంత్ర దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా సీఈ బిచ్చన్న జాతీయ నాయకుల చిత్ర పటానికి పూలమాల వేసి జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ప్లాంట్‌లో విధులు నిర్వహిస్తున్న సెక్యూరిటీ సిబ్బంది ముగ్గురికి ప్రోత్సాహక బహుమతులు, ఒక ఇంజనీరుకి సెర్టిఫికెట్ అందించారు. ఈ సందర్భంగా సీఈ మాట్లా డారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈలు స్టేజి1 దేవ, ప్రసాద్, స్టేజి 2 రమేష్ బాబు, సివిల్ 1 ఎం.వి. రమణ మూర్తి, సివిల్ 2 రాంప్రసాద్, ఎస్ఈ పార్వతి, డీఈలు, ఏడీఈలు కార్మికులు, సంఘాల నాయకులు పాల్గొన్నారు.

జీఎం కార్యాలయంలో : జీఎం కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. హాజరైన ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ ముందుగా భారత మాత, జాతి పిత గాంధీజీ, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జాతీయ జెండాను ఆవిష్కరించారు. పివి కాలనీ భద్రాద్రి స్టేడియం జాతీయ జెండా ఆవిష్కరణ అనంతరం స్కౌట్స్ గైడ్స్, సింగరేణి సెక్యూరిటి విభాగం, ప్రైవేట్ సెక్యూరిటి విభాగం, వివిధ పాఠశాలల కలర్ పార్టీలచే గౌరవ వందనం స్వీకరించి, మాట్లాడారు. అనంతరం నిబద్ధతతో ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించిన ఉద్యోగులకు జనరల్ మేనేజర్ చేతుల మీదగా సత్కారం చేశారు. మణుగూరు పట్టణ సింగరేణి కాలరీస్, హోలీ ఫ్యామిలీ స్కూల్, ఏక్సిలెంట్ హై స్కూల్, శ్రీ విజ్ఞాన్ స్కూల్, శ్రీ విద్యా హై స్కూల్, రాధిక కన్సెప్ట్ స్కూల్, విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. విభాగాల వారీగా ప్రథమ, ద్వితీయ, తతీయ, ప్రత్యేక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సేవ అధ్యక్షురాలు దుర్గం సుమతి, రామ చందర్, గుర్తింపు సంఘం నాయకులు వై.రాంగోపాల్, ఐఎన్ టియూసి నాయ కులు వి.జాన్, ఏజిఎం(సివిల్) డి.వెంకటే శ్వర్లు, ఏరియా ఇంజనీర్ నర్సిరెడ్డి, ఏఎస్ఓ వెంకట రమణ, ఏజిఎం (కేపియూజి) జే.వీరభద్ర రావు, తదితరులు పాల్గొన్నారు.



ఇల్లందు : నిర్దేశించిన వార్షిక ఉత్పత్తిరవాణాలో ఏరియా ముందంజలో ఉందని జీఎం జాన్ ఆనంద్ గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా అన్నారు. కార్యాల యంలో జీఎం జాతీయ పతకాన్ని ఆవిష్కరించారు. అనంతరం సెక్యూరిటి విభాగం, భారత్ స్కౌట్ అండ్ గైడ్స్, ఎన్‌సీసీ విద్యార్థులు, ఇతర పాఠశాలల కళాశాల విద్యార్థుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు.

ఉద్యోగులకు బహుమతులు ప్రధానం

ఉత్తమ ఉద్యోగులుగా ఎంపికైన వారిని కుటుంబ సమేతంగా సన్మానించారు. తదుపరి వివిధ గనులు, విభాగాలలో అత్యుత్తమ విధులు నిర్వహించిన ఉద్యోగులకు నగదు బహుమతి అందజేసి ప్రోత్సహించారు. అదేవిధంగా విజిలెన్స్ అవగాహన వారోత్సవాల సందర్భంగా నిర్వహించినటువంటి వ్యాసరచన పోటీలలో గెలుపొందిన ఉద్యోగులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో సింగరేణి కాలరీస్ హైస్కూల్ అధ్యాపకులు విద్యార్థులతో పాటు ఇల్లందు పట్టణంలోని అన్ని స్కూల్స్ అధ్యాపకులు విద్యార్థులు వారి వారి పాఠశాలల తరపున సాంస్కృతిక కార్యక్రమాలు, వేషధారణలు, ఆసాంతం జనవాహినిని విశేషంగా ఆకట్టుకున్నాయి.

కోర్టులో : రాజ్యాంగాన్ని అమలు చేయడంలో ముఖ్య పాత్ర పోషించిన గొప్ప వ్యక్తుల్లో న్యాయవాదుల పాత్ర చాలా కీలకమని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి దేవరపల్లి కీర్తి చంద్రిక రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జడ్జితో పాటు ఇల్లందు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మామిడి సత్య సత్య ప్రకాష్, ఎగ్జిక్యూటివ్ బాడీ జనరల్ సెక్రెటరీ, సత్యనారాయణ దొర జాయింట్ సెక్రటరీ కీర్తి, కార్తీక్, కోర్టు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వాసవి క్లబ్ ఆధ్వర్యంలో : ఆర్యవైశ్య సంఘం, వాసవి క్లబ్ ఆధ్వర్యంలో పలుచోట్ల జెండా ఆవిష్కరణ చేశారు. వాసవి క్లబ్ అధ్యక్షుడు, పుల్లూరు సతీష్ కుమార్, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో చారు గుండ్ల జగన్నాధం జెండా ఆవిష్కరించారు.

బిఎస్పి పార్టీ కార్యాలయంలో : బిఎస్పి నియోజకవర్గ ఇన్చార్జ్ ప్రతాప్ నాయక్ ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఎగురవేసిన వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ ప్రైవేటు కళాశాలలు పాఠశాలల్లో : చల్లసముద్రం ఉన్నత పాఠశాలలో ఎంఈఓ పిల్లి శ్రీనివాస్ జాతీయ పతాకావిష్కరణ చేశారు. జేబీఎస్, మెయిన్ రోడ్డు, సుభాష్ నగర్లలోని ప్రభుత్వ ప్రాథమిక ప్రాథమిక ఉన్నత ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ జూనియర్ కళాశాలలో జాతీయ జెండా ఆవిష్కరించారు.

కార్మిక శాఖ కార్యాలయంలో...

లేబర్ అండ్డా పై సీఐటీయూ ఆధ్వర్యంలో సీపీఐ(ఎం) కార్యాలయం సమీపంలో లేబర్ అడ్డాపై బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్ కన్వీనర్ అబ్దుల్ నబీ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో సిబ్బంది షేక్ జాన్ మియా, క్రాంతి కుమార్, సిఐటియూ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



పినపాక : పినపాక తహసీల్దార్ కార్యాలయంలో వీరభద్ర ప్రసాద్, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో చంద్రశేఖర్, రైతు వేదిక వద్ద ఏవో వెంకటేశ్వర్లు, అటవీ శాఖ కార్యాలయంలో ఎఫ్ఆర్వో తేజస్విని, వెలుగు కార్యాలయం వద్ద ఏపీవో జ్యోతి, పోలీస్ శాఖ కార్యాలయంలో సీఐ శివప్రసాద్, విద్యుత్ కార్యాలయంలో ఏఈ కావ్య, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో దుర్గ భవాని, ధశ్రుతి, అన్ని ప్రభుత్వ ప్రవేట్ పాఠశాలల్లో, కార్యాలయాల్లో నందు గణతంత్ర దినోత్సవ సందర్భంగా జాతీయ జెండాను ఎగురవేశారు.



అన్నపురెడ్డిపల్లి : పోలీస్ స్టేషన్ నందు ఎస్సై షాహిన, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు డాక్టర్ ప్రియాంక, తహశీల్దార్ కార్యాలయంలో జగదీష్ ప్రసాద్, ఎంపీడీఓ కార్యాలయంలో అన్నపూర్ణ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు చల్లా భాస్కర్ జాతీయ జెండాను ఎగురవేశారు.



టేకులపల్లి : తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ కృష్ణవేణి, పోలీస్ స్టేషన్లో సీఐ ఇంద్రసేనారెడ్డి, మండల అభివృద్ధి అధికారి కార్యాలయంలో ఎంపీడీవో వీరబాబు, సొసైటీ కార్యాలయంలో సొసైటీ అధ్యక్షుడు లక్కినేని సురేంద్రరావు, పలు ప్రభుత్వ పాఠశాలల్లో, కోయగూడెం ఓపెన్ కాస్ట్‌లో ప్రాజెక్ట్ అధికారి ప్రహల్లాద, పార్టీ కార్యాలయంలో పంచాయతీ కార్యాలయంలో జెండాను ఎగురవేశారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో పలు పంచాయతీలకు చెందిన ఉత్తమ వర్కర్లకు ప్రశంస పత్రాల ను ఎంపీడీవో, ఎంపీవో గాంధీ, వైస్ ఎంపీపీ ఉండేటి ప్రసా ద్, స్థానిక సర్పంచ్‌లు చేతులమీదుగా అందజేశారు. వివిధ సొసైటీ ఆఫీసులో, జిల్లా సహకార బ్యాంక్ నందు జెండా ఆవిష్కరణలలో పాల్గొన్న పిఎసిఎస్ సొసైటీ చైర్మన్, ఉమ్మడి జిల్లా సహకార బ్యాంక్ డైరెక్టర్ లక్కినేని సురేందర్ రావు, సొసైటీ సీఈఓ, డైరెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.



దమ్మపేట : మండలంలోని అన్ని పంచాయతీ కార్యాలయాల్లో జాతీయ జెండాను ఆయా పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు ఎగరవేసి గణతంత్ర దినోత్సవ విశిష్టతను తెలియజేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఓ ఆర్‌సి హెచ్ నాగేశ్వరరావు, తహశీల్దార్ కార్యాలయంలో తాహసిల్దార్ ఎండి ముజాహిద్, పోలీస్ స్టేషన్లో ఏఎస్ఐ, జిసిసి కార్యాలయంలో మేనేజర్ సుగ్గల నరసింహారావు, దమ్మపేట సొసైటీ కార్యాలయంలో చైర్మన్ రావు జోగేశ్వరరావు, వివిధ కార్యాలయాల్లో సంబంధిత శాఖ అధికారులు జాతీయ జెండాను ఎగరవేసి గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అదే విధంగా పాఠశాలల్లో గణతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. విద్యార్థులు స్వాతంత్ర్య సమరయోదుల వేషధారణలో అలరించారు. విద్యార్థులు గణతంత్ర్య దినోత్సవ ప్రాముఖ్యతను ఉపాధ్యాయులు వివరించారు.



భద్రాచలం రూరల్ : టిఎన్జీవో ప్రెసిడెంట్ డేక్క నరసింహారావు, అసోసియేట్ అధ్యక్షులు కటుకూరి నాగభూషణం ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవం పురస్కరించుకొని స్థానిక టీఎన్జీవోస్ కార్యాలయం నందు జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా జనరల్ సెక్రటరీ గగ్గురి బాలకృష్ణ మాట్లాడారు. ప్రతి ఒక్క భారతీయ పౌరుడు రాజ్యాంగబద్ధంగా నడుచుకోవాలని తెలియజేశారు.



అశ్వాపురం : మండల కేంద్రంలోని ఎంపీడీవో, ఐకెపి తహశీల్దార్, ఎంఈఓ, ప్రభుత్వం జూనియర్ కళాశాల, పోలీస్ స్టేషన్, ఫారెస్ట్ కార్యాలయాలలో ఆయా శాఖల అధికారులు జెండాలను ఎగరవేసి గౌరవ వందనం చేశారు. అదేవిధంగా గౌతమి నగర్ కాలనీ, హెవీ వాటర్ ప్లాంట్‌లో జీఎం జగ్గారావు జెండాను ఎగరవేశారు. అశ్వాపురం, నెల్లిపాక సొసైటీ కార్యాలయాలలో ఆయా శాఖల అధికారులు జండాలను ఎగరవేశారు. దిశ కమిటీ ఆధ్వర్యంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షురాలు మద్దుల అన్న పూర్ణ జెండాను ఎగరవేసి గౌరవ వందనం చేశారు. ఈ కార్యక్రమాలలో తహశీల్దారు స్వర్ణలత, ఎంపీడీవో వరప్రసాద్, ఏపిఎం శ్రీరామ్ సత్యనారాయణ, సీఐ రవీం దర్, రమేష్, ప్రిన్సిపల్ సత్య ప్రకాష్, వీరస్వామి, అంగన్వాడీ టీచర్లు, సర్పంచులు పాల్గొన్నారు.



బూర్గంపాడు : మండల కేంద్రంలో బూర్గంపాడు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బి -బ్లాక్ మహిళా అధ్యక్షురాలు బర్ల నాగమణి ఆధ్వర్యంలో 75వ గణతంత్ర దినోత్సవాలు ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజ్యాంగ పితామహుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగ కృషి వల్లే స్వేచ్ఛ, సమానత్వం, లభించాయని ఆమె అన్నారు. అనంతరం బూర్గంపాడు కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పాలా భిషేకం చేసి పూలమాలలు వేసి ఆయనకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలోఉప సర్పంచ్ సాయి ప్రత్యూష, మండల మహిళా అధ్యక్షురాలు భూక్య సుగుణ, జిల్లా మహిళా కార్యదర్శి బోడ దివ్య, టౌన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మందా నాగరాజు, ప్రముఖ న్యాయవాది భజన సతీష్, యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.





ఆళ్ళపల్లి ఉద్యోగులకు ఉత్తమ ప్రతిభా పురస్కారాలు

నవతెలంగాణ-ఆళ్ళపల్లి





గణతంత్ర దినోత్సవం వేడుకలను పురస్కరించుకుని వారి వారి విధుల్లో ఉత్తమ ప్రతిభ చూపిన ఆళ్ళపల్లి మండలంలోని పంచాయతీ రాజ్ శాఖ ఇంఛార్జి, సీనియర్ అసిస్టెంట్ టి.వెంకటేశ్వరరావు, రెవెన్యూ శాఖ జూనియర్ అసిస్టెంట్ ఆర్.వెంకటేష్, వైద్య, ఆరోగ్య శాఖ ఈఎంఆర్ఐ విభాగం ఈఎంటి బండి భాగ్యమ్మ, పైలట్ పరమ శ్రీహర్షలకు శుక్రవారం కలెక్టర్ ప్రియాంక అలా చేతు ల మీదుగా పురస్కారాలు అందుకున్నారు. అవార్డు గ్రహీతలకు మండలంలోని సంబంధిత శాఖల అధికారులు, సహోద్యోగులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, మిత్రగణం అభినందనలు తెలిపారు. శ్రమకు తగిన ఫలితం లభించిందని అవార్డు గ్రహీతలు చెప్పారు.



సెయింట్ పాల్స్ నందు గణతంత్ర వేడుకలు

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

స్థానిక సెయింట్ పాల్స్ లూథరన్ పాఠశాలలో 75వ గణతంత్ర దినోత్సవ వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు విభిన్న రంగాలను ప్రతిబింబించేలా ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు డాక్టర్ కే.రాధా మంజరి, ప్రిన్సిపాల్ కే.అబ్రహం, ఈ వేడుక ప్రాధాన్యతను ఆవశ్యకతను విద్యార్థులకు, విచ్చేసిన తల్లిదండ్రులకు వివరించారు. ఈ నెల 17 నుండి 20వ తారీకు వరకు హర్యానాలోని ఫరీదాబాదులో జరిగినటువంటి ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్ 2024 కార్యక్రమంలో సెయింట్ పాల్స్ పదవ తరగతి విద్యార్థి ఎస్.కిషన్ ఆదర్శ ప్రాతినిధ్యం వహించాడు. విద్యార్థి అంతర్జాతీయ స్థాయికి చేరుకోవడానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులైనటువంటి డాక్టర్ కే.రాధా మంజరి, అహర్నిశలు శాస్త్ర విజ్ఞాన పరిశోధనకు సంబంధించిన విషయాల గురించి పరిశీలించి, శోధించి అనునిత్యం వాటిలోని నూతన విధివిధానాలను ఎల్లప్పుడూ విద్యార్థికి తెలియజేసి అంతర్జాతీయ స్థాయిలో పాఠశాల ప్రాతినిధ్యం వహించేలా కృషి చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ సమక్షంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు అందరూ కలిసి ప్రధానోపాధ్యాయులు అయినటువంటి డాక్టర్ కే.రాధా మంజరిని సత్కరించారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఖమ్మం-భద్రాద్రి కొత్తగూడెం
శనివారం | జనవరి 27, 2024 | www.navatelangana.com

ఇంటూరి శేఖర్‌పై సొసైటీ సంఘం సభ్యుల ఆగ్రహం..!

నవతెలంగాణ -కూసుమంచి

మండలంలోని చేగమ్మ సొసైటీ కార్యాలయంలో నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించిన అనంతరం. ఆ సొసైటీ చైర్మన్ ఇంటూరి శేఖర్‌పై ఆ సంఘం సభ్యులు శుక్రవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని జీళ్ళ చెరువు గ్రామానికి చెందిన ఓ వార్డు సభ్యునికి నిబంధనలకు విరుద్ధంగా సొసైటీలో అక్రమంగా రెగ్యులరైజ్ చేసిన ఘటనలో జరుగుతున్న విచారణలో అధికారిని తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపణపై వాగ్దానం చోటుచేసుకుందని తెలుస్తోంది.



ఆళ్ళపల్లిలో ఘనంగా గణతంత్ర దినోత్సవ సంబురాలు

నవతెలంగాణ - ఆళ్ళపల్లి

మండల కేంద్రంతో పాటు అనంతోగు, మర్కోడు, రాయిపాడు, పాతూరు, రామాంజిగూడెం, రాఘవాపురం, నడిమిగూడెం, బోడాయికుంట, పెద్ద వెంకటాపురం, అడవి రామారం, దొంగతోగు, తదితర గ్రామాల్లో శుక్రవారం 75 గణతంత్ర దినోత్సవ వేడుకలు వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు, వివిధ పార్టీల నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. అందులో భాగంగా మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ లంకపల్లి భద్రయ్య త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. అలాగే స్థానిక పోలీస్ ఠాణాలో ఎస్సై ఈ.రతీష్, మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో ఎంపీడీవో ఎం.రామారావు, అటవీ శాఖ రేంజ్ కార్యాలయంలో రేంజర్ కె.నరసింహారావు, ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యాధికారి అర్వపల్లి రేవంత్, కేజీబీవీలో స్పెషల్ ఆఫీసర్ వి.పద్మ జిన్నెలగూడెం గ్రామం జీపీఎస్ లో హెడ్ మాస్టర్ జోగా రాంబాబు, జాకారం గ్రామం ఎంపీపీఎస్ లో హెడ్ మాస్టర్ షేక్ మహమూద్ పాషా, అనంతోగు గ్రామం ఏజీహెచ్ఎస్ లో హెచ్.ఎం బి.భావుసింగ్, తునికిబండల గ్రామం జీపీఎస్ లో హెచ్.ఎం ఈ.నరేష్, పాతూరు గ్రామం పాఠశాలలో హెచ్.ఎం ఎం.చిరంజీవి, ఆళ్ళపల్లి హైస్కూల్ లో హెచ్.ఎం కె.శాంతారావు, ఎంపీపీఎస్ లో హెచ్.ఎం భూక్యా రమేష్, తదితర అధికారులు, ఉద్యోగులు తమ తమ ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ జెండాను ఆవిష్కరించి, పిల్లలకు, పెద్దలకు మిఠాయిలు పంచారు. ఆయా చోట్ల జరిగిన ఈ గణతంత్ర వేడుకల్లో ప్రజా ప్రతినిధులు, అధికారులు, నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

బగాది మురళికి ఉత్తమ ఉద్యోగి అవార్డు

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్



75వ గణతంత్ర దినోత్సవ సందర్భంగా కలెక్టర్ ఖమ్మం వారి చేతుల మీదుగా ఉత్తమ ఉద్యోగిగా అవార్డుగ్రహీత బగాది మురళి తీసుకున్న సందర్భంగా దేవాదాయ శాఖ ఉద్యోగులు అభినందనలు తెలియజేసారు. శ్రీదాసాంజనేయ స్వామి ఆలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న మురళి భక్తుల మన్నలు పొంది, దేవాదాయ శాఖ ఉద్యోగులలో మంచి పేరు తెచ్చుకున్న మురళికి ఈ రోజు ప్రభుత్వం గుర్తించి ఆయనకు ఉత్తమ ఉద్యోగి గా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు స్వీకరించారు. ఈసందర్భంగా పలువురి శ్రీదాసాంజనేయ ఆలయ అర్చకులు, సిబ్బంది, భక్తులు మురళిని అభినందించారు.

న్యాయవాదులకు ఆటల పోటీలు ప్రారంభం

నవతెలంగాణ-ఖమ్మం లీగల్

రిపబ్లిక్ డే ను పురస్కరించుకుని ఖమ్మం బార్ అసోసియేషన్ క్రీడల కార్యదర్శి రావుల వెంకట్ ఆధ్వర్యంలో శుక్రవారం నుండి ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం జరిగిన కబడ్డీ పోటీలలో విజేతగా వరుణ్ నాయక్ టీము గెలుపొందగా చార్లెస్ టీము రన్నర్ నిల్చినది. .విన్నర్ టీం నందు తాళ్ల వెంకటనారాయణ, దారావత్ ప్రసాద్‌లు అత్యధిక ప్రతిభ కనబరిచి గెలుపుకు దోహదం చేసినారని ఆర్గనైజర్ తన్నీరు పాపయ్య తెలిపారు.



జిల్లా కోర్టులో ఘనంగా రిపబ్లిక్ డే వేడుకలు

నవతెలంగాణ-ఖమ్మం లీగల్

గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఖమ్మం జిల్లా కోర్టులో జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దిరిశాల కృష్ణా రావు ఆధ్వర్యంలో రిపబ్లిక్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.ఎస్.జగ్జీవన్ కుమార్ హాజరై మువ్వన్నెల జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల నుండి గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు కె.ఉమాదేవి, కె.ఆశారాణి, మహ్మద్ అబ్దుల్ జావీద్ పాషా, ఆర్. శాంతిలత, కె.దీపా, వి.మాధవి, పి.గోపిక నాగ శ్రావ్య, సీనియర్, జూనియర్, మహిళా న్యాయవాదులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



బస్టాండ్‌ను తీర్చిదిద్దుతా...

- అశ్వారావుపేట శాసనసభ్యులు జారె ఆదినారాయణ

నవతెలంగాణ-చంద్రుగొండ

చంద్రుగొండ బస్టాండ్లో నెలకొన్న సమస్యల్ని తీర్చి, అందంగా తీర్చిదిద్దుతామని అశ్వారావుపేట శాసనసభ్యులు జారె ఆదినారాయణ అన్నారు. శుక్రవారం స్థానిక బస్‌స్టేషన్‌ను ఆయన అకస్మికంగా తనిఖీ చేశారు. బస్టాండ్లో చెత్త పడిఉండటం, పిచ్చి మొక్కలు పెరిగి ఉండటాన్ని గమనించి, వెంటనే జిల్లా పంచాయతీ అధికారి రమాకాంత్‌తో ఫోన్లో మాట్లాడారు. పంచాయతీ కార్యదర్శి స్థానికంగా ఉండటం లేదని గ్రామస్తులు సమస్యలు చెప్పిన పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశాడు. బస్టాండ్లో లోపించిన పారిశుధ్యంపై సరియైనా చర్యలు తీసుకోవాలన్నారు. దీనికి స్పందించిన డీపీఓ రమాకాంత్ తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చాడు. అక్కడ నుంచే కొత్తగూడెం ఆర్టీసీ డిపో మేనేజర్ వెంకటేశ్వరరావుతో ఫోన్లో మాట్లాడి బాగు చేయాలని ఆదేశించాడు. వారం రోజుల్లో పూర్తిస్థాయిలో మంచిగా చేస్తామని హామీ ఇచ్చాడు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట ఎంపీపీ బానోత్ పార్వతి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు దారం గోవిందరెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఉప్పతల ఏడుకొండలు, అంకిరెడ్డి కృష్ణారెడ్డి, తుమ్మలపల్లి సురేష్, బుంగ శ్రీను, సురేష్ పాల్గొన్నారు.

కుక్కల గుట్ట కబ్జాకు యత్నించిన వారిని అరెస్టు చేయండి

సీపీఐ(ఎం) మండల కార్యదర్శి ఎస్ నవీన్ రెడ్డి

నవతెలంగాణ-రఘునాథపాలెం



భూకబ్జాలు చేసిన అక్రమార్కులపై ఖమ్మం నగరంలో కొనసాగుతున్న అరెస్టులకు అనుగుణంగా, పుటాని తండా గ్రామపంచాయతీ, ఇర్లపూడి రెవెన్యూ పరిధిలోని, 100 సర్వేలో గల కుక్కల గుట్ట, భూములను, బీఆర్ఎస్ పార్టీ హయాంలో గుట్టను కబ్జాకు యత్నించిన వారిని అరెస్టు చేయాలని, సీపీఐ(ఎం) మండల కార్యదర్శి ఎస్.నవీన్ రెడ్డి, పుటాని తండా సిపిఎం పార్టీ నాయకులు, బానోతు, నాగేశ్వరరావు, గుగులోతు హరి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కుక్కల గుట్ట గ్రామానికి చెందిందని, కబ్జాదారులకి వ్యతిరేకంగా గ్రామ ప్రజలను కూడగట్టి సీపీఐ(ఎం) పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తున్న సందర్భంగా పోలీసులను ముందు పెట్టి నిర్మించడానికి గురి చేసే ప్రయత్నం ఆ నాటి పాలకులు చేశారని, వారు తెలియజేశారు. ఈ విషయమై వెంటనే ఖమ్మం జిల్లా మంత్రులు.. విచారణ జరిపించి, కబ్జాదారులపైన చర్యలు తీసుకోవాలని గుట్టను శాశ్వతంగా గ్రామ ప్రజలకే అప్పజెప్పాలని అన్నారు.

ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు



నవతెలంగాణ-నేలకొండపల్లి

గణతంత్ర దినోత్సవ వేడుకలను శుక్రవారం మండలంలోని వివిధ ప్రభుత్వ ప్రైవేటు కార్యాలయాలు, పాఠశాలలు, స్వచ్ఛంద సంస్థలు, వివిధ పార్టీల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. నేలకొండపల్లి తాసిల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ అనురాగబాయి, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో కే.జమలారెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఐకెపి కార్యాలయంలో ఏపీఎం అశోక్ రాణి, ఎన్ఎస్పి కార్యాలయంలో డీఈ మన్మధరావు, కార్యాలయంలో ఎస్టిఓ ఎన్వి కృష్ణారావు, మండల వ్యవసాయ కార్యాలయంలో వ్యవసాయ అధికారి దేశబోయిన అరుణకుమారి, మువ్వన్నెల జెండాను ఎగురవేశారు. నేలకొండపల్లి పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శి దేవేందర్ ఎక్సైజ్ కార్యాలయంలో సిఐ పోశెట్టి, పోలీస్ స్టేషన్లో ఎస్సై సతీష్, భక్త రామదాసు సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో సర్వీస్ సొసైటీ అధ్యక్షులు పాలడుగు పూర్ణచందర్ ప్రసాద్, నేలకొండపల్లి బి.ఆర్.ఎస్ పార్టీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు ఉన్నం బ్రహ్మయ్య, వివిధ గ్రామపంచాయతీ కార్యాలయాల్లో గ్రామ పంచాయతీల కార్యదర్శులు జాతీయ జెండాను ఎగరవేశారు. అనంతరం ఫిబ్రవరి 2 తేదీతో గ్రామపంచాయతీ సర్పంచులు పదవీకాలం ముగుస్తున్నందున తమ గ్రామాభివృద్ధికి సహకరించిన మండల అధికారులను మండలంలోని కొత్త కొత్తూరు గ్రామ సర్పంచ్ వల్లాల రాధాకృష్ణ గ్రామపంచాయతీ కార్యాలయానికి ఆహ్వానించి పాలకవర్గం తరఫున ఘనంగా సన్మానించారు. గ్రామపంచాయతీ సర్పంచ్‌గా వల్లాల రాధాకృష్ణ తమకు అన్ని విధాల సహకరించినందున ఎంపీడీవో కే. జమలారెడ్డి వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ మరికంటి ధనలక్ష్మి, ఎంపీపీ వజ్జా రమ్య, ఎంపీఓ శివ, ఈజీఎస్ ఏపీఓ ఆర్ సునీత, సూపరింటెండెంట్ బండి భాస్కర్ రావు, స్థానిక సర్పంచ్ రాయపూడి నవీన్ భక్తరాంధ్ర సర్వీసొసైటీ ప్రధాన కార్యదర్శి ఎలమద్ది లెనిన్, ఐకెపి సీసీ వెంకటేశ్వరావు, సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కె.వి.రామిరెడ్డి, నాయకులు గొడవర్తి నాగేశ్వరరావు, ఏటుకూరి రామారావు, కె.వి చారి టిఆర్ఎస్ నాయకులు నాగుబండి శ్రీనివాసరావు, మరికంటి రేణుబాబు, కోటి సైదారెడ్డి, నంబూరి సత్యనారాయణ, గొలుసు రవి, గ్రామ పంచాయతీల సర్పంచులు, సొసైటీ చైర్మన్లు, ఐకెపి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తిరుమలాయపాలెం మండలంలో

నవతెలంగాణ-తిరుమలాయపాలెం

మండలంలో ప్రభుత్వ కార్యాలయాలు ప్రభుత్వ పాఠశాలలో జూనియర్ కళాశాలలో 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో చుంచు శ్రీనివాస్, తాసిల్దార్ కార్యాలయంలో తాసిల్దార్ పిల్లి రాంప్రసాద్, స్థానిక పోలీస్ స్టేషన్లో ఎస్సై వరాల శ్రీనివాస్, వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయంలో వ్యవసాయ శాఖ అధికారి సీతారాం రెడ్డి, కస్తూరిబాయ్ పాఠశాలలో రమా కుమారి, పిండిప్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎస్ శ్రీనివాసరావు జాతీయ జండా లు ఎగరవేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ అధ్యక్షులు బోడ మంగీలాల్ నాయక్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షులు బోడ మంగీలాల్ నాయక్, జడ్పిటిసి బెల్లం శ్రీనివాస్, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యులు షేక్ సైపుద్దీన్, తాసిల్దార్ పిల్లి రాంప్రసాద్, స్థానిక ఎస్సై వరాల శ్రీనివాస్ పాల్గొన్నారు.



జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-ఖమ్మం

నగరంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం (సంజీవరెడ్డి భవనం)లో జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గా ప్రసాద్, నగర కాంగ్రెస్ అధ్యక్షులు మహమ్మద్ జావిద్ తో కలిసి మహాత్మ గాంధీ, డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు .అనంతరం త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఐన్టీయూసి సేవాదళ్, మైనారిటీ జిల్లా అధ్యక్షులు కొత్తా సీతారాములు,ఎస్డి గౌస్, సయ్యద్ ముజాహిద్ హుస్సేన్ రాష్ట్ర ఓబీసీ సెల్ నాయకులు వడ్డేబోయిన నరసింహరావు,



రాష్ట్ర మైనారిటీ నాబ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యర్రం బాలగంగాధర్ తిలక్, డిప్యూటీ మేయర్ జోహార్ ముక్తార్, కార్పొరేటర్లు మిక్కిలినేని మంజుల నరేందర్, మాజీ కౌన్సిలర్స్ పాలకుర్తి నాగేశ్వరరావు, కూల్ హోమ్ ప్రసాద్, జిల్లా కాంగ్రెస్ నాయకులు మద్దినేని రమేశ్, గజ్జెల్లి వెంకన్న, కామా అశోక్, తాళ్లూరి హనుమంతరావు, కల్లూరు సోమనాథం, గజ్జి సూర్యనారాయణ, నగర ఐఎన్‌టియుసి అధ్యక్షులు నరాల నరేష్, నగర కాంగ్రెస్ నాయకులు సంపుటం నరసింహారావు పాల్గొన్నారు.

తుమ్మల నాగేశ్వరరావు క్యాంప్ కార్యాలయంలో

రాష్ట్ర వ్యవసాయ, సహకార, చేనేత, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు క్యాంప్ కార్యాలయంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత 54వ డివిజన్ కార్పొరేటర్ మిక్కిలినేని మంజులా నరేందర్ జెండా ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు మహమ్మద్ జావేద్,జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సోజన్య, జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకులు సాధు రమేష్ రెడ్డి, నల్లమల వెంకటేశ్వరరావు, కొత్త సీతారాములు, మానుకొండ రాధా కిషోర్, తాళ్లూరి హనుమంతరావు, వడ్డేబోయిన నరసింహారావు పాల్గొన్నారు.

ఇంటింటా ఇన్నోవేటర్ విలేజ్ ఇన్నోవేషన్‌కు అవార్డుకు ఎంపికైన మండల రైతు

- రైతు ముల్లపూడి సత్యనారాయణను సన్మానించిన ప్రజా ప్రతినిధులు

నవతెలంగాణ-పినపాక



ఇంటింటా ఇన్నోవేటర్ విలేజ్ ఇన్నోవేషన్ అవార్డ్ - 2024ను పినపాక మండలం జానంపేటకు చెందిన ముళ్ళపూడి సత్యనారాయణ అనే రైతు అందుకున్నారు. ఈ అవార్డు తెలంగాణలోని 20 జిల్లాల్లోని 41 గ్రామాలలో ఇన్నోవేషన్ స్ఫూర్తితో గణతంత్ర దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఇన్నోవేషన్ సెల్ (టీఎస్ఐసీ) ఆధ్వర్యంలో అందిస్తూ ఉండగా మన మండలానికి ఈ అవార్డు వరించింది. జనంపేట గ్రామ పంచాయితీ పరిధిలో రైతుకు ఉపయోగపడే నూతన ఆవిష్కర్తకు గుర్తింపు దక్కింది. గణతంత్ర దినోత్సవం సందర్భంగా జనంపేట పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ సెక్రెటరీ నాగిని ప్రభుత్వం అందించిన ఈ అవార్డును రైతుకు ప్రదానోత్సవం చేశారు. గ్రామ ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో రైతును సన్మానించారు. రైతులకు ఉపయోగపడే విధంగా సులభంగా కలుపు తీసే యంత్రాన్ని కనిపెట్టినందుకు గాను రైతుకు అవార్డు లభించింది. అనంతరం రైతు సత్యనారాయణ మాట్లాడుతూ సేంద్రియ పద్ధతిలో వ్యవసాయాన్ని సైతం కొనసాగించి అనేక పంటలు సాగు చేస్తున్నట్లుగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం డైరెక్టర్ కామేశ్వరరావు, పంచాయతీ సిబ్బంది నరసింహారావు, జానంపేట ఉప సర్పంచ్ రాయల సత్యనారాయణ, రామచందర్ రాజు, మురళి, పేరం వెంకటే శ్వర్లు , రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

ఎగిరిన జాతీయ జెండా



నవతెలంగాణ-బూర్గంపాడు

గణతంత్ర దినోత్సవ వేడుకలను శుక్రవారం మండలంలో ఘనంగా నిర్వహిం చారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ తిరుమలచారి, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపిడివో వివేక్ రామ్, పోలీస్ స్టేషన్ ఎస్ఐ రాజ్ కుమార్, పంచాయితీ కార్యాలయాలల్లో సర్పంచులు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు, సొసైటీ కార్యాలయం ఆవరణలో సొసైటీ వైస్ చైర్మన్ ఆవుల నాగిరెడ్డి, బూర్గంపాడు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి పి.నిర్మల, మండల కేంద్రంలోని రైతు వేదికలో వ్యవసాయ శాఖ అధికారి శంకర్, బూర్గంపాడు ప్రింట్‌మీడియా ప్రెస్ క్లబ్లో ప్రెస్ క్లబ్ అధ్యక్షులు పండగ రాములు జాతీయ జెండాలను ఆవిష్క రించారు.అలాగే మోరంప ల్లిబంజరు పశువైద్య శాలలో వైద్యాధికారి రవీందర్, ఐకేపీ కార్యాలయంలో ఏపిఎం నాగార్జునలు జాతీయ జెండాలను ఎగురవేశారు. అనంతరం వారు మాట్లాడుతూ స్వాతంత్ర్యం తెచ్చిన మహానుభావుల గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు. మిఠాయిలను పంపిణీ చేశారు. వివిధ పాఠశాలల్లో విద్యార్థులకు ఆట పాటలను నిర్వహించి బహుమతులను అందిచారు. మండల కేంద్రంలోని స్థానిక న్యూ సెంచరీ హైస్కూల్లో గణతంత్ర దినోత్సవ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ఆశిక్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థి, విద్యార్థులతో కలిసి ప్రధాన వీధుల నందు జాతీయ సమైక్యత నినాదాలతో ర్యాలీ కొనసాగించారు. ఈ ర్యాలీ స్థానిక తహసీల్దార్ కార్యాలయం వరకు చేరుకుంది. ఈ ర్యాలీలో పలువురు విద్యార్థులు జాతీయ నాయకులు వేషధారణలతో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్ర మంలో జెడ్పిటిసి కామిరెడ్డి శ్రీలత, సర్పంచులు సిరిపురపు స్వప్న, ఎంపివో సునీల్ శర్మ, పిఆర్ఎఈ వెంకటేశ్వర్లు, ఏపివో విజయ లక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్ రాం నరేష్, ఆర్ఐలు నరసింహారావు, ముత్తయ్య, మాజీ ఎంఈఓ గంజి బాబు ఉపసర్పంచులు, గ్రామ పంచాయితీ సెక్రటరీలు, ప్రింటీమీడియా గౌరవ అధ్యక్షులు తోకల మోహన్ రావు, గౌరవ సలహాదారులు బిజ్జం వెంకట్రామిరెడ్డి, గుద్దేటి ప్రవీణ్ కుమార్, ప్రింట్ మీడియా కార్యదర్శి అజ్మీరా వెంకన్న, ఉపాధ్యక్షులు వెంకటరెడ్డి, కోశాధికారి జక్కిరెడ్డి మల్లారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ బర్ల జోషి, సభ్యులు గౌడపర్తి రాంబాబు, ఏఈవోలు రవితేజరెడ్డి, ప్రసాద్, నాగ వైష్ణవి, రెవిన్యూ సిబ్బంది, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, పోలీస్ సిబ్బంది. మాజీ ఎంపిటిసిలు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



రూరల్‌లో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-ఖమ్మం రూరల్

గణతంత్ర దినోత్సవంను మండలంలోని అన్ని గ్రామాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో శుక్రవారం జెండా పండగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు రామకృష్ణ, ఎంపీడీఓ రవీందర్ రెడ్డి, ఏసీపీ బస్వారెడ్డి, సీఐ రాజిరెడ్డి వారి, వారి కార్యాలయాల్లో జాతీయ జెండాను ఎగురవేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ బెల్లం ఉమ, అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



వేంసూరులో

గణతంత్ర వేడుకలను మండలంలో ఘనంగా నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయం నందు ఎంపీడీవో జి.రమేష్, తాసిల్దార్ కార్యాలయం నందు తాసిల్దార్ ఎం.ఏ రాజు, విద్యాశాఖ కార్యాలయం ఎంఈఓ సిహెచ్ వెంకటేశ్వరరావు, మండల వ్యవసాయ కార్యాలయం నందు ఏఓ రామ్మోహన్, ఏపిఎం శ్రీనివాస్, విద్యుత్ శాఖ కార్యాలయం నందు ఇంకా రావు పోలీస్ స్టేషన్ ఎస్ఐ సత్య ప్రసాద్, సహకార సంఘం నందు తక్కలపాటి గోపాలకృష్ణ తోపాటు ప్రభుత్వ ప్రైవేటు కార్యాలయం నందు గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉత్తమ సీపీగా అవార్డు అందుకున్న షబీర్‌ను మండల అధికారులు ప్రజాప్రతితులు అభినందించారు.

విద్యార్థులకు స్కూల్ బ్యాగులు వితరణ

నవతెలంగాణ-కూసుమంచి

గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం మండలంలోని జుజుల్ రావు పేట గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులందరికీ గ్రామ పెద్దలైన కంచర్ల జీవన్ రెడ్డి స్కూల్ బ్యాగులు వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం మరిన్ని బహుమతులు ఇస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పద్మ, ఎంపీటీసీ సుజాత, స్కూల్ చైర్మన్ నాగయ్య, ప్రధానోపాధ్యాయులు కృష్ణయ్య, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



ఉత్తమ వ్యవసాయ విస్తరణ అధికారిగా 'నాగ సాయి'

నవ తెలంగాణ - బోనకల్

మండల వ్యవసాయ విస్తరణ అధికారి, కలకోట క్లస్టర్ ఏఈఓగా విధులు నిర్వహిస్తున్న నాగినేని నాగసాయి ఉత్తమ వ్యవసాయ విస్తరణ అధికారిగా ఎంపికయ్యారు. ఈ మేరకు గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా ఖమ్మంలో శుక్రవారం జరిగిన వేడుకలలో జిల్లా కలెక్టర్ విపి గౌతమ్ నాగినేని నాగ సాయికి ఉత్తమ అవార్డుని, ప్రశంసా పత్రాన్ని అందజేశారు. నాగసాయి కలకోట క్లస్టర్ పరిధిలో ఏఈఓగా పనిచేస్తున్నప్పటికీ మండల వ్యాప్తంగా అన్ని గ్రామాలపై అవగాహన కలిగి ఉన్నాడు. వ్యవసాయ సీజన్ ప్రారంభం కాగానే అన్ని రకాల పంటలకు పిచికారి చేయవలసిన మందులను, ఏ రోగం వస్తే ఏ మందు పిచికారి చేయాలో రైతులను చైతన్యం చేయటంలో అగ్రభాగాన ఉన్నాడు. రైతులకు విశిష్టమైన సేవలు అందించినందుకు గాను నాగినేని నాగ సాయిని ఉత్తమ వ్యవసాయ విస్తరణ అధికారిగా ఎంపిక చేసినట్లు మండల వ్యవసాయ శాఖ అధికారిని సర్వశుద్ధి సరిత తెలిపారు. ఈ సందర్భంగా నాగినేని నాగ సాయికి సర్వశుద్ధి సరిత, ఎంపిపి కంకణాల సౌభాగ్యం, జడ్పిటిసి మోదుగు సుధీర్ బాబు, సహచర వ్యవసాయ విస్తరణ అధికారులు అభినందనలు తెలిపారు.

బాడీ ఫ్రీజర్ బాక్స్ వితరణ...

నవతెలంగాణ-ఖమ్మం రూరల్

మండల పరిధిలోని ఆరెకోడు పంచాయతీకి మృతదేహాన్ని భద్రపరిచే ఐస్ బాక్స్ (బాడీ ఫ్రీజర్ బాక్స్)ని అదే గ్రామానికి చెందిన చీమలదారి విశ్వనాధం శుక్రవారం వితరణగా అందజేశారు. గ్రామంలో ఎవరు మృతిచెందిన వారి దూరపు బంధువులు వచ్చే వరకు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు రూ.50 వేల విలువ గల బాడీ ఫ్రీజర్ బాక్స్ ను, గ్రామంలోని పల్లెదావాఖానకు వితరణగా అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెంకటనారాయణ, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్, గ్రామస్థులు పాల్గొన్నారు.



ఆకట్టుకున్న గురుకుల విద్యార్థుల నృత్యం

నవతెలంగాణ-కల్లూరు

స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు ఖమ్మం పెవిలిన్ గ్రౌండ్లో గణతంత్ర వేడుకల సందర్భంగా నిర్వహించిన నృత్య ప్రదర్శన పలువురుని ఆకట్టుకుంది. పాఠశాలకు చెందిన సుమారు 50 మంది విద్యార్థులు నయా జమేనా ఆయేగా అనే నృత్య రూపాన్ని ఆ పాఠశాల మ్యూజిక్ టీచర్ డాక్టర్ ప్రసన్న మాతృరత్న స్వయంగా రూపొందించి దర్శకత్వం వహించి ప్రదర్శించారు. విద్యార్థుల నృత్య రూపం జిల్లా కలెక్టర్ పివి గౌతమ్, ఎస్పీ తదితర ప్రముఖుల సమక్షంలో నిర్వహించడంతో వారు విద్యార్థులని అభినందించారు. పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన నృత్య గీతాన్ని తో ప్రతిభ చాటారు. విద్యార్థుల్ని ఉపాధ్యాయురాలని ఆర్ సి ఓ ప్రత్యూష, ప్రిన్సిపాల్ శ్రీలత ఉపాధ్యాయులు అభినందించారు.

ఆల్ పెన్షనర్స్ ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

భద్రాచలంలోని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్ అసోసియేషన్ భద్రాచలం డివిజన్ కార్యాలయం ముందు 75వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా అధ్యక్షులు బంధు వెంకటేశ్వరరావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పెన్షనర్లను ఉద్దేశించి మాట్లాడుతూ. ముందుగా గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు చల్లగుళ్ళ నాగేశ్వరరావు, గౌరవ అధ్యక్షులు ఎన్‌విఎస్ నారాయణ, డివిజన్ ప్రధాన కార్యదర్శి ఏఎస్ఎల్‌వి ప్రసాద్. గౌరవ అధ్యక్షులు వై మంగయ్య తదితరులు సభను ఉద్దేశించి ప్రసంగించారు. అనంతరం ప్రముఖ వైద్యులు డా. చల్లగుళ్ళ స్పందన. ప్రముఖ కవి రచయిత అయిన సోంపాక సీత, విశ్రాంత ఉపాధ్యాయిని లక్ష్మీ లలితను పెన్షనర్లు బొకేలతో పూలదండలతో శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ కుమార్, జగన్మోహనరావు, సుబ్బయ్య చౌదరి, రాజబాబు, డి.కృష్ణమూర్తి పాల్గొన్నారు.

కారేపల్లి హైస్కూల్‌లో డీఎస్ఆర్ టాలెంట్ హంట్

- విజేతలకు బహుమతులు అందజేసిన ప్రతినిధులు

నవతెలంగాణ-కారేపల్లి



డీఎస్ఆర్ టాలెంట్ హంట్ భాగంగా కారేపల్లి ప్రభుత్వ హైస్కూల్‌లో ఎమర్జీన్ కంపెనీ, రైతు సేవా ఆగ్రోస్, న్యూ అదిత్యసాయి ఎంటర్ ప్రైజస్, సహస్ర ఎంటర్ ప్రైజస్ ఆధ్వర్యంలో వ్యాసరచన, వకృత్వ పోటీలను నిర్వహించారు. ఆ పోటీలలో గెలుపొందిన విజేతలకు ఎమర్జీన్ పెస్టిసైడ్స్ కంపెనీ జోనల్ మేనేజర్ టీఎస్ చారి బహుమతులను శుక్రవారం అందజేశారు. విద్యార్థులతో దాగి ఉన్న సృజనాత్మకత, ప్రతిభను వెలికితీయటానికి డీఎస్ఆర్ టాలెంట్ హంట్ ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ సామినేని రాఘవులు, రైతు సేవా ఆగ్రోస్ ప్రతినిధులు కాటేపల్లి నవీన్, కాటేపల్లి కార్తీక్, కాటేపల్లి సామ్రాట్, చిన్ని ప్రవీణ్ కుమార్, డిఎస్ఆర్ గ్రూప్ సభ్యులు జి.రవికుమార్, బి తరుణ్, ఉపేందర్, రాంబాబు, ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.

సిమెంట్ బల్లలు ఏర్పాటు

నవతెలంగాణ-పెనుబల్లి

లయన్స్ క్లబ్ ఆఫ్ సప్తపది వీఎం బంజరు వారి ఆధ్వర్యంలో క్లబ్ సభ్యుడు పాస్ట్ ప్రెసిడెంట్ లయన్ శీలం మాధవరెడ్డి ఆర్థిక సహాయంతో యడ్లబంజరు గ్రామంలో రామాలయం వద్ద 6000 విలువ చేసే రెండు సిమెంట్ బల్లలను ఏర్పాటు చేశారు. జరిగింది. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ చైర్మెన్ అబ్దుల్ సలాం, ప్రెసిడెంట్ లయన్ పోట్రు వెంకటేశ్వరరావు, సెక్రటరీ లయన్ సుంకర సత్యనారాయణ, ట్రెజరర్ లయన్ పొన్నగంటి వినాయక ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పూలే విగ్రహం కోసం త్వరలో మహాధర్నా

రౌండ్ టేబుల్ సమావేశంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



నవతెలంగాణ- సిటీబ్యూరో

అసెంబ్లీ ఆవరణలో మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం ప్రతిష్టించాలన్న డిమాండ్‌తో త్వరలో మహాధర్నా చేస్తామని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. వివిధ రూపాల్లో ఉద్యమాన్ని ఉధృతం చేసి ప్రభుత్వంపై ఒత్తిడి చేస్తామని చెప్పారు. ఏప్రిల్ 11లోగా ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అసెంబ్లీ ఆవరణలో పూలే విగ్రహం కోసం భారత్ జాగృతి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో శుక్రవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. పలు రాజకీయ పార్టీలు, కుల సంఘాలు, ప్రజాసంఘాలు, మేధావులు, రచయితలు, ప్రొఫెసర్లు హాజరై మాట్లాడారు. ఎమ్మెల్సీ కవిత చేస్తున్న పోరాటానికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. 9 తీర్మానాలను ఆమోదించారు. పూలే విగ్రహాన్ని అసెంబ్లీ ఆవరణలో ఏర్పాటు చేయాల్సిందేనని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. అలాగే బీసీ రిజర్వేషన్ బిల్లును తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని, 8, 9, 10వ తరగతుల పాఠ్యపుస్తకాల్లో జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే జీవిత చరిత్రను పొందుపర్చాలని తీర్మానించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ.. రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు ఇచ్చిన సూచనలు, సలహాలను స్వీకరించి తదుపరి కార్యాచరణలో చేర్చుతామని తెలిపారు. అసెంబ్లీ ఆవరణలో పూలే విగ్రహం ఏర్పాటు కోసం రాజకీయ పార్టీలు ప్రభుత్వానికి లేఖలు రాయాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి జిల్లాలో, యూనివర్సిటీల్లో రౌండ్ టేబుల్ సమావేశాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే అసెంబ్లీ ఆవరణలో అంబేద్కర్ విగ్రహ ప్రతిష్టాపన కోసం పోరాటం చేసి సాధించామని గుర్తు చేశారు. బీసీల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను అమలు కోసం పోరాటం చేస్తామని ప్రకటించారు. మహిళా రిజర్వేషన్ల బిల్లు కోసం ఉద్యమించి సాధించామని, మహిళా రిజర్వేషన్లలో ఓబీసీ మహిళలకు కోటా కోసం చిత్తశుద్ధితో పని చేస్తున్నామని అన్నారు. పదేండ్లలో గత బీసీల కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.50 వేల కోట్లు ఖర్చు చేసిందని చెప్పారు. ప్రభుత్వంలో భాగస్వామ్యం అయినప్పటికీ నిఖార్సయిన ఎర్రజెండా స్ఫూర్తితో రౌండ్‌టేబుల్ సమావేశానికి హాజరైన సీపీఐకి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో పలు కార్పొరేషన్‌ల మాజీ చైర్మెన్‌లు వి.ప్రకాశ్, ఆంజనేయగౌడ్ దూదిమెట్ల బాలరాజు యాదవ్, బీఆర్ఎస్ నాయకుడు గట్టు రామచందర్‌రావు, సీపీఐ(ఎంఎల్) నాయకుడు సుభాష్, రచయిత సంఘిశెట్టి శ్రీనివాస్, పద్మశాలి సంఘం నాయకుడు శివశంకర్, ప్రొఫెసర్ తాటికొండ రాజయ్య, ఓయూ జేఏసీ నేత రాజారామ్ యాదవ్, సంచార జాతుల సంఘం ప్రొ. కోలా శ్రీనివాస్, సీపీఐ నేత బాలమల్లేశ్, సాహిత్య అకాడమీ మాజీ చైర్మెన్ జూలూరి గౌరీశంకర్, వడ్డెర సంఘం నాయకులు మురళీ, బీఎస్పీ నాయకులు అనితా రెడ్డి పాల్గొన్నారు.

ప్రతిష్ట పెరిగేలా పని చేయాలి

-డీ.ఎస్ చౌహాన్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పౌరసరఫరాల శాఖ పేరు ప్రతిష్టలు పెరిగేలా ప్రతి ఒక్కరూ పనిచేయాలని ఆ శాఖ కమిషనర్ డి.ఎస్. చౌహాన్ అన్నారు. తద్వారా రాష్ట్రంలో అన్ని శాఖల కంటే తమశాఖ ఆదర్శంగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు.శుక్రవారం హైదరాబాద్ లోని ఎర్రమంజిల్‌లోని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ ప్రధాన కార్యాలయంలో 75వ గణతంత్ర దినోత్సవం వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా చౌహాన్ జాతీయ జెండాను ఎగురవేశారు. క్షేత్ర స్థాయి సిబ్బంది మరింత అంకితభావంతో పనిచేయాలని కోరారు.

'నరకం'గా గాజా :డబ్ల్యూహెచ్ఓ చీఫ్

జెనీవా : గాజా పరిస్థితులు నరకంగా మారాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) డైరెక్టర్ జనరల్ టెడ్రోస్ అధనామ్ పేర్కొన్నారు. కాల్పుల విరమణే ఇజ్రాయెల్- పాలస్తీనా వివాదానికి శాశ్వత పరిష్కారమని స్పష్టం చేశారు. గాజా ఇప్పుడు నరకంగా మారిందని, శాంతియుతంగా పరిష్కరించుకోవాలని గాజా ఆరోగ్య అత్యవసర పరిస్థితులపై జరిపిన చర్చలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఇథియోపియాకు చెందిన టెడ్రోస్ చిన్నతనంలో స్వయంగా యుద్ధ పరిణామాలను ఎదుర్కొన్నారు. 1998-2000 మధ్య ఎరిత్రియాతో సరిహద్దు యుద్ధ సమయంలో ఆయన పిల్లలూ బంకర్లలో తలదాచుకున్న సందర్భాలు ఉన్నాయి.

ప్రస్తుతం గాజాలో నెలకొన్న పరిస్థితులను వివరిస్తూ ఆయన చిన్నప్పటి పరిస్థితులను గుర్తుచేసుకుని కన్నీటి పర్యంతమయ్యారు. ఘర్షణలు, ద్వేషం, ఆవేదన, విధ్వంసం తప్ప.. యుద్ధం ఎలాంటి పరిష్కారం ఇవ్వదని తన సొంత అనుభవంతో చెబుతున్నానని అన్నారు. అందుకే శాంతియుతంగా, రాజకీయంగా ఈ వివాదాన్ని పరిష్కరించుకుందామని అన్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే గాజాలో ఆకలి, వ్యాధులతో మరింత మంది చనిపోతారని టెడ్రోస్ అన్నారు. టెడ్రోస్ వ్యాఖ్యలు నాయకత్వ వైఫల్యానికి నిదర్శనమని ఐరాసలోని ఇజ్రాయెల్ రాయబారి మీరవ్ ఐలాన్ షహర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 2023 అక్టోబర్ 7న హమాస్ దాడి చేసినప్పటి నుంచి డబ్ల్యూహెచ్ఓ వైఖరి భిన్నంగా ఉందని విమర్శించారు.

న్యాయ వివాదాలను త్వరగా పరిష్కరించాలి

- డీఎడ్, బీఎడ్ అభ్యర్థుల సంఘం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఉద్యోగ నియామకాల్లో న్యాయ వివాదాలను త్వరగా పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర డీఎడ్, బీఎడ్ అభ్యర్థుల సంఘం అధ్యక్షులు రావుల రామ్మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టీఎస్‌పీఎస్సీ, గురుకుల బోర్డు నిర్వహించిన పలు ఉద్యోగాల పరీక్షల ఫలితాలు న్యాయవివాదాల్లో చిక్కుకుని పెండింగ్‌లో ఉన్నాయని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పలు నోటిఫికేషన్లు కోర్టు కేసుల్లో ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యాశాఖ, గురుకుల బోర్డు, టీఎస్‌పీఎస్సీ నోటిఫికేషన్లపై మహిళలకు సంబంధించి వర్టికల్, హారిజాంటల్ రిజర్వేషన్ల అంశం హైకోర్టులో పెండింగ్‌లో ఉందని పేర్కొన్నారు. దీంతో లక్షల మంది అభ్యర్థులు ఆందోళనలో ఉన్నారని తెలిపారు. కోర్టు కేసులను పరిష్కరించి వివిధ పరీక్షల ఫలితాలను వెల్లడించాలని కోరారు.

ఎస్‌సీఈఆర్టీలో 28 మంది తొలగింపు

- విద్యాశాఖ ఉత్తర్వులు విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి (ఎస్‌సీఈఆర్టీ)లో డిప్యూటేషన్, ఓడీ, విదేశీ సర్వీసులో ఉన్న 28 మందిని ప్రభుత్వం తొలగించింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. ఎస్‌సీఈఆర్టీలో ఫారిన్ సర్వీసులో ఉన్న వారు, రెండేండ్లకు పైగా డిప్యూటేషన్, ఓడీలను రద్దు చేస్తున్నట్టు విద్యాశాఖ ప్రకటించిన విషయం తెలిసిందే. అందులో భాగంగా డిప్యూటేషన్ లేదా ఓడీలో ఉన్న 28 మంది తొలగిస్తూ ఆదేశాలు జారీ చేశారు. వారు సొంత స్థానానికి వెళ్లాలని కోరారు.

ఇందులో 26 మందికి సంబంధించిన వివరాలను ప్రకటించారు. మరో ఇద్దరిని తొలగిస్తున్నట్టు వారికే సమాచారమిచ్చినట్టు తెలిసింది. రెండేండ్లలోపు డిప్యూటేషన్‌పై వచ్చిన ఆరుగురు కొనసాగుతున్నారు. ఎస్‌సీఈఆర్టీలో డిప్యూటేషన్ లేదా ఓడీ, విదేశీ సర్వీసులో ఉన్న వారు సుమారు 55 మంది వరకు ఉన్నట్టు సమాచారం. అక్కడ రెండేండ్లకు పైగా కొనసాగుతున్న మిగతా వారిని తొలగించే అవకాశమున్నది.

మోడీ సర్కార్‌కు ఇదో హెచ్చరిక...

- దేశవ్యాప్తంగా ఎస్‌కెఎం కిసాన్ ట్రాక్టర్ పరేడ్ విజయవంతం
- 27 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 484 జిల్లాల్లో కవాతు
- కార్పొరేట్ దోపిడీ అంతం, లౌకిక ప్రజాస్వామ్య రక్షణకు ప్రతిజ్ఞ
- ఎన్నికల వాగ్దానాన్ని ఉల్లంఘించి రైతులకు సర్కారు ద్రోహం
- దేశంలో ఎన్నడూ లేనంత రైతు వ్యతిరేక ప్రధాని మోడీ



నవతెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో

కార్పొరేట్ దోపిడీని అంతం చేయడానికి, వ్యవసాయాన్ని, దేశాన్ని రక్షించడానికి సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) పిలుపునిచ్చిన కిసాన్ ట్రాక్టర్, వాహన కవాతు దేశమంతటా రైతుల, కార్మికుల భాగస్వామ్యంతో విజయవంతంగా జరిగింది. ప్రతికూల పరిస్థితుల్లో ముఖ్యంగా ఉత్తర భారతదేశంలో పదివేల ట్రాక్టర్లు, ఇతర వాహనాలతో లక్షలాది మంది రైతులు కవాతులో పాల్గొన్నారు. 27 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 484 జిల్లాల్లో కవాతు జరిగింది. పంజాబ్, హర్యానా, కేరళ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర, ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ తదితర రాష్ట్రాల్లో ట్రాక్టర్, వాహన కవాతు విజయవంతమైంది. గణతంత్ర దినోత్సవం సందర్భంగా దేశభక్తితో ముందుకొచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేసిన రైతులు, కార్మికులకు ఎస్‌కేఎం అభినందనలు తెలిపింది.



పరేడ్‌లో పాల్గొన్నవారు మోడీ ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల, రైతు వ్యతిరేక విధానాలపై పోరాటాన్ని ఉధృతం చేస్తామని, రిపబ్లిక్ ఆఫ్ ఇండియా లౌకిక, ప్రజాస్వామ్య స్వభావాన్ని బలోపేతం చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. రైతు వ్యతిరేక, కార్మిక వ్యతిరేక, ప్రజా వ్యతిరేక విధానాలను అమలుచేస్తే ప్రజల విస్తృత, బలమైన ప్రతిఘటనను ఎదుర్కొంటుందని బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి ఒక హెచ్చరిక అని ఎస్‌కేఎం విమర్శించింది.

2021 డిసెంబర్ 9 నాటి రాతపూర్వక హామీని, అన్ని పంటలకు గ్యారెంటీ సేకరణతో పాటుగా సి2ప్లస్ 50 శాతంతో కూడిన ఎంఎస్‌పీ సహా రైతుల ఇతర ముఖ్యమైన డిమాండ్‌లను అమలుచేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఒత్తిడి చేయడానికి రైతుల పోరాటంలో ఇది భాగమని ఎస్‌కేఎం పేర్కొంది. రైతు, వ్యవసాయ కార్మికులకు సమగ్ర రుణమాఫీ, విద్యుత్ రంగ ప్రైవేటీకరణను నిలిపివేయడం, ప్రీ-పెయిడ్ మీటర్ల ఏర్పాటు నిలిపివేయటం, ఇన్‌పుట్‌ల ఖర్చు తగ్గించడం, ప్రభుత్వ నియంత్రిత సాధారణ, సార్వత్రిక పంటల బీమాను నిర్ధారించడం, లఖింపూర్ ఖేరీ రైతుల హత్యాకాండకు ప్రధాన కుట్రదారుడు కేంద్ర హోం వ్యవహారాల సహాయ మంత్రి అజయ్ కుమార్ మిశ్రా తొలగింపు, ప్రాసిక్యూషన్ చేయాలని డిమాండ్ చేసింది. ఎస్‌కేఎం ఇప్పటికే ఫిబ్రవరి 16న గ్రామీణ భారత్ బంద్‌కు పిలుపునిచ్చింది. ఆ రోజున కార్మిక సంఘాలు కూడా పారిశ్రామిక, సెక్టోరల్ సమ్మెకు పిలుపునిచ్చాయి. ఈ పోరాటాన్ని రాబోయే రోజుల్లో మొత్తం రాష్ట్రాలు, జిల్లాల వరకు గ్రామాల వరకు విస్తరించి, అన్ని డిమాండ్లను మోడీ ప్రభుత్వం నెరవేర్చే వరకు మరింత ఉధృతం చేస్తామని పేర్కొంది.

త తొమ్మిదేళ్లలో 14.64 లక్షల కోట్ల కార్పొరేట్ రుణాలను మాఫీ చేసినా ఒక్క రూపాయి కూడా రైతుల రుణమాఫీ చేయలేదని తెలిపింది.

ఇన్‌పుట్‌లకు సబ్సిడీల ఉపసంహరణ, ధరల పెరుగుదల వ్యవసాయంలో ఉత్పత్తి వ్యయం, రైతు కుటుంబాల రోజువారీ ఖర్చులను పెంచిందని పేర్కొంది. ఎంఎస్‌పి, రుణమాఫీ, ఏడాదికి 2 కోట్ల ఉపాధి హామీ ఎన్నికల వాగ్దానాన్ని ఉల్లంఘించి రైతులకు ద్రోహం చేసిన నరేంద్ర మోడీ, దేశంలో ఎన్నడూ లేనంత రైతు వ్యతిరేక ప్రధానమంత్రి అని ఎస్‌కెఎం పునరుద్ఘాటించింది.

మోడీని గద్దెదించాలి..దేశాన్ని కాపాడాలి

ఢిల్లీ ట్రాక్టర్ పరేడ్‌లో ఏఐకేఎస్ నేత హన్నన్ మొల్లా, ఏఐఏడబ్ల్యుయూ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ పిలుపు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక రైతాంగాన్ని మరింత దెబ్బతీసిందని ఏఐకేఎస్ నేత హన్నన్ మొల్లా, ఏఐఏడబ్ల్యుయూ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ విమర్శించారు. దేశ జీడీపీలో అగ్రభాగాన నిలుస్తున్న వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పే చట్టాలకు వ్యతిరేకంగా 2020లో కిసాన్ ఉద్యమాన్ని రైతులు ప్రారంభించారని తెలిపారు. 2021లో భారత రాజ్యాంగం అమలైన రోజున వేలాది ట్రాక్టర్లలతో మార్చ్ టూ పార్లమెంట్ నిర్వహించారని ఈ సందర్భంగా నాడు మోడీ ప్రభుత్వం రైతులపై దమనకాండకు పాల్పడిందని, ఈ సందర్భంగా రైతాంగాన్ని కాపాడాలని ప్రతి ఏడాది జనవరి 26న రైతుల కార్మికుల, కర్షకుల పరేడ్ నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ దేశ వ్యాప్తంగా జరుగుతున్న ట్రాక్టర్లు, వాహనాల పరేడ్ లో ఢిల్లీ సరిహద్దుల్లో జరిగిన ర్యాలీలో ఏఐకేఎస్ అఖిల భారత ఉపాధ్యక్షులు హన్నన్ మొల్లా, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ ఫల్వాల్ సరిహద్దుల్లో పాల్గొన్నారు. 21 కిలో మీటర్ల మేర ఈ పరేడ్ జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లడుతూ దేశంలో రానున్న ఎన్నికల్లో ఆరెస్సెస్ ఎజెండాతో నడుస్తున్న బీజేపీని, మోడీ ఫాసిస్టు చర్యలను ఓడించాలని అన్నారు.

మోడీ విధానాలు దేశంలో వ్యవసాయం వినాశనకర విధానాలుగా ఉన్నాయని, వ్యవసాయ రంగం పూర్తిగా కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. కొవిడ్ సమయంలో కూడా 30 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యాలు పండించారనీ, అలాంటి రైతాంగంపై మోడీ నిరంకుశత్వం వ్యవరిస్తున్నారని మండిపడ్డారు. రానున్న ఎన్నికల్లో దేశంలో మోడీని ఓడించాలని నేతలు పిలుపునిచ్చారు.

బీజేపీ విధానాలను తిప్పికొట్టండి

- సహకార రంగాన్ని కార్పొరేట్లకు అప్పగించేందుకు కుట్ర
- రైతులకిచ్చిన హామీని తుంగలో తొక్కి విద్యుత్ సవరణ బిల్లు
- కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 16న దేశవ్యాప్త బంద్ :ఎస్‌కేఎం కార్మిక సంఘాల నిరసన ర్యాలీలో వక్తలు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యవసాయ, కార్మిక వ్యతిరేక విధానాలను వెంటనే ఉపసంహరించుకోవాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. వాటిని తిప్పి కొట్టాలని కార్మిక, కర్షకులకు పిలుపునిచ్చారు. సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లోని ఆర్టీసీ క్రాస్ రోడ్స్ నుంచి ఇందిరాపార్క్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు భాస్కర్, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి టి.సాగర్, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం కార్యదర్శి పశ్యపద్మ మాట్లాడుతూ మోడీ సర్కార్ కార్పొరేట్లకు దేశసంపదను అప్పనంగా అప్పగించేందుకు వ్యవసాయ, కార్మిక రంగాలను నిర్వీర్యం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. 13 నెలల పాటు ఢిల్లీలో వీరోచితంగా పోరాటం చేసి, 750 మంది రైతుల ఆత్మబలిదానంతో సాధించుకున్న 3 వ్యవసాయ చట్టాలను పార్లమెంట్ సాక్షిగా రద్దు చేసారని వాపోయారు. వాటిని దొడ్డిదారిన అమలు చేసేందుకు ప్రయత్నిస్తున్నదని విమర్శించారు. మల్టీస్టేట్ కోఆపరేటివ్ సొసైటీ పేరుతో వ్యవసాయ, సహకార రంగాన్ని కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేసిందని విమర్శించారు. రైతులు, రైతు సంఘాలతో చర్చించకుండా విద్యుత్ సవరణ బిల్లును ప్రవేశ పెట్టబోమనే హామీని తుంగలో తొక్కిన పార్లమెంట్‌లో బిల్లును ఆమోదించిందని గుర్తు చేశారు. పెట్రోల్, డీజిల్ ధరల పెంపుతో నిత్యావసరాల ధరలు 35 నుంచి 50 శాతానికి పెరిగాయని విమర్శించారు. కనీస వేతనాలు అమలు చేయక పోవడం, పనికి ఆహార పథకానికి నిధులు తగ్గించడం తదితర విధానాలు పేదల పట్ల బీజేపీ వైఖరిని స్పష్టం చేస్తున్నాయని తెలిపారు. ప్రజా సమస్యలను పక్కదారి పట్టించేందుకు మతత్వాన్ని ప్రజల నరనరాల్లో ఎక్కించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మోడీ ఫాసిస్టు విధానాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. దేశాన్ని తిరోగమనంలోకి తీసుకెలుతున్న బీజేపీ ప్రభుత్వాన్ని గద్దెదింపేందుకు అందరూ కలిసిరావాలని కోరారు. 2024లో బీజేపీ మరోసారి అధికారం చేపడితే రాజ్యాంగానికి పెను ప్రమాదమని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఎస్‌కేఎమ్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 16న చేపట్టిన కార్మికుల సమ్మె, గ్రామీణ భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంతో పాటు ప్రతి పక్షాలు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

నిరసన కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్రప్రధాన కార్యదర్శి ఆర్. వెంకట్రాములు, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి బాలరాజు, వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి బాలమల్లేశ్, ఎస్‌కేమ్ నాయకులు రాయల చంద్రశేఖర్, ఎం.వెంకన్న, జక్కుల వెంకటయ్య, భిక్షపతి, కన్నెగంటి రవి, విస్సా కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరం నిర్మాణ అక్రమాలపై విచారణకు సిద్ధం

హైకోర్టులో సీబీఐ కౌంటర్

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణంలోని అక్రమాలపై దర్యాప్తుకు సిద్ధంగా ఉన్నామని సీబీఐ స్పష్టం చేసింది. హైకోర్టుగానీ, రాష్ట్ర ప్రభుత్వం గానీ ఆదేశిస్తే విచారణ చేస్తామని ప్రకటించింది. కాళేశ్వరం ప్రాజెక్టు దర్యాప్తుపై సీబీఐ హైకోర్టులో కౌంటర్ దాఖలు వేసింది. ఈ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేసింది. విచారణకు అవసరమైన వనరులు, సౌకర్యాలు ప్రభుత్వం కల్పించాలని అభిప్రాయపడింది. ఒక అదనపు ఎస్పీ, ముగ్గురు డీఎస్పీలు, ఆరుగురు ఇన్స్‌పెక్టర్లు, నలుగురు ఎస్‌ఐలతో పాటు ఇతర సిబ్బంది కావాలని కోరింది. సీబీఐ కౌంటర్‌ను పరిశీలించిన న్యాయస్థానం ఫిబ్రవరి రెండున మరోసారి విచారిస్తామంటూ తదుపరి విచారణను వాయిదా వేసింది. ఈ వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు తమకు ఎలాంటి సమాచారం లేదనీ, ఉత్తర ప్రత్యుత్తరాలు జరగలేదని హైకోర్టుకు తెలియజేసింది. కాళేశ్వరంలో అవినీతిపై దర్యాప్తు చేయాలని ఫిర్యాదు చేసినా సీబీఐ నుంచి స్పందన లేదని పేర్కొంటూ న్యాయవాది రామ్మోహన్ రెడ్డి హైకోర్టులో పిటిషన్ వేశారు.

దీనిపై సీబీఐ హైదరాబాద్ విభాగం హెడ్, ఐపీఎస్ అధికారి డీ కళ్యాణ్ చక్రవర్తి తన కౌంటర్ దాఖలు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు నిధులు రుణాలుగా ఇచ్చిన బ్యాంకుల కన్సార్షియం నుంచి సైతం ఎలాంటి ఫిర్యాదు అందలేదని హైకోర్టుకు తెలిపారు. కాళేశ్వరంలో అవినీతి జరిగిందన్న ఆరోపణలపై నేరుగా జోక్యం చేసుకుని దర్యాప్తు చేసే అంశంపై సీబీఐకి పరిమితులు ఉన్నాయనీ, దాన్ని దష్టిలో పెట్టుకుని ఫిర్యాదులపై స్పందించలేదని కౌంటర్‌లో పేర్కొన్నారు. పిటిషనర్ అందజేసిన ఫిర్యాదుపై పరిశీలన జరుపుతున్నామనీ, ఈ వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, రాష్ట్ర ప్రభుత్వ పాత్ర ఏంటనే విషయమై తేలాల్సి ఉందన్నారు.

కేవలం రాష్ట్ర ఉద్యోగులే ఉంటే నేరుగా జోక్యం చేసుకోవడానికి తమకు అవకాశం ఉండదని తెలిపారు. ఈమేరకు ఇటీవల సీబీఐ హైకోర్టులో కౌంటర్ పిటిషన్ వేసింది.

ఘనంగా గణతంత్రం

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

దేశ రాజధాని ఢిల్లీ కర్తవ్యపథ్‌పై మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. దేశ ప్రజలు గర్వించేలా భారత 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలు సాగాయి. పరేడ్ ఆద్యాంతం భారత నారీశక్తిని ప్రపంచ నలుమూలలకు చాటింది. కత్తితో కవాతు చేయడం మొదలు... సాంప్రదాయ బ్యాండ్లు వాయిస్తూ, రక్షణ వ్యవస్థలను లీడ్ చేస్తూ, రాష్ట్ర/కేంద్ర శకటాలను వివరిస్తూ, మోటర్ బైక్స్‌పై ఒళ్లు గగురుపొడిచేల విన్యాసాలు ఈ వేడుకలకే హైలెట్ గా నిలిచాయి. కాగా 40 ఏండ్ల తరువాత... గుర్రపు బగ్గీలో కర్తవ్య పథ్ చేరుకున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము... అనంతరం జాతీయ జెండా ఆవిష్కరించారు. ఈ సారి వేడుకలకు ముఖ్య అతిథిగా ఫ్రెంచ్ అధ్యక్షుడు ఇమాన్యూవల్ మాక్రాన్ హాజరుకాగా... ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్, ప్రధాని మోడీ, కేంద్ర మంత్రులు పాల్గొన్నారు. తొలిసారి 112 మంది మహిళా కళాకారులు భారతీయ సంగీత వాయిద్యాలను వాయిస్తూ.. పరేడ్‌ను ప్రారంభించారు. అనంతరం ప్రారంభమైన కవాతు దేశ నారీ శక్తిని చాటింది. తొలిసారి ఢిల్లీ పోలీస్, ట్రై సర్వీస్‌కు చెందిన డాక్టర్లు, నర్సులు, సెంట్రల్ ఆర్మ్‌డ్ ప్రొటెక్షన్ ఫోర్స్‌కు చెందిన మహిళా కంటెంజెంట్లు తమ పాటవాలను ప్రదర్శించారు. అలాగే త్రివిధ దళాలు, పారా మిలటరీ బలగాలు, ఢిల్లీ పోలీస్, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ కంటింజెంట్లకు మహిళలు నేతృత్వం వహించగా, వాళ్లు వాయించిన బ్యాండ్ అందర్నీ ఆకట్టుకుంది.

శక్తి సామర్థ్యాలు చాటేలా...

దేశ సత్తాను, సైనిక పాటవాలను చాటేలా త్రివిధ దళాలు భారత అమ్ముల పొదిలోని అత్యాధునిక ఆయుధాలు, యుద్ధ ట్యాంకులు, అణ్వాయుధాలను ప్రదర్శించాయి. నాగ్ మిస్సైల్ వ్యవస్థ, మొబైల్ మైక్రో వేవ్, బీఎంపీ 2/2, ఆల్ టెర్రియన్ వెహికల్స్, పణిక, సర్వత్ర మొబైల్ బ్రిడింగ్ సిస్టం సగర్వంగా ముందుకు సాగాయి. అలాగే సిగ్నల్ వ్యవస్థ, డ్రోన్ జామర్ సిస్టం, అడ్వాన్స్ రేడియో ఫ్రిక్వెన్సీ మానిటరింగ్ సిస్టం, సర్ఫేస్ ఎయిర్ మిజైస్ సిస్టం, మల్టీఫంక్షన్ రాడార్, మూడు అత్యాధునిక రుద్ర, ఒక ప్రచండ హెలికాప్టర్స్‌ను ఈ వేడుకల్లో ప్రదర్శించారు.

'మథర్ ఆఫ్ డెమోక్రసీ' థీంతో శకటాల ప్రదర్శన

'మథర్ ఆఫ్ డెమోక్రసీ' థీంలో భాగంగా మొత్తం 25 శకటాల కర్తవ్యపథ్‌పై సందడి చేశాయి. ఇందులో 16 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల శకటాలు, 9 కేంద్ర మంత్రిత్వ శాఖ శకటాలు ఉన్నాయి. ఇందులో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, లడఖ్, అరుణాచల్ ప్రదేశ్, హర్యానా, మణిపూర్, మధ్యప్రదేశ్, ఒడిసా, చత్తీస్‌గఢ్, రాజస్థాన్, మహారాష్ట్ర, గుజరాత్, మేఘాలయ, జార్ఖండ్, ఉత్తరప్రదేశ్‌లు ఉన్నాయి. చివరిలో 54 యుద్ధ విమానాలు, హెలికాప్టర్లు నింగిలో విన్యాసాలు చేశాయి.

ఇందులో మూడు ఫ్రెంచ్ ఎయిర్ ఫోర్స్, 46 ఇండియాన్ ఎయిర్ ఫోర్స్, ఒక నేవి విమానం, 4 హెలికాప్టర్లు ఉన్నాయి. ప్రచండ్, తంగైల్, అర్జున్, నేత్ర, వరుణ, భీమ్, అంరీట్, త్రిశూల్, అమత్, వజ్ రాంగ్, విజయ్, ఆకారంలో ఫైటర్ జెట్లు చేసిన విన్యాసాలు స్పెషల్ ఎట్రాక్షన్‌గా నిలిచాయి. ఇక చివర్లో రాఫేల్ యుద్ధ విమానం నేలకు నిటారుగా నింగిలోకి దూసుకుపోతు చేసిన విన్యాసం పరేడ్‌కే హైలెట్‌గా నిలిచింది.

ఈసారి ఇవే ప్రత్యేకతలు...

రాష్ట్రపతి బాడీ గార్డ్స్(అంగరక్షక్ అశ్వదళం రెజిమెంట్) 250 ఏండ్లు పూర్తి చేసుకోనున్న సందర్భంగా ...40 ఏండ్ల తర్వాత గుర్రపు బగ్గీలో పరేడ్‌కు హాజరైన ప్రెసిడెంట్ ముర్ము, ఆమె వెంటే వేదిక కర్తవ్య పథ్ చేరుకున్న ఫ్రెంచ్ ప్రెసిడెంట్ మాక్రాన్.

నారీశక్తి, క్షిత్ భారత్, భారత్ - లోక్‌తంత్రకి మాతృక వంటి ప్రధాన ఇతివత్తాలతో జరిగిన వేడుకలు.

'ఆవాహన్' మ్యూజికల్ ఇనిస్ట్రూమెంట్ తో 112 మంది ఉమెన్ ఆర్టిస్ట్‌ల ప్రదర్శన.

పరేడ్‌లో పాల్గొన్న తెలంగాణకు చెందిన ప్రధాని బాల పురస్కార్ గ్రహీత పెండ్యాల లక్ష్మీ ప్రియా.

తొలిసారి 144 మందితో పరేడ్‌లో పాల్గొన్న ఆర్మ్‌డ్ ఫోర్సెస్ మెడికల్ సర్వీసెస్ కంటెంజెంట్(త్రివిధ దళాలకు చెందిన డాక్టర్లు, నర్సులు)

కవాతులో తొలిసారి సత్తా చాటిన మహిళలతో కూడిన ఢిల్లీ పోలీస్ కంటెంజెంట్, బ్యాండ్ టీం. 'శాంతి, సేవా, న్యాయం' నినాదంతో సాగిన పరేడ్

తొలిసారి 148 మందితో కూడిన ఎన్‌సీసీ గర్ల్స్, 148 మందితో కూడిన ట్రై-సర్వీస్(గర్ల్స్ కంటింజెంట్, 200 ఫిమెల్ వాలీంటర్స్ తో ఎన్ఎస్ఎస్ మార్చింగ్ కంటెంజెంట్‌లు

ఈసారి మథర్ ఆఫ్ డెమోక్రసీ పేరుతో శకటాల ప్రదర్శన. 'డెమోక్రసీ ఎట్ ది గ్రాస్ రూట్స్' నినాదంతో తెలంగాణ శకటం ప్రదర్శన.

సందడిగా గవర్నర్ 'ఎట్‌హోం'

- సీఎం, డిప్యూటీసీఎం, పలువురు మంత్రుల హాజరు
- ఈసారీ దూరంగానే ప్రతిపక్ష బీఆర్ఎస్
- కనిపించని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీ ముఖ్యనేతలు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గణతంత్ర దినోత్సవ వేడుకుల సందర్భంగా హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో శుక్రవారం నిర్వహించిన ఎట్ హోమ్ కార్యక్రమంలో భాగంగా అతిథులకు గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ తేనీటి విందు ఇచ్చారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దంపతులు, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కొండా సురేఖ, ఎంపీలు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఆయా శాఖల ఉన్నతాధికారులు, తదితరులు హాజరయ్యారు. ప్రతిపక్ష బీఆర్ఎస్‌కు చెందిన ముఖ్యనేతలెవ్వరూ ఈ సారి కూడా ఈ కార్యక్రమానికి హాజరుకాలేదు. ఎమ్మెల్సీలు బండ ప్రకాశ్, గోరటి వెంకన్న మాత్రం హాజరయ్యారు. బీజేపీ నుంచి కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డితో పాటు ఆ పార్టీ ఎంపీలెవ్వరూ హాజరు కాలేదు. బీజేపీ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ప్రకాశ్‌రెడ్డి మాత్రం కనిపించారు. ఎట్‌హోం కార్యక్రమానికి హాజరైన వారిదగ్గరకెళ్లి మరీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ పలుకరించారు. తమిళిసై తండ్రి, తమిళనాడు పీసీసీ మాజీ అధ్యక్షులు, మాజీ ఎంపీ కుమారి అనంతన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్కతో పాటు మిగతా మంత్రులు కూడా ఆయన దగ్గరకెళ్లి పలుకరించారు.

హార్మోన్ల పనితీరు మెరుగవ్వాలంటే...


నెలసరి క్రమం తప్పడం, అలసట, అధికబరువు, ముఖంపై మొటిమలు, అవాంఛిత రోమాలు... ఇలా చెబుతూపోతే హార్మోన్ల అసమ తుల్యతకు సూచికలు చాలానే కనిపిస్తాయి. అయితే వీటిని సహజంగా సమన్వయం చేయాలంటే... పిండిపదార్థాలు, మాంసకృత్తులు, మంచి కొవ్వులు కలగలిసిన పోషకాహారాన్ని తీసుకోవాలి. అదేంటంటే..

- హార్మోన్ల పనితీరు సక్రమంగా ఉండాలంటే... సరైన పరిమాణంలో ఆరోగ్యకరమైన కొవ్వులు శరీరానికి అందాలి.
- రోజూ చెంచా చొప్పున ఇంట్లో తయారు చేసిన వెన్న/ నెయ్యిని తీసుకోండి. ఇందులోని ఎ, డి, ఇ, కె2 విటమిన్లు, మొక్కల ఆధారిత కొవ్వులుండే అవకాడో, ఆలివ్ నూనెల్నీ భాగం చేసుకోవాలి.
- గుడ్డులోని తెల్లసొనలను కనీసం రోజూ రెండు తినాలి.
- నాలుగైదు వాల్ నట్స్ తీసుకోవాలి. వీటిల్లోని ఒమేగా-3 ఫ్యాటీ ఆమ్లాలు, విటమిన్లు, ఖనిజ లవణాలు సహజంగా హార్మోన్ల పనితీరుని మెరుగుపరుస్తాయి. చర్మం, జుట్టును ఆరోగ్యంగా ఉంచుతాయి.
- గుమ్మడి, అవిసె, పొద్దు తిరుగుడు గింజలతో పాటు నువ్వులను రోజూ తినడం వల్ల హార్మోన్ల పనితీరు మెరుగ్గా ఉంటుంది.
- అలానే ఆహారంలో అన్ని రకాల కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు చేర్చుకోండి. అప్పుడే మీ బరువు అదుపులోకి వస్తుంది. పోషకాల లేమిని అధిగమించొచ్చు.
- హార్మోన్ల మెటబాలిజానికి కాలేయానిదే ప్రధాన పాత్ర. రోజూ గ్రీన్ టీ తాగడం వల్ల ఇది డీటాక్స్ అవుతుంది. ఒత్తిడి అదుపులో ఉంటుంది.
- ఇక జీర్ణవ్యవస్థ పనితీరూ హార్మోన్ల సమన్వయానికి కీలకమే. అందుకు మేలుచేసే బ్యాక్టీరియా మోతాదు ఒంట్లో పెరగాలి. దీని కోసం తప్పనిసరిగా పెరుగు, మజ్జిగ, ఇడ్లీ, దోశ తీసుకోండి.



భార్యాభర్తలు ఒకరి మాటకు ఒకరు విలువివ్వాలి. ఒకరినొకరు గౌరవించుకోవాలి. అలా కాకుండా ఇంట్లో ఒకరి మాటే చెల్లాలి అనుకోవడం సరైన పద్ధతి కాదు. అది భార్య అయినా భర్త అయినా ఒకరి నొకరు గౌరవించుకుంటేనే సంసారం సాఫీగా సాగుతుంది. అలా కాకుండా భర్త చెప్పింది వినడమే భార్య పనిలా ఉంటే అది సరైన సంసారం కాదు. అలా వినకపోతే ఆమె మంచి భార్య అనిపించుకునే హక్కు కోల్పోయినట్టుగా నేటి పురుషాధిక్య సమాజం భావిస్తుంది. భర్త ఏం చెప్పినా మారు మాట్లాడకుండా ఉండాలంటారు. కనీసం ఆమె అభిప్రాయం వినడానికి కూడా ప్రయత్నించరు. అలాంటి ఓ సమస్యతో బాధపడుతున్న ఓ మహిళ జీవితమే ఈ వారం ఐద్వా అదాలత్...

అతని మాటే శాసనమా..?



ఐద్వా అదాలత్ సెల్: 9490098024

నీరజ్, నీలిమాలది ప్రేమ వివాహం. వారి పెండ్లయి ఇప్పటికి 12 ఏండ్లు అవుతుంది. నీరజ్ చిన్న వ్యాపారం చేస్తున్నాడు. నీలిమా ఓ బట్టల షాపు చూసుకుంటుంది. అది ఇంటికి దగ్గరలోనే ఉంటుంది. వారికి ఓ పాప ఉంది. బాబును దత్తత తీసుకున్నారు. ఆర్థికంగా ఎలాంటి సమస్యలూ లేవు. నీరజ్‌కు ఓర్పు తక్కువ. ఏ పనైనా త్వరగా పూర్తి కావాలని అనుకుం టాడు. ఆయన పిలవగానే నీరజ ఏ పనిలో ఉన్నా సరే వెంటనే వచ్చి సమాధానం చెప్పాలి. ఉదయం అతను నిద్ర లేచే సరికి ఇంట్లో పనులు మొత్తం అయిపోవాలి. అతను లేవగానే కాఫీ ఇవ్వాలి. ఇల్లు మొత్తం నీట్‌గా ఉండాలి. అలా లేకపోతే అరుస్తాడు. ఈ మధ్య కొట్టడం కూడా మొదలు పెట్టాడు. దాంతో ఆమె ఇల్లు వదిలి వెళ్ళిపోయింది. అతను న్యాయం చేయమంటూ ఐద్వా లీగల్‌సెల్‌కు వచ్చాడు.

మేడమ్ 'నా భార్య అసలు నా మాట వినడం లేదు, మధ్యాహ్నం వచ్చే సరికి నాకు వంట కూడా చేసి పెట్టదు. నేను ఇంటికి వచ్చిన తర్వాత కూడా ఇంటికి రాదు. ఆమె వచ్చే సరికి రాత్రి 9 అవుతుంది. నేను 8 గంటలకే వచ్చేస్తాను. ఆమె వచ్చి వంట చేసి పెట్టేసరికి రాత్రి 10 అవుతుంది. మేము అప్పుడు తినాలి. పండగలు వస్తే మరీ ఆలస్యంగా వస్తుంది. ఎన్నిసార్లు చెప్పినా నా మాట పట్టించుకోదు. అందుకే రెండు దెబ్బలు వేశాను. దాంతో ఆమె ఇంట్లో నుండి వెళ్ళిపోయింది. ఇప్పుడు నాకు విడాకులు కావాలంటే నోటీసు పంపించింది' అంటూ చెప్పుకొచ్చాడు.

మేము నీలిమకు ఫోన్ చేసి పిలిపించి మాట్లాడితే "మేడమ్ మేము నాలుగేండ్లు ప్రేమించి పెండ్లి చేసుకున్నాం. పెండ్లయిన రెండేండ్ల వరకు పిల్లలు పుట్టలేదు. దాంతో ఒక బాబును దత్తత తీసుకున్నాం. బాబు వచ్చిన తర్వాత మాకు పాప పుట్టింది. ఇప్పుడు మేము ఇద్దరినీ చూసుకుం టున్నాం. ఆయన చిన్న వ్యాపారం చేస్తారు. నేను చిన్న బట్టల షాపు పెట్టుకు న్నాను. షాపు బాగా నడుస్తుంది. నాకు సాయంగా ఇంకా నలుగురు మనుషులను కూడా పెట్టుకున్నాను. దానితో పాటు ఈ మధ్య గాజుల షాపు కూడా పెట్టాను. రెండూ బాగా నడుస్తున్నాయి. పండగలు వచ్చినప్పుడు చాలా రద్దీగా ఉంటుంది. మాకు తినడానికి కూడా టైం ఉండదు. అలాంటి టైంలోనే కదా సంపాదించుకునేది.

నేను ఉదయం 5 గంటలకు లేచి ఇంట్లో పనులన్నీ పూర్తి చేసుకుంటాను. ఆ తర్వాతే షాపుకు వెళతాను. నీరజ్ ఇంట్లో ఒక్క పని కూడా చేయడు. పైగా ఆయన లేచే సరికి ఇంట్లో పనులు మొత్తం పూర్తి కావాలి. ఆయన బెడ్ దగ్గరకే కాఫీ అందించాలి. ఇల్లు మొత్తం నీట్‌గా ఉండాలి అంటాడు. పనమ్మాయిని పెట్టుకుందాం అంటే వినడు. నేను షాపు చూసుకోవాలి, ఇల్లూ చూసుకోవాలి. తనని సాయం చేయమని అడిగితే నాకు సలహాలు ఇచ్చే దానివయ్యావా అంటాడు. మా అత్తయ్య వాళ్ళు కూడా అంతే, పండగలకు వచ్చినప్పుడన్నా పిల్లల్ని చూసుకుంటారా అంటే అదీ లేదు. పైగా అది చేసి పెట్టలేదు, ఇది చేసి పెట్టలేదు అని గొడవ చేస్తారు. పిల్లలు స్కూల్ నుండి రాగానే ట్యూషన్‌కి వెళతారు. వాళ్ళు ట్యూషన్ నుండి రాగానే తినేసి షాపులో నాతో పాటు కూర్చొని మూసేసిన తర్వాత ఇంటికి వస్తారు. హోంవర్క్ ఏమైనా ఉంటే అక్కడే చేసుకుంటారు. లేకపోతే పడుకుంటారు.

నీరజ్ నా కంటే త్వరగా ఇంటికి వచ్చినా పిల్లలను కూడా చూసుకోడు. నేను తొమ్మిది గంటలకు వచ్చి రొట్టెలు చేసి ఇస్తే తింటాడు. టీవీ చూస్తూ కూర్చుంటాడు. నేను మాత్రం ఉదయానికి కావల్సిన కూరగాయలు కట్ చేయడం, గిన్నెలు కడగడం చేసి పడుకుంటాను. రాత్రి 11 అవుతుంది. ఉదయం వండిన అన్నం నీరజ్ తినడు. అందుకే మధ్యాహ్నం ఆయన కోసం మళ్ళీ వండుతాను. పండగలప్పుడు షాపులో రద్దీ ఎక్కువగా ఉంటుంది కాబట్టి ఒక రోజు నేను అన్నం వండటం లేటయ్యింది. అప్పటికి నేను రైస్ కుక్కర్‌లో బియ్యం కడిగి పెట్టాను. ఆయనకు ఫోన్ చేసి షాపులో కష్టమర్లు ఉన్నారు, కాస్త లేట్ అయితే కుక్కర్ స్విచ్ ఆన్ చేయండి అని చెప్పాను. దాంతో ఆయన షాపుకు వచ్చి అందరి ముందే నన్ను కొట్టాడు.

ఇంట్లో ఎలాగో నా మాటకు విలువ లేదు. షాపుకు వచ్చి కూడా అలా ప్రవర్తిస్తే ఎలా మీరే చెప్పండి? పైగా ఆయన 'ఇది నీకు నేను పెట్టించిన షాపు, దీన్ని చూసు కునే కదా నువ్వు ఇలా చేస్తు న్నావు. దీన్ని వదిలిపెట్టి వెళ్ళిపో' అన్నాడు. పిల్లలు కూడా అక్కడే ఉన్నారు. నాకు ఏమాత్రం విలువ ఇవ్వని మనిషితో ఎలా ఉండాలో మీరే చెప్పండి. 'పదే పదే నీవు నాకు వద్దు' అంటున్నాడు. ఇప్పుడు మీ దగ్గరకు వచ్చాడు. నేను ఎలాంటి నోటీసు పంపించ లేదు. ఇంటికి రమ్మని పిలిస్తే నేను రాను అని చెప్పాను. ఇప్పటికి నాలుగైదు సార్లు ఇలాగే చేశాడు. ఆయనకు ఇష్టం వచ్చినట్టు, ఆయన చెప్పినట్టుగా నేను ఉండాలి. నాకు ఆ ఇంట్లో ఏ మాత్రం విలువ లేదు. కనీసం నన్ను ఇంట్లో ఒక మాట కూడా మాట్లాడనివ్వడు. నేను ఆయనకు పనులు చేసి పెట్టే యంత్రాన్ని మాత్రమే. ఇప్పుడు మీరే నాకు న్యాయం చేయండి' అంటూ నీలిమా కన్నీరు పెట్టుకుంది.

దాంతో మేము నీరజ్‌తో 'మీ భార్య మీ కోసం ఇంత కష్టపడుతుంటే మీరు ఆమెకు విలువ లేకుండా చేస్తు న్నారు. ఆమెను ఓ మనిషిగా కూడా చూడడం లేదు. ఇంత సంపాదిస్తున్నారు ఇంట్లో ఓ పనమ్మాయిని పెట్టు కుంటే ఏమవుతుంది. పైగా మీరు కూడా ఒక్క పనిలో సాయం చేయరు. ఇది సరైన పద్ధతి కాదు. పగలంతా కష్టపడి మళ్ళీ ఇంటి పని మొత్తం చేసుకుంటూ ఆమె ఎంత అలసి పోతుందో ఆలోచించండి. అయినా ఆమె అన్నీ ఓపిగ్గా చేసుకుపోతుంది. నీకు ఇదేం పట్టడం లేదు. నీ మాటే చెల్లాలని అనడం కరెక్ట్ కాదు. ఇంకో సారి నీలిమపై చేయి చేసుకున్నా, ఇష్టం వచ్చినట్టు మాట్లాడినా పరిస్థితి వేరేగా ఉంటుంది' అని హెచ్చరించాము.

నీరజతో 'నీ భర్తకు ఒక అవకాశం ఇచ్చి చూద్దాం. అప్పటికీ అతనిలో మార్పు రాకపోతే నీ ఇష్టం వచ్చిన నిర్ణయం తీసుకో. దానికి మేము కూడా సపోర్ట్ చేస్తాం' అని చెప్పాము.



నీరజ్ కూడా మారతాననే చెప్పాడు. మూడు వారాల తర్వాత వచ్చి 'మేడమ్ నేను ఆమెపై మీకు కంప్లయింట్ ఇస్తే మీరే నాకు బుద్ధి చెప్పారు. నేను చేసిన తప్పు ఏమిటో నాకు తెలిసి వచ్చేలా చేశారు. ఇప్పుడు మేము చాలా సంతోషంగా ఉన్నాము. ఇంట్లో ఓ పనమ్మాయిని పెట్టుకున్నాం. నేను కూడా అవసరమై నప్పుడు నీరజకు సాయం చేస్తున్నాను. మా షాపును ఇంకా డెవలెప్ చేసుకుంటాము. ఇకపై పండగలపుడు నేను కూడా నీలిమకు షాపులో సాయంగా ఉంటాను' అని చెప్పి వెళ్ళిపోయాడు.

> 'మేడమ్ నేను ఆమెపై మీకు కంప్లయింట్ ఇస్తే మీరే నాకు బుద్ధి చెప్పారు. నేను చేసిన తప్పు ఏమిటో నాకు తెలిసి వచ్చేలా చేశారు. ఇప్పుడు మేము చాలా సంతోషంగా ఉన్నాము. ఇంట్లో ఓ పనమ్మాయిని పెట్టుకున్నాం. నేను కూడా అవసరమై నప్పుడు నీరజకు సాయం చేస్తున్నాను. మా షాపును ఇంకా డెవలెప్ చేసుకుంటాము. ఇకపై పండగలపుడు నేను కూడా నీలిమకు షాపులో సాయంగా ఉంటాను'

- వై. వరలక్ష్మి, 9948794051

మాతృత్వం మాధుర్యాన్ని పొందాలని ప్రతి స్త్రీ కోరుకుంటుంది. ఆ కోరిక ఒక్కటే ఉంటే చాలదు... గర్భం దాల్చిన దగ్గర నుంచి ఎవరికి వారు స్వీయ జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలి. గర్భాన్ని స్త్రీ కంటికి రెప్పలా కాపాడుకోవాలి. ఎంత జాగ్రత్త వహిస్తే సుఖ ప్రసవానికి అన్ని అవకాశాలు ఉంటాయి. పుట్టే బిడ్డ కూడా ఆరోగ్యంగా పుడుతుంది. అందుకోసం గర్భవతులు ముఖ్యంగా పాటించ వలసినవి, ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాల్సిన అంశాలు కొన్ని ఉంటాయి. అవేంటంటే...



గర్భిణుల కోసం...

- గర్భం ధరించిన తర్వాత బరువైన వస్తువులు మోయకూడదు. ఆరోగ్యానికి తగిన విశ్రాంతి తీసుకోవాలి.
- పుట్టబోయే బిడ్డ పూర్తి ఆరోగ్యంతో ఉండటానికి పౌష్టికాహారం, పాలు, పండ్లు వంటివి తప్పనిసరి తీసుకోవాలి.
- ఎప్పటికపుడు వైద్యులను సంప్రదిస్తూ వారు చెప్పిన మందులను క్రమం తప్పకుండా వాడాలి
- నెలలు నిండిన స్త్రీలు ఎక్కువగా ప్రయాణాలు చేయడం అంత శ్రేయస్కరం కాదు. ఒక వేళ తప్పనసరి పరిస్థితుల్లో చేయవలసి వస్తే కుదుపులు లేకుండా జాగ్రత్త వహిస్తూ ప్రయాణించాలి.
- వత్తిడి, భయానికి లోను కాకుండా చూసుకోవాలి.
- హైహీల్స్ వాడే అలవాటు ఉంటే నెలలు నిండే సమయంలో వాటికి దూరంగా ఉండటం శ్రేయస్కరం. వీటి వల్ల అదుపుతప్పి పడిపోయే ప్రమాదం ఉంటుంది. ఇది కడుపులోని బిడ్డకు ప్రమాదం.
- సుఖ ప్రసవం కోసం తేలికపాటి వ్యాయామాలు చెయ్యాలి.
- నిద్రపోయేటపుడు ఎడమ వైపు తిరిగి పడుకోవడం శ్రేయస్కరం.
- అలాగే ప్రసవం అయిన తర్వాత పుట్టిన బిడ్డకు తల్లి చనుబాలు ఇవ్వడమే ఉత్తమం. తల్లి పాల వల్ల బిడ్డలో రోగ నిరోధకశక్తి పెరుగుతుంది.

పదేండ్ల నియంతృత్వానికి చరమగీతం

(మొదటిపేజీ తరువాయి)

రూపొందిస్తోంది. గత పాలకుల నిర్వాకంతో ఆర్థిక పరిస్థితి చిన్నాభిన్నంగా మారినా, గాడి తప్పిన వ్యవస్థలన్నింటినీ, సంస్కరించే ప్రయత్నం చేస్తున్నాం. అభివద్ధిలో తెలంగాణ ప్రపంచంతో పోటీ పడేలా, సంక్షేమంలో సరికొత్త అధ్యాయాన్ని లిఖించేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం పట్టుదలతో ముందుకు సాగుతోంది.గడచిన పదేళ్ల పాలకుల వైఫల్య ఫలితంగా యువతకు ఉపాధి, ఉద్యోగాల విషయంలో పూర్తి నిర్లక్ష్యం జరిగింది. తెలంగాణ ఉద్యమ సారథులైన యువత విషయంలో గత ప్రభుత్వం పూర్తి నిర్దయగా, నిర్లక్ష్యంగా వ్యవహరించింది. టీఎస్పీఎస్సీ కొత్తగా పాలక మండలిని ఎంపిక చేశాం. తద్వార ప్రభుత్వ ఉద్యోగ ఖాళీల భర్తీ ప్రక్రియ మొదలవుతుంది. ఈ విషయంలో యువత ఎలాంటి అనుమానాలు, అపోహలకు లోను కావాల్సిన అవసరం లేదని తమిళిసై ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు. .

రైతులకిచ్చిన హామీలను అమలు పరుస్తాం

రైతుల విషయంలో ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంది. వరంగల్ డిక్లరేషన్ అమలుకు కార్యచరణతో పాటు, 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. రైతు భరోసా పథకాన్ని సంపూర్ణంగా అమలు చేయడానికి కసరత్తు జరుగుతోంది. ఇప్పటికే చిన్న సన్నకారు రైతుల ఖాతాలలో రైతు భరోసా నిధులు జమ చేశాం. రూ.2 లక్షల రుణమాఫీకి సంబంధించి బ్యాంకులతో సంప్రదింపులు జరుగుతున్నాయి. రైతులకు ఇచ్చిన మాట నూటికి నూరు శాతం నిలబెట్టుకుంటామని మరొక్కసారి హామీ ఇస్తున్నామని ఆమె తెలిపారు.

రికార్డు స్థాయిలో పెట్టుబడులు

రాష్ట్రానికి ఈ సారీ పెట్టుబడుల వరద కొనసాగింది. దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరంలో ఎన్నడూ లేని విధంగా రూ.40,232 కోట్ల మేర ఒప్పందాలు కుదుర్చుకోవడం తెలంగాణ పురోగమనానికి సంకేతం. ఈ ప్రయత్నం రాష్ట్రంలో పారిశ్రామిక వద్ధికి... తద్వారా ఉపాధి అవకాశాల కల్పనకు ఉపకరిస్తుందని విశ్వసిస్తున్నట్టు తెలిపారు.

ప్రజాస్వామ్య పునరుద్ధణ జరిగింది

తెలంగాణలో ప్రజాస్వామ్యం పునరుద్ధరణ జరిగింది. గత ప్రభుత్వం ఏనాడు సామాన్యులకు అందుబాటులో లేదు. కష్టమొస్తే ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి. పేదల కన్నీళ్ల తుడిచే నాథుడు లేని పాలన గతంలో చూశాం. మహాత్మ జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో ప్రతి మంగళ, శుక్రవారాలు ప్రజావాణి పేరుతో సమస్యలు వినేందుకు మంత్రులు అందుబాటులో ఉంటున్నారు. సచివాలయంలో సామాన్యులు సైతం వచ్చి ముఖ్యమంత్రిని, మంత్రులను కలిసి సమస్యలు చెప్పుకునే స్వేచ్ఛ వచ్చింది.ప్రజావాణి కార్యక్రమాన్ని కేవలం హైదరాబాదుకే పరిమితం చేయకుండా క్షేత్ర స్థాయిలో అమలు చేసేందుకు ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. అంబేద్కర్ స్ఫూర్తితో పేద, బడుగు, బలహీన వర్గాలు, గిజనులు, మైనారిటీ వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా ప్రజా పాలన దిశగా ఈ సర్కార్ అడుగులు వేస్తోంది. ఇదే స్ఫూర్తితో ఇక ముందు కూడా పాలన సాగాలని గవర్నర్ ఈ సందర్భంగా ఆకాంక్షించారు. రాజ్యాంగం కేవలం న్యాయవాదుల పత్రం కాదు, అది జీవితానికి వాహనం లాంటిది. దాని స్ఫూర్తి అందరికి ఆదర్శమనే అంబేద్కర్ చెప్పిన మాటలతో ప్రసంగాన్ని ముగించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, డీజీపీ రవి,గుప్తా, ఇతర అధికారులు పాల్గొన్నారు.

స్పీకర్‌కు సీఎం రేవంత్ పరామర్శ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. స్పీకర్ కొద్ది రోజుల క్రితం అనారోగ్యానికి గురయ్యారు. ఈ క్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి హైదరాబాద్ హైదర్‌గూడలోని న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌కు వెళ్లిన సీఎం... స్పీకర్ ఆరోగ్య పరిస్థితి గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన కుటుంబ సభ్యులతో కాసేపు ముచ్చటించారు.

బీజేపీ విధానాలపై సమరశంఖం

(మొదటిపేజీ తరువాయి)

జరిగిన ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయిన రైతు కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. ఫిబ్రవరి 16న దేశవ్యాప్త కార్మికుల సమ్మె- గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని నినాదాలు చేశారు. లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర అమలైనా లాభం రాదని, మద్దతు ధరకు చట్టం తేవాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయన్నారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సుల ప్రకారం కనీస మద్దతు ధర నిర్ణయించాలన్నారు. ప్రభుత్వ బ్యాంకుల నుంచి స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ద్వారా రైతులకు రుణాలు ఇవ్వాలని కోరారు.

ఖమ్మం కాల్వొడ్డు నుంచి జెడ్పీసెంటర్ వరకు ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాలతో ప్రదర్శన నిర్వహించారు. వ్యవసాయ రంగం సంక్షోభానికి కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల వైఖరే కారణమని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయం మీద ఆధారపడే రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కూలీలు సంక్షోభంలో ఉన్నారని, వ్యవసాయాన్ని ఆధారం చేసుకుని వ్యాపారం చేస్తున్న వాళ్ల లాభాల్లో ఉన్నారని తెలిపారు. ఏటా పదివేల మందికి పైగా రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారని, అవి పాలకులు చేస్తున్న హత్యలని ఆరోపించారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అమలు చేస్తామని ఎన్నికల ముందు మోడీ చెప్పి అధికారంలోకి వచ్చాక పట్టించుకోలేదన్నారు.

ఆదిలాబాద్, మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లా కేంద్రాల్లో రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. బైక్ ర్యాలీలు తీశారు. సంగారెడ్డిలోని ఐటీఐ నుంచి కలెక్టర్ ఆఫీస్ వరకు ట్రాక్టర్లు, బైకులతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనతంరం చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద సభ జరిపారు.

కార్మిక రైతు ప్రజావ్యతిరేక విధానాలను మానుకోవాలని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. రైతు చట్టాలపై కేంద్రం ఇచ్చిన హామీలను అమలు చేయాలని రైతు సంఘం ఆధ్వర్యంలో మిర్యాలగూడ పట్టణంలో ట్రాక్టర్, బైక్ ర్యాలీ నిర్వహించారు. నకిరేకల్ పట్టణంలో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. చిట్యాల మండల కేంద్రంలో రైతు సంఘం, సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ట్రాక్టర్, మోటార్ సైకిల్ ర్యాలీ తీశారు. యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో టాక్టర్స్, బైక్‌లతో భారీ ర్యాలీ నిర్వహించారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో, కోదాడ పట్టణంలో ట్రాక్టర్స్, ఆటో, మోటార్ సైకిళ్ల ర్యాలీ తీశారు.

కరీంనగర్ జిల్లా కేంద్రంలో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఫిబ్రవరి 16న దేశవ్యాప్త సమ్మెలో, గ్రామీణ బంద్‌లో కార్మిక, కర్షక ఐక్యత చాటి కేంద్ర ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని నేతలు పిలుపునిచ్చారు.పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలో నిరసన తెలిపారు. వనపర్తి జిల్లా కేంద్రంలో ట్రాక్టర్లు, ఆటోలు, బైక్‌లతో ర్యాలీ తీశారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో, నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో మోటార్ బైక్ ర్యాలీ నిర్వహించారు.

మద్యం మత్తులో రాష్ట్రం

(మొదటిపేజీ తరువాయి)

అమ్ముతుండగా, బెల్ట్ షాపుల్లో మాత్రం 24 గంటల పాటు అమ్ముతున్నారు.



ఏరులై పారుతున్న నకిలీ మద్యం

రాష్ట్రంలో నకిలీ మద్యం విచ్చల విడిగా వివిధ బ్రాండ్ల పేరుతో సొంతగా తయారు చేయడంతో పాటు ఇతర ప్రాంతాల నుంచి తీసుకొచ్చి అమ్మకాలు సాగిస్తున్నారు. అనధికారిక వ్యక్తులతో పాటు లైసెన్స్ పొందిన లిక్కర్ షాపు యజమానులు సైతం భారీ లాభాల కోసం ఈ బాట పడుతున్నారు. ఫలితంగా ఏది నకిలీదో ఏది అసలైనదో అర్థంకాక మద్యం ప్రియులు మోసపోతున్నారు. 2022 క్యాలెండర్ ఇయర్‌లో నకిలీ మద్యం, దేశీదారుకు సంబంధించి 579 కేసులు నమోదు కాగా 2023లో 1,874 చేరుకుని మూడు రెట్లు పెరిగాయి. 11,396 లీటర్ల మద్యాన్ని 2022లో అబ్కారీ అధికారులు పట్టుకోగా 2023లో 30,296 లీటర్ల లిక్కర్‌ను పట్టుకున్నారు.

ఆగని గుడుంబా విక్రయాలు

రాష్ట్రంలో గుడుంబా విక్రయాలు ఆగడం లేదు. ఎక్సైజ్ శాఖ ఎంత కఠినంగా వ్యవహరిస్తున్నా చాపకింద నీరులా సాగుతూనే ఉంది. తండాలు, పల్లెలు, ప్రధాన నగరాల్లోని మురికి వాడలు, బస్తీలు మొదలగు కొన్ని ప్రత్యేకమైన ప్రాంతాలు వీటికి గుడుంబాకు కేరాఫ్ అడ్రస్‌గా మారాయి. చిన్న చిన్న పాకెట్లలో నింపి యధేచ్ఛగా అమ్మకాలు సాగిస్తున్నారు. ఫలితంగా ఏటేటా కేసులు పెరుగుతూనే ఉన్నాయి. 2022 ఏడాదిలో 9,998 గుడుంబా కేసులు నమోదు కాగా 2023లో 22,274కు చేరుకున్నాయి. 50,239 లీటర్ల గుడుంబాను 2022లో అబ్కారీ శాఖ అధికారులు పట్టుకోగా 2023లో 1,38,039 లీటర్ల గుడుంబాను సీజ్ చేశారు.

మా వాళ్లలో కనిపించని అర్హతలు కోదండరాంలో కనిపించాయా?

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న దాసోజు శ్రవణ్, సామాజిక ఉద్యమాల్లో పాల్గొన్న కుర్రా సత్యనారాయణలో కనిపించని అర్హతలు టీజేఎస్ అధ్యక్షునిగా ఉన్న కోదండరాంలో ఏం కనిపించాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాష్ట్ర గవర్నర్ తమిళిసైని ప్రశ్నించారు. ఒక పార్టీకి అధ్యక్షునిగా ఉన్న కోదండరాంను ఎమ్మెల్సీగా ఎలా నామినేట్ చేస్తారంటూ ఆయన వ్యాఖ్యానించారు. గవర్నర్ పక్షపాతంగా వ్యవహరిస్తున్న తీరును రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని విమర్శించారు. ప్రజలిచ్చే జీతంతో గవర్నర్ పని చేస్తున్నారనే విషయాన్ని ఆమె గుర్తించాలని హితవు పలికారు. గవర్నర్ రేవంత్ రెడ్డికి బాధ్యులు కారు.. ప్రజలకు బాధ్యులనే విషయాన్ని మర్చిపోరాదని సూచించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కేటీఆర్ జాతీయ జెండాను ఎగురవేశారు. తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్, తెలంగాణ తల్లి విగ్రహాలకు పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాసోజు శ్రవణ్, సత్యనారాయణకు రాజకీయ సంబంధాలున్నాయనే కారణంతో వారి ఎమ్మెల్సీ అభ్యర్థిత్వాన్ని గవర్నర్ తిరస్కరించారని గుర్తుచేశారు. కాని అదే రాజకీయ సంబంధాలున్న కోదండరాం అభ్యర్థిత్వాన్ని మాత్రం ఆమోదించారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీజేపీ ఫెవికాల్ బంధానికి ఇదే ప్రత్యక్ష నిదర్శనమని ఎద్దేవా చేశారు. ఆ రెండు పార్టీలు కుమ్మక్కయ్యాయని విమర్శించారు. ప్రజల తరపున ఎన్నికైన సర్పంచుల పదవీ కాలాన్ని పొడిగించాలని ఆయన డిమాండ్ చేశారు. అంతే తప్ప ప్రత్యేక ఇన్‌ఛార్జీలను నియమించవద్దని సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి అహంకారం, వెకిలి వ్యవహారాలు సరికావని అన్నారు. ఆయన ఇంకా ప్రతిపక్ష నాయకుని తరహాలోనే మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. అధికారంలో ఉన్నప్పుడు సంయమనంతో, ఓపికతో వ్యవహరించాలని సూచించారు. కాంగ్రెస్‌కు చేతనైతే ఎన్నికల్లో 420 హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆయా హామీల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు కాంగ్రెస్ రకరకాల ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించారు. ఇలాంటి చర్యలను తిప్పికొట్టాలని బీఆర్ఎస్ కార్యకర్తలకు ఆయన పిలుపునిచ్చారు.

మాజీ హోంమంత్రి మహమూద అలికి అస్వస్థత

తెలంగాణ భవన్‌లో నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న మాజీ హోంమంత్రి మహమూద్ అలి స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. ఆయన జెండావిష్కరణ సమయంలో తూలి కింద పడిపోయారు. అక్కడున్న నాయకులు, కార్యకర్తలు ఆయన్ను వెంటనే ఆస్పత్రికి తరలించారు. సాయంత్రానికి ఆయన ఆరోగ్యం కుదుటపడ్డట్టు బీఆర్ఎస్ వర్గాలు తెలిపాయి.

టీఎస్‌పీఎస్సీ చైర్మెన్‌గా మహేందర్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ

(మొదటిపేజీ తరువాయి)

సభ్యులు ఆర్ సత్యనారాయణ, ప్రొఫెసర్ బండి లింగారెడ్డి, కారం రవీందర్‌రెడ్డి అదేనెల 13న రాజీనామాలు చేసిన విషయం తెలిసిందే. వాటిని ఈనెల 10న గవర్నర్ ఆమోదించారు. ఈనెల 19న మరో సభ్యురాలు సుమిత్రా ఆనంద్ తనోబా రాజీనామా చేశారు. గత ప్రభుత్వం నియమించిన కోట్ల అరుణకుమారి మాత్రమే సభ్యురాలిగా కొనసాగుతున్నారు. ఆమెతో కలిపి టీఎస్‌పీఎస్సీలో ఆరుగురు సభ్యులున్నారు. ఇంకా నలుగురు సభ్యులను నియమించడానికి అవకాశమున్నది. కాగా ఇద్దరు సభ్యులు అమీర్ ఉల్లాఖాన్, యరబాది రామ్మోహన్‌రావు ప్రమాణస్వీకారం చేయాల్సి ఉన్నది.

ఇండియా బ్లాక్‌తోనే ఉన్నాం..

(మొదటిపేజీ తరువాయి)

ప్రతినిధులతో కుస్వాహా అన్నారు. 'నిన్నటి మాదిరిగానే ఈ రోజు కూడా ముఖ్యమంత్రిని కలిసాను. అలాగే చక్కర్లు కొడుతున్న పుకారుల్లో ఎలాంటి నిజం లేదు. అలాగే పార్టీ ఎమ్మెల్యేలను పాట్నాకు రమ్మని కోరినట్లుగా వచ్చిన పుకార్లను కూడా మేం తిరస్కరిస్తున్నాం' అని కుస్వాహా తెలిపారు. శుక్రవారం రిపబ్లిక్ పరేడ్‌లో ముఖ్యమంత్రి నితీష్‌కుమార్, ఉపముఖ్యమంత్రి తేజస్వి యాదవ్ దూరంగా, దూరంగా కూర్చోవడాన్ని కుస్వాహా తెలిగ్గా తీసుకున్నారు. ఇండియా బ్లాక్‌తో కలిసే ఉన్నామని అన్నారు. 'అయితే వేదికలోని కాంగ్రెస్ పార్టీ ఇతర పార్టీలు, సీట్ల సర్దుబాటుపై ఆత్మ విమర్శ చేసుకోవాలని మేం కోరుకుంటున్నాం. త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికలపై దృష్టి పెట్టేందుకు వీలుగా సీట్ల పంపకాల ఒప్పందాన్ని త్వరగా ఖరారు చేయాలని మా నాయకులు నితీష్ కుమార్ చాలా కాలంగా ప్రస్తావిస్తున్నారు' అని కుస్వాహా పేర్కొన్నారు. అలాగే, ఇండియా వేదికలో సీట్ల పంపకంలో జాప్యం గురించి విలేకరులు ప్రశ్నించగా, 'బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏను ఇలాంటి ప్రశ్నలు ఎవ్వరూ ఎందుకు అడగరు?' అని ప్రశ్నించారు.

తెలంగాణ బలం, గళం వినిపించండి

(మొదటిపేజీ తరువాయి)

విషయాలు చర్చించామని, కేసీఆర్ అనేక విషయాలను చర్చించినట్టు వారు తెలిపారు. ప్రజల పక్షాన ఉండి పోరాటం సాగిస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు అన్యాయం చేస్తోందని ఎంపీలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో మాజీ మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్, కవిత, దయాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అన్ని అంశాలను లేవనెత్తుతాం
- నామా నాగేశ్వర్

తెలంగాణకు సంబంధించిన అన్ని అంశాలను పార్లమెంట్‌లో లేవనెత్తుతాం. కేంద్రం నుంచి తెలంగాణకు రావాల్సిన వాటాలు, కృష్ణా బేసిన్‌లో జరుగుతున్న పెండింగ్ అంశాలు, రాష్ట్రానికి అన్యాయం జరుగుతున్న అన్ని విషయాలనూ లేవనెత్తుతాం.

తెలంగాణ గళం వినిపిస్తాం
- రంజిత్ రెడ్డి, దయాకర్

పార్లమెంట్ పార్టీ మీటింగ్‌లో రాబోయే ప్రెసిడెన్సియల్ అడ్రస్, ఓట్ ఆన్ ఎకౌంటు అంశాలపై చర్చించాం. పార్లమెంట్‌లో తెలంగాణ గళం వినిపించేది బీఆర్ఎస్ ఎంపీలే. తెలంగాణ సత్ఫలితాలపై దిశా నిర్దేశం చేయడం జరిగింది. విభజన చట్టంలో పొందుపరిచిన విషయాలపై చర్చించాలి. బీసీ జనగణన, ఎస్సీ వర్గీకరణ, ప్రజల పక్షాన ఉండి ప్రజల కోసం మాట్లాడాలని కేసీఆర్ దిశా నిర్దేశం చేశారు.

మండలిలో ఘనంగా గణతంత్ర వేడుకలు

- జాతీయ జెండా ఆవిష్కరించిన చైర్మెన్ గుత్తా

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

శాసన మండలిలో శుక్రవారం గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. మండలి ఛైర్మెన్ గుత్తా సుఖేందర్ రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. వివిధ రంగాల్లో పద్మ అవార్డులు పొందిన తెలుగు వారికి ఈ సందర్భంగా ఆయన అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, డిప్యూటీ చైర్మెన్ బండ ప్రకాష్‌తో పాటు పలువురు ఎమ్మెల్సీలు, మండలి కార్యదర్శి నర్సించార్యులు, సలహాదారులు ప్రసన్న కుమార్, తదితరులు పాల్గొన్నారు .

ఉప్పల్ టెస్టులో ఆతిథ్య భారత్ పట్టు బిగించింది. కెఎల్ రాహుల్ (86), రవీంద్ర జడేజా (81 బ్యాటింగ్), యశస్వి జైస్వాల్ (80) అర్థ సెంచరీలతో కదం తొక్కటంతో తొలి ఇన్నింగ్స్‌లో భారత్ భారీ స్కోరు దిశగా సాగుతోంది. రెండో రోజు ఆటలో 302 పరుగులు చేసింది. టాప్ ఆర్డర్‌లో జైస్వాల్, మిడిల్ ఆర్డర్‌లో కెఎల్ రాహుల్, లోయర్ ఆర్డర్‌లో రవీంద్ర జడేజా దంచికొట్టారు. దీంతో తొలి ఇన్నింగ్స్‌లో టీమ్ ఇండియా ప్రస్తుతం 175 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది. ఇంగ్లాండ్ స్పిన్నర్లు మాయ చేయలేకపోయారు. రెండో రోజు ఆటలో 87 ఓవర్లలో ఆరు వికెట్లు మాత్రమే పడగొట్టారు. నేడు ఉదయం సెషన్లో వీలైనన్ని ఎక్కువ పరుగులు సాధించి..ఇంగ్లాండ్‌పై మరింత ఒత్తిడి పెంచే వ్యూహంలో రోహిత్‌సేన ఉంది!.

పట్టు బిగించారు

రాహుల్, జడేజా అర్థ సెంచరీలు | రాణించిన తెలుగు తేజం భరత్

• భారత్ తొలి ఇన్నింగ్స్ 421/7 • ప్రస్తుత ఆధిక్యం 175 పరుగులు

భారత్, ఇంగ్లాండ్ తొలి టెస్టు రెండో రోజు





నవతెలంగాణ-హైదరాబాద్

కెఎల్ రాహుల్ (86, 123 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్స్‌లు), రవీంద్ర జడేజా (81 బ్యాటింగ్, 155 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్థ సెంచరీలతో చెలరేగారు. కెఎల్ రాహుల్ ఇంగ్లాండ్ పేసర్, స్పిన్నర్లను చెడుగుడు ఆడుకోగా.. రవీంద్ర జడేజా ఆల్‌రౌండ్ ప్రదర్శన చేశాడు. తెలుగు తేజం శ్రీకర్ భరత్ (41, 81 బంతుల్లో 3 ఫోర్లు) సైతం ఆకట్టుకునే ఇన్నింగ్స్ నమోదు చేశాడు. అక్షర్ పటేల్ (35 బ్యాటింగ్, 62 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్) రెండో రోజు ఆటకు అదిరే ముగింపు అందించాడు. బ్యాటర్లు అందరూ రాణించటంతో తొలి ఇన్నింగ్స్‌లో భారత్ భారీ స్కోరు దిశగా సాగుతోంది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి 110 ఓవర్లలో 7 వికెట్లకు 421 పరుగులు చేసింది. ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 246 పరుగులకు కుప్పకూలగా.. భారత్ ప్రస్తుతానికి తొలి ఇన్నింగ్స్‌లో 175 పరుగుల భారీ ఆధిక్యంలో నిలిచింది. ఇంగ్లాండ్ బౌలర్లలో టామ్ హార్ట్లీ, జో రూట్ రెండేసి వికెట్లు పడగొట్టగా.. జాక్ లీచ్, రెహాన్ అహ్మద్ చెరో వికెట్ ఖాతాలో వేసుకున్నారు. ఏకైక పేసర్ మార్క్‌వుడ్‌కు వికెట్ దక్కలేదు.

రాహుల్ జోరు : భారత్ 222/3

ఓవర్‌నైట్ స్కోరు 119/1తో రెండో రోజు బ్యాటింగ్ మొదలుపెట్టిన టీమ్ ఇండియాకు తొలి గంట ఆట కలిసి రాలేదు. అజేయ అర్థ సెంచరీతో ధనాధన్ దూకుడు మీదున్న యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ (80) ఎంతోసేపు నిలువలేదు. పార్ట్‌టైమ్ స్పిన్నర్ జో రూట్‌కు రిటర్న్ క్యాచ్‌తో పెవిలియన్‌కు చేరాడు. మరో ఎండ్‌లో శుభ్‌మన్ గిల్ (23) సైతం నిరాశపరిచాడు. తొలి రోజు ఆటలోనే నెమ్మదిగా ఆడిన శుభ్‌మన్.. రెండో రోజు ఉదయం వికెట్ కోల్పోయాడు. దీంతో డ్రింక్స్ విరామం లోపే టీమ్ ఇండియా ఇద్దరు బ్యాటర్లను కోల్పోయింది. కానీ కెఎల్ రాహుల్ (86) దూకుడుతో భారత్ మళ్లీ జోరందుకుంది. వేగంగా పరుగులు సాధించిన రాహుల్.. ఆరు ఫోర్లతో 72 బంతుల్లోనే అర్థ సెంచరీ నమోదు చేశాడు. మరో ఎండ్‌లో శ్రేయస్ అయ్యర్ (35, 63 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్) చక్కటి సహకారం అందించాడు. దీంతో లంచ్ విరామ సమయానికి భారత్ మంచి స్థితిలో నిలిచింది. 222 పరుగులు చేసి ఇంగ్లాండ్ ఇన్నింగ్స్‌కు చేరువైంది. ఇంగ్లాండ్ సైతం తొలి సెషన్లో వరుస వికెట్లతో రేసులోకి వచ్చే ప్రయత్నం చేసింది. 27 ఓవర్లలో భారత్ 103 పరుగులు చేసింది.

జడేజా మెరుపుల్ : భారత్ 309/5

లంచ్ విరామం అనంతరం పరుగుల వేగం నెమ్మదించింది. శ్రేయస్ అయ్యర్ (35) మూడు ఫోర్లు, ఓ సిక్సర్‌తో జోరు చూపించాడు. క్రీజులో కుదురుకున్నట్టే కనిపించిన శ్రేయస్ అయ్యర్.. రెహాన్ అహ్మద్‌కు వికెట్ కోల్పోయాడు. రాహుల్, అయ్యర్ 106 బంతుల్లో 64 పరుగులు జోడించారు. సెంచరీకి చేరువైన తరుణంలో రాహుల్ వికెట్ చేజార్చుకున్నాడు. ఇక్కడి నుంచి రవీంద్ర జడేజా జోరు మొదలైంది. రెహాన్ అహ్మద్ ఓవర్లో స్లిప్స్‌లో క్యాచ్ అవుటయ్యే ప్రమాదం నుంచి తప్పించుకున్న జడేజా.. రెండు సిక్సర్లు, ఎనిమిది ఫోర్లు బాదాడు. 84 బంతుల్లోనే అర్థ సెంచరీ సాధించిన జడేజా.. తనదైన శైలిలో సెలబ్రేట్ చేసుకున్నాడు. జడేజాకు జతకలిసిన శ్రీకర్ భరత్ (41) ఆకట్టుకున్నాడు. జడేజాతో కలిసి 141 బంతుల్లో 68 పరుగులు జోడించిన భరత్ అర్థ సెంచరీ ముంగిట పెవిలియన్‌కు చేరుకున్నాడు. ఇంగ్లాండ్ స్పిన్నర్లు పరుగుల వేగానికి అడ్డుకట్ట వేసినా.. వికెట్ల వేటలో అంచనాలు అందుకోలేకపోయారు. రెండో సెషన్లో 26 ఓవర్లలో ఇంగ్లాండ్ 2 వికెట్లు పడగొట్టగా.. భారత్ 87 పరుగులు చేసింది.



ఆధిక్యం అందింది : భారత్ 421/7

టీ బ్రేక్ తర్వాత టీమ్ ఇండియా స్కోరు బోర్డు మళ్లీ వేగం పుంజుకుంది. 34 ఓవర్లలో ఇంగ్లాండ్‌కు రెండు వికెట్లే దక్కాయి. కానీ భారత్ 112 పరుగులు పిండుకుంది. దీంతో తొలి ఇన్నింగ్స్‌లో 175 పరుగుల ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. జడేజాతో సమన్వయ లోపంతో రవిచంద్రన్ అశ్విన్ (1) రనౌట్‌గా నిష్క్రమించాడు. భారత బ్యాటింగ్ లైనప్‌లో సింగిల్ డిజిట్ స్కోరుకు పరిమితమైన ఏకైక ఆటగాడు అశ్వినే. అక్షర్ పటేల్ (35 బ్యాటింగ్) ఆఖరు మూడు బంతులను బౌండరీ లైన్ దాటించి అదిరే ముగింపు అందించాడు. ఓ ఫోర్, సిక్సర్, ఫోర్‌తో దంచికొట్టాడు. రెండో రోజు ఆట ముగిసే సమయానికి రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్ అజేయంగా నిలిచారు. ఇంగ్లాండ్ స్పిన్నర్లు టామ్ హార్ట్లీ, జో రూట్‌లు రెండు వికెట్లు పడగొట్టారు. జాక్ లీచ్, రెహాన్ అహ్మద్ చెరో వికెట్ తీసుకున్నారు. పేసర్ మార్క్‌వుడ్ 13 ఓవర్లు వేసినా వికెట్ దక్కలేదు.

లీచ్‌కు గాయం?!

ఉప్పల్ పిచ్ స్పిన్‌కు అనుకూలిస్తోంది. తొలి రోజే భారత స్పిన్నర్ల వికెట్ల జాతర సాగించారు. ఇంగ్లాండ్ జట్టులో ముగ్గురు స్పెషలిస్ట్ స్పిన్నర్, ఓ పార్ట్‌టైమ్ స్పిన్నర్ ఉన్నారు. దీంతో ఇంగ్లాండ్ సైతం గట్టిగానే మాయ చేస్తుందనే అంచనాలు ఉన్నాయి. కానీ ఇంగ్లాండ్ స్పిన్నర్లు వికెట్ల వేటలో విఫలమయ్యారు. 3.82 రన్‌రేట్‌తో భారత్ పరుగులు చేసింది. ఇక జట్టులో సీనియర్ స్పిన్నర్ జాక్ లీచ్ తొలి రెండు సెషన్లలో ఎక్కువగా బౌలింగ్ చేయలేదు. అరంగ్రేట స్పిన్నర్ టామ్ హార్ట్లీ టీ విరామం వరకు అధిక ఓవర్లు వేశాడు. టామ్ 5.24 ఎకానమీతో పరుగులు ధారాళంగా ఇచ్చుకున్నాడు. రెహాన్ అహ్మద్ 4.56 ఎకానమీతో బ్యాటర్ల ముందు తేలిపోయాడు. జాక్ లీచ్ 2.16 ఎకానమీతో బ్యాటర్లపై ఒత్తిడి పెంచాడు. కానీ మరో ఎండ్‌లో ఒత్తిడిని రెట్టింపు చేసే స్పిన్నర్ కరువయ్యాడు. దీంతో భారత బ్యాటర్లు స్వేచ్ఛగా పరుగులు పిండుకున్నారు. జాక్ లీచ్‌కు కాకుండా టామ్ హార్ట్లీకి ఎక్కువ ఓవర్లు ఇవ్వటంపై రెండో రోజు ఆట అనంతరం ఇంగ్లాండ్ శిబిరం నుంచి వివరణ వచ్చింది. ఫీల్డింగ్ చేస్తుండగా జాక్ లీచ్ మోకాలికి గాయం కావటంతోనే తొలి రెండు సెషన్లలో ఎక్కువగా బంతి అందుకోలేదని తెలిసింది.

స్కోరు వివరాలు

ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్ : 246/10

భారత్ తొలి ఇన్నింగ్స్ : యశస్వి జైస్వాల్ (సి,బి) రూట్ 80, రోహిత్ శర్మ (సి) స్టోక్స్ (బి) జాక్ లీచ్ 24, శుభ్‌మన్ గిల్ (సి) డకెట్ (బి) హార్ట్లీ 23, కెఎల్ రాహుల్ (సి) రెహాన్ అహ్మద్ (బి) హార్ట్లీ 86, శ్రేయస్ అయ్యర్ (సి) హార్ట్లీ (బి) రెహాన్ అహ్మద్ 35, రవీంద్ర జడేజా బ్యాటింగ్ 81, శ్రీకర్ భరత్ (ఎల్బీ) రూట్ 41, రవిచంద్రన్ అశ్విన్ రనౌట్ 1, అక్షర్ పటేల్ బ్యాటింగ్ 35, ఎక్స్‌ట్రాలు : 15, **మొత్తం :(110 ఓవర్లలో 7 వికెట్లకు) 421.**

వికెట్ల పతనం : 1-80, 2-123, 3-159, 4-223, 5-288, 6-356, 7-358.

బౌలింగ్ : మార్క్‌వుడ్ 13-0-43-0, టామ్ హార్ట్లీ 25-0-131-2, జాక్ లీచ్ 25-6-54-1, రెహాన్ అహ్మద్ 23-3-105-1, జో రూట్ 24-2-77-2.

తన్మయ్ ట్రిపుల్ సెంచరీ

160 బంతుల్లోనే 323 పరుగులు



హైదరాబాద్ : హైదరాబాద్ ఓపెనర్ తన్మయ్ అగర్వాల్ (323 బ్యాటింగ్, 160 బంతుల్లో 33 ఫోర్లు, 21 సిక్స్‌లు) ఆకాశమే హద్దుగా చెలరేగాడు. రంజీ ట్రోఫీ ప్లేట్ గ్రూప్‌లో పసికూన అరుణాచల్ ప్రదేశ్ బౌలర్లను ఊచకోత కోశాడు. రెడ్‌బాల్ ఫార్మాట్‌లో టీ20 తరహా విధ్వంసం సృష్టించాడు. కెప్టెన్ రాహుల్ సింగ్ (185, 105 బంతుల్లో 26 ఫోర్లు, 3 సిక్స్‌లు) సైతం శివమెత్తాడు. ఈ ఇద్దరూ తొలి వికెట్‌కు 40.2 ఓవర్లలోనే 449 పరుగుల రికార్డు తొలి వికెట్ భాగస్వామ్యం నమోదు చేశారు. అభిరాత్ రెడ్డి (19 బ్యాటింగ్), తన్మయ్ అజేయంగా నిలిచారు. తొలుత అరుణాచల్ ప్రదేశ్ 39.2 ఓవర్లలో 172 పరుగులకే కుప్పకూలింది. హైదరాబాద్ బౌలర్లలో చామ మిలింద్ (3/36), కార్తికేయ కక్ (3/28), తనయ్ త్యాగరాజన్ (2/53) రాణించారు. తొలి రోజు ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో హైదరాబాద్ 357 పరుగుల ఆధిక్యంలో నిలిచింది.

జకోవిచ్‌కు షాక్

సెమీస్‌లో సిన్నర్ చేతిలో ఓటమి
ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్







మెల్‌బోర్న్ (ఆస్ట్రేలియా) : ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్‌లో అతిపెద్ద సంచలనం నమోదైంది. డిఫెండింగ్ చాంపియన్, 24 గ్రాండ్‌స్లామ్ టైటిళ్ల మొనగాడు నొవాక్ జకోవిచ్‌కు సెమీఫైనల్లో భంగపాటు ఎదురైంది. పురుషుల సింగిల్స్‌లో వరల్డ్ నం.1, టాప్ సీడ్ సెర్బియా యోధుడు నాలుగు సెట్ల సమరంలో పరాజయం చెందాడు. 3 గంటల 22 నిమిషాల పాటు సాగిన సెమీఫైనల్ సమరంలో జకోవిచ్ అనూహ్య ఓటమి చవిచూశాడు. 6-1, 6-2, 6-7(6-8), 6-3తో ఇటలీ ఆటగాడు జానిక్ సిన్నర్ (4వ సీడ్) అసమాన విజయం సాధించాడు. సెమీఫైనల్స్ వరకు ఏకపక్ష విజయాలు సాధించిన జకోవిచ్‌కు ఫైనల్లో బెర్త్ లాంఛనమే అనిపించింది. కానీ జానిక్ సిన్నర్ సెమీస్‌లో చిచ్చరపిడుగులా చెలరేగాడు. తొలి రెండు సెట్లను 6-1, 6-2తో నెగ్గిన సిన్నర్‌కు మూడో సెట్లో గట్టి పోటీ ఎదురైంది. మూడో సెట్‌ను టైబ్రేకర్‌లో జకోవిచ్ దక్కించుకున్నాడు. నాల్గో సెట్‌ను సైతం సిన్నర్ 6-3తో సొంతం చేసుకోవటంతో కెరీర్ 25వ గ్రాండ్‌స్లామ్‌పై కన్నేసిన జకోవిచ్ ఆశలు ఆవిరయ్యాయి. జకోవిచ్ 7 ఏస్‌లు కొట్టగా, సిన్నర్ 9 ఏస్‌లు కొట్టాడు. జకోవిచ్ ఒక్క బ్రేక్ పాయింట్ సాధించలేదు. సిన్నర్ మాత్రం జకోవిచ్ సర్వ్‌ను ఐదు సార్లు బ్రేక్ చేశాడు. పాయింట్ల పరంగా 128-98తో జానిక్ సిన్నర్ స్పష్టమైన ఆధిపత్యం చూపించాడు. మెన్స్ సింగిల్స్ మరో సెమీఫైనల్లో డానిల్ మెద్వదేవ్ విజయం సాధించాడు. ఐదు సెట్ల పాటు సాగిన మ్యాచ్‌లో డానిల్ మెద్వదేవ్ (రష్యా) 5-7, 3-6, 7-6(7-4), 7-6(7-5), 6-3తో అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ)పై పైచేయి సాధించాడు. ఉత్కంఠగా సాగిన మ్యాచ్‌లో తొలి రెండు సెట్లు జ్వెరెవ్ సొంతం చేసుకున్నాడు. తర్వాతి రెండు సెట్లను టైబ్రేకర్‌లో సాధించిన జ్వెరెవ్.. నిర్ణయాత్మక ఐదో సెట్‌లో తన మార్క్ చూపించాడు. ఆదివారం జరిగే మెన్స్ సింగిల్స్ ఫైనల్లో మూడో సీడ్ డానిల్ మెద్వదేవ్‌తో నాల్గో సీడ్ జానిక్ సిన్నర్ తలపడనున్నాడు.

తెలుగు చిత్ర పరిశ్రమకి చిరంజీవి మూడో కన్ను..



వెంకయ్యనాయుడు, చిరంజీవి

కథానాయకుడు, సమాజ సేవకుడు చిరంజీవికి కేంద్ర ప్రభుత్వం పద్మ విభూషణ్ పురస్కారం ప్రకటించిన విషయం విదితమే. ఆయనతో పాటు ఈ ఏడాది మాజీ ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్య నాయుడుని సైతం పద్మ విభూషణ్ వరించింది. ఈ ఇద్దరు పద్మ విభూషణులు శుక్రవారం ఆత్మీయంగా కలవడం విశేషం. వెంకయ్య నాయుడు మాట్లాడుతూ, 'తెలుగు చిత్ర పరిశ్రమకు ఎన్టీ రామారావు, అక్కినేని నాగేశ్వరరావు రెండు నేత్రాలు అయితే చిరంజీవి మూడో నేత్రం. ఆయన త్రినేత్రుడు. చిరంజీవి పద్మ విభూషణ్‌కి పూర్తిగా అర్హులు. సరైన సమయంలో భారత ప్రభుత్వం ఆయనకు సముచిత గౌరవం ఇచ్చింది' అని అన్నారు. 'చాలా విషయాల్లో నేను వెంకయ్య నాయుడుని స్ఫూర్తిగా తీసుకుంటా. ఆయన్ను పద్మ విభూషణ్ అవార్డుతో భారత ప్రభుత్వం సత్కరించడం, గౌరవించడం నాకు చాలా సంతోషంగా ఉంది' అని అన్నారు.

ఈ పురస్కారాన్ని ఊహించలేదు : చిరు

శుక్రవారం చిరంజీవి బ్లడ్ బ్యాంక్‌లో రిపబ్లిక్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. జెండా వందనం చేసిన అనంతరం చిరంజీవి మాట్లాడుతూ, 'ఈ రిపబ్లిక్ డే నా వరకు ఎంతో ప్రత్యేకతను సంతరించుకుంది. అందుకు కారణం.. నా 45 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణంలో నేను ఈ సినీ కళామతల్లికి సేవ చేసుకున్నాను. అలాగే కళాకారులకు సామాజిక బాధ్యత కూడా ఉంది అనేదాన్ని నా బాధ్యతగా భావించాను. నేను చేసిన ఈ సేవలను గుర్తించి 2006లో నాకు పద్మ భూషణ్ అవార్డునిచ్చారు. అదే చాలా ఎక్కువ ప్రోత్సాహానిచ్చింది. అయితే పద్మవిభూషణ్ అవార్డును నేను ఊహించలేదు. 2024లో నా కళ, సామాజిక సేవలను గుర్తించి పద్మవిభూషణ్‌ను కేంద్ర ప్రభుత్వం ప్రకటించటం అనేది ఎంతో సంతోషాన్నిస్తుంది. అభిమానుల ప్రోత్సాహం ఇలాగే ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను' అని అన్నారు.

దేశ వ్యాప్తంగా సినిమా రంగానికి సంబంధించి చిరంజీవితోపాటు అలనాటి మేటి నటి వైజయంతి మాలకు పద్మవిభూషణ్ లభించగా, నటుడు విజయకాంత్‌కు మారణాంతరం పద్మ భూషణ్ వరించడం విశేషం. అలాగే బాలీవుడ్ స్టార్ మిథున్ చక్రవర్తికి పద్మభూషణ్, నేపథ్య గాయని ఉషా ఉతుప్‌కి కూడా పద్మ భూషణ్ పురస్కారాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది.





విజయకాంత్, వైజయంతి మాల





మిథున్ చక్రవర్తి, ఉషా ఉతుప్

నవచిత్రం

ఈగల్

రవితేజ, కార్తీక్ ఘట్టమనేని కాంబినేషన్‌లో రూపొందుతున్న యాక్షన్ థ్రిల్లర్ 'ఈగల్'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మించిన ఈ చిత్రం ఫిబ్రవరి 9న రిలీజ్‌కు సిద్ధంగా ఉంది. రవితేజ పుట్టినరోజు, గణతంత్ర దినోత్సవం సందర్భంగా మేకర్స్ రాకింగ్ నెంబర్ 'ఈగల్స్ ఆన్ హిజ్ వే'ను విడుదల చేశారు.దావ్ జాంద్ స్కోర్ చేసిన ఈ పాట రవితేజ పోషించిన సహదేవ్ అకా ఈగల్ పాత్ర తాలూకా వైల్డ్ నేచర్‌ని తెలియజేస్తుంది. ఈ ఎలక్ట్రిఫైయింగ్ ట్రాక్‌లో ఇంగ్లీష్ లిరిక్స్ రాసిన జార్జినా మాథ్యూ, స్వయంగా వోకల్స్‌ని కూడా అందించారు. ఈ థీమ్ నెంబర్ ఈగిల్‌కి తగిన ఎలివేషన్‌లను ఇచ్చింది. విజువల్స్ రవితేజని కిల్లర్ అవతార్‌లో చూపిస్తున్నాయి. ఒరిజినల్ విజువల్స్‌తో సినిమాలో ఈ పాటను చూసినప్పుడు ఇంపాక్ట్ మరింత ఎక్కువగా ఉంటుంది. ఈ సినిమాలో రవితేజ మల్టిపుల్ షేడ్స్ ఉన్న పాత్రలో కనిపిస్తున్నారు. అనుపమ పరమేశ్వరన్ కథానాయికగా నటిస్తుండగా, కావ్య థాపర్ మరో కథానాయిక. టీజీ విశ్వ ప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, వివేక్ కూచిభొట్ల సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు.

మిస్టర్ బచ్చన్

శుక్రవారం గణతంత్ర దినోత్సవంతో పాటు రవితేజ పుట్టినరోజు. ఈ ప్రత్యేక సందర్భంలో రవితేజగా కథానాయకుడిగా హరీష్ శంకర్ దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మాణంలో తెరకెక్కుతున్న చిత్రం 'మిస్టర్ బచ్చన్'. ఈ సినిమా నుంచి రవితేజను వింటేజ్ మాస్ అవతార్‌లో ప్రజెంట్ చేస్తూ ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ పోస్టర్ యాక్షన్ సీక్వెన్స్‌లో గూండాలు నేలపై పడివుండటం మనం చూడవచ్చు. రవితేజ తదితరులు పాల్గొంటున్న కొత్త షెడ్యూల్ కరైకూడిలో జరుగుతోంది. నామ్‌తో సునా హోగా అనే ట్యాగ్‌లైన్‌తో రూపొందుతున్న ఈ చిత్రంలో భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తోంది. పనోరమా స్టూడియోస్, టి-సిరీస్ సంయుక్తం ప్రజెంట్ చేస్తున్నాయి.

ఎఫ్ఎన్‌సీసీలో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుక

ఫిలింనగర్ కల్చరల్ సెంటర్ (ఎఫ్ఎన్‌సీసీ)లో శుక్రవారం 75వ గణతంత్ర దినోత్సవ వేడుక ఆద్యంతం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఎఫ్ఎన్‌సీసీ ప్రెసిడెంట్ జి.ఆదిశేషగిరి రావు జెండా ఆవిష్కరణ చేసి గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఎఫ్ఎన్‌సీసీ దేశంలోనే ఒక ప్రతిష్టాత్మకమైన క్లబ్‌గా దినదినాభివృద్ధి చెందుతున్నట్టు కొనియాడారు. సెక్రటరీ ముళ్ళపూడి మోహన్, వైస్ ప్రెసిడెంట్ టి.రంగారావు, కమిటీ మెంబర్ కాజా సూర్యనారాయణ, ఫార్మర్ ప్రెసిడెంట్ డాక్టర్ కేఎల్ నారాయణ, ఫార్మర్ సెక్రెటరీ సోమరాజు, ఫార్మర్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ కే వెంకటేశ్వర్ రావు రిపబ్లిక్ డేని పురస్కరించుకుని తమ సందేశాలను అందించారు. అలాగే భారత మాజీ ఉపరాష్ట్రపతి శ్రీ ఎం. వెంకయ్య నాయుడుకి పద్మ విభూషణ్ వచ్చిన సందర్భంగా ఎఫ్ఎన్‌సీసీ ప్రెసిడెంట్ జి.ఆదిశేషగిరిరావు, వైస్ ప్రెసిడెంట్ టి.రంగారావు, సెక్రటరీ ముళ్ళపూడి మోహన్, జాయింట్ సెక్రెటరీ వి.వి.ఎస్.ఎస్.పెద్దిరాజు, ట్రెజరర్ బి. రాజశేఖర్ రెడ్డి, కమిటీ మెంబర్స్ కాజా సూర్యనారాయణ, జే. బాలరాజు, ఏ. గోపాలరావు వెంకయ్య నాయుడుని కలిసి అభినందించి, వారికి శుభాకాంక్షలు తెలియజేశారు.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886